

'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 55

శుక్రవారం 17-5-2024



ప్లే ఆఫ్స్‌కు సన్‌రైజర్స్...

గుజరాత్‌తో మ్యాచ్ రద్దు. 15 పాయింట్లతో మూడో స్థానానికి హైదరాబాద్ - 13లో



అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై

వచ్చే నెలలో భారత్ తరఫున చివరి మ్యాచ్ ఆడనున్న కెప్టెన్ సునీల్ ఛెత్రి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



దేశంలో అల్లర్లకు విపక్షాల కుట్ర

పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా అల్లర్లకు విపక్షాలు కుట్ర పన్నుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు.

- వివరాలు 6లో



గోవధను అడ్డుకుంటాం

కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రాగానే గోవధను అనుమతించబోమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో



బీజేపీ రిజర్వేషన్లు తొలగిస్తుంది

లోక్‌సభ ఎన్నికల్లో 400పైగా సీట్లు సాధించి రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీ చూస్తోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు.

- వివరాలు 6లో



ఉక్రెయిన్‌పై రాజకీయ పరిష్కారం

ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవడానికి త్వరలోనే రాజకీయ పరిష్కారం కనుగొంటామని చైనా అధినేత షీ జిన్‌పింగ్ సంకేతాలిచ్చారు.


- వివరాలు 6లో

భూమి విలువ పెంచండి

రాష్ట్రంలో భూముల ధరల పెంపునకు చర్యలు తీసుకోవాలన్న సీఎం రేవంత్

రిజిస్ట్రేషన్ విలువకు, వాస్తవ విలువకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోందని వెల్లడి

- నిబంధనల ప్రకారం ఏడాదికోసారి పెంచాలి
- రాష్ట్రంలో అన్నిచోట్లా భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయి
- ఆ స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదు
- ఏయే ప్రాంతాల్లో ధరలు సవరించాలి.. వేటికి ఎంత సవరించాలో శాస్త్రీయంగా నిర్ధారించాలి
- రాబడి పెంపుతో పాటు స్థిరాస్తి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా సవరణ ఉండాలి
- ఆదాయం పెంపు మార్గాలపై ఉన్నతస్థాయి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల విలువల పెంపునకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూముల రిజిస్ట్రేషన్ విలువకు, వాస్తవ విలువకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోందని.. అందువల్ల భూముల మార్కెట్ విలువను సవరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 2021లో గత ప్రభుత్వం భూముల విలువను, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచిందని, అయినా ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు మధ్య భారీ తేడా అలాగే కొనసాగుతోందని అన్నారు. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉందని గుర్తు చేశారు. గురువారం సచివాలయంలో.. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన శాఖలైన వాణిజ్య పన్నులు, స్టాంపులు.. రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, గనులు, రవాణా శాఖలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో కలిసి ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో అన్నిచోట్లా భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, కానీ అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు.

స్టాంప్ డ్యూటీపై అధ్యయనం చేయండి

'ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి. వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలి. రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగం నిబంధనలను పక్కాగా పాటించాలి. రాష్ట్ర రాబడి మిగతా 2వ పేజీలో ▶

అంచనాలకు మించి పన్ను రాబడి

- వరుసగా మూడో ఏడాది పన్ను ఆదాయంలో వృద్ధి... కాగ్ గణాంకాల వెల్లడి
- 2023–24లో బడ్జెట్ ప్రతిపాదనలకు మించి వచ్చిన రాబడులు
- బడ్జెట్ ప్రతిపాదన రూ.1.31 లక్షల కోట్లు.. రాబడి రూ.1.35 లక్షల కోట్లు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.48 వేల కోట్ల పన్ను ఆదాయం
- అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రూ.2 వేల కోట్లు ఎక్కువ

2లో



గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సంగారెడ్డి జిల్లా పుల్‌కల్‌లో తడిసిన ధాన్యం

దంచి.. ముంచి

రాష్ట్రంలో చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు

పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో తడిచిన ధాన్యం

వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ముగ్గురు మృతి

గ్రేటర్ హైదరాబాద్‌లో కుండపోత... మరో రెండ్రోజులు రాష్ట్రంలో వానలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: నైరుతి రుతుపవనాలు రాకముందే రాష్ట్రంలో భారీ వర్షం కురిసింది. గురువారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ నుంచి అతి భారీ వర్షం కురవగా... రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం వరకు ఎండవేడితో ఉక్కిరిబిక్కిరైన గ్రేటర్ ప్రజలకు మధ్యాహ్నం 3.30గంటల సమయంలో మొదలైన వాన ఉపశమనాన్ని ఇచ్చింది. గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని గంటకుపైగా ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. కుండపోత వానతో నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారుల వెంట ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. సికింద్రాబాద్‌లో అత్యధికంగా 11.6 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కృష్ణానగర్‌లో 9, షేక్‌పేటలో 8.65, అంబర్‌పేట్‌లో 8.45, నాంపల్లిలో 8.3, ఖైరతాబాద్‌లో 7.73 సెం.మీ. నమోదైంది. హైదరాబాద్ జిల్లాతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. అదేవిధంగా సిద్దిపేట, కరీంనగర్, మెదక్, వనపర్తి, మంచిర్యాల, ఆసిఫాబాద్, కామారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, మహబూబ్‌నగర్, జగిత్యాల, జనగామ, పెద్దపల్లి, సిరిసిల్ల, భువనగిరి, నిజామాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 199 ప్రాంతాల్లో ఒక సెంటీమీటర్ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళికా విభాగం వెల్లడించింది. సాధారణంగా మే నెల మధ్యలో మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

బ్యారేజీలకు తక్షణ మరమ్మతులు



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు యుద్ధప్రాతిపదికన అత్యవసర మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్లను రాష్ట్ర నీటిపారుదల శాఖ కోరింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ రామగుండం చీఫ్ ఇంజనీర్ కె.సుధాకర్‌రెడ్డి కాంట్రాక్టు సంస్థలకు వేర్వేరుగా లేఖలు రాశారు.

- వివరాలు 3లో

మీ దగ్గర ఏదైనా సమాచారం ఉందా ?



గత బీఆర్‌ఎస్ సర్కార్ నామినేషన్ల ప్రాతిపదికన ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టడంతో నష్టం వాటిల్లిందన్న ఆరోపణలపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ బహిరంగ ప్రకటన జారీ చేసింది.

- వివరాలు 3లో

గోపిరెడ్డి హత్యకు చదలవాడ కుట్ర..!



నరసరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపైకి సుమారు 200 మంది టీడీపీ రౌడీలు మారణాయుధాలతో పట్టపగలు దాడికి వెళ్లారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన మామ కంజుల రామకోటిరెడ్డిపై దాడికి తెగబడ్డారు.

- వివరాలు 5లో

'ఆర్టీసీ విలీనం' అంతేనా?



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదున్నర నెలలు దాటినా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై కిమ్మనడం లేదు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఎన్నిసార్లు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నోరు మెదపడం లేదు.

- వివరాలు 14లో

ఇక నిత్యం క్షేత్రస్థాయిలోనే..

బీఆర్‌ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్



- ఎన్నికల ఫలితాల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదు
- రైతాంగంతో పాటు అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- ఆ దిశగానే పార్టీ కార్యక్రమాలు
- పలువురు నేతలతో పాటు లోక్‌సభ అభ్యర్థులతో సమావేశం...పార్లమెంటు ఎన్నికల పోలింగ్, ఇతర అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల ఫలితాల కోసం వేచి చూడకుండా ఇకపై నేతలు, పార్టీ యంత్రాంగం నిత్యం క్షేత్ర స్థాయిలోనే ఉండేలా కార్యాచరణ ఉంటుందని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. రైతాంగంతో పాటు అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా పార్టీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థులు, కొందరు నేతలు గురువారం ఎర్రవల్లి నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల పోలింగ్ తీరుతెన్నులతో పాటు ఇతర అంశాలపై చర్చ జరిగింది. వరికి రూ.500 బోనస్, ధాన్యం కొనుగోలు అంశాలపై గురువారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాలపై ఆరా తీశారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, కార్యవర్గాల ఏర్పాటు లాంటివి ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత చేపట్టే అవకాశమున్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. జిల్లాల వారీగా శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, కిందిస్థాయి వరకు సోషల్ మీడియా విభాగం బలోపేతం తదితరాలకు మిగతా 5వ పేజీలో ▶



సన్న వడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనకు నిరసనగా గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు

మరోసారి చరిత్ర సృష్టించబోతున్నాం



గురువారం విజయవాడలో ఐ-ప్యాక్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ

పోలింగ్ సరళిపై తొలిసారిగా స్పందించిన ఏపీ సీఎం జగన్

2019కి మించి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

జూన్ 4న ఘన విజయంతో దేశం మొత్తం మన వైపే చూస్తుంది

59 నెలలుగా ప్రజలకు మంచి చేశాం.. వచ్చే ఐదేళ్లు మరింత మేలు చేద్దాం

విజయవాడలో ఐ-ప్యాక్ ప్రతినిధులతో భేటీ

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి, ఫలితాల అంచనాపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా స్పందించారు. మరోసారి చరిత్ర సృష్టించబోతున్నామని, మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పొలిటికల్ కన్సల్టెన్సీగా పని చేసిన ఐ–ప్యాక్ (ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ) కార్యాలయాన్ని మిగతా 5వ పేజీలో ▶

'ఇందిరమ్మ'కు కొత్త దరఖాస్తులు?

ఊళ్లు, లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలే కీలకం

తుదిగా ఆమోద ముద్ర వేయనున్న ఇన్‌చార్జి మంత్రి

నిరంతర ప్రక్రియగా దరఖాస్తుల స్వీకరణ!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరోసారి ప్రారంభం కాబోతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో శాసన సభ్యులదే కీలక భూమిక కానుంది. ముఖ్యంగా లబ్ధిదారుల జాబితాలు రూపొందించే విషయంలో వీరు ప్రధాన పాత్ర పోషించనున్నారు. నాలుగు నెలల క్రితం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వివిధ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. వీటిల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 80 లక్షలకుపైగా దరఖాస్తులు అందగా, వాటిల్లో ప్రాథమిక స్థాయిలో 16 లక్షల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 64 లక్షల దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. కానీ ఇప్పుడు శాసనసభ్యుల ఆధ్వర్యంలో జాబితా రూపొందించనున్నందున, ఈ దరఖాస్తులతో పాటు కొత్తగా మళ్లీ దరఖాస్తులు స్వీకరించే అవకాశం కనిపిస్తోంది.

ఎమ్మెల్యేలదే హవా..

నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికీ ఏ పథకంలో కూడా ఇళ్లు అందని పేదలనే ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దరఖాస్తుల స్క్రూటినీ కీలకంగా మారనుంది. ప్రజాపాలనలో అందిన మిగతా 2వ పేజీలో ▶

పాత దరఖాస్తులు అలంకారప్రాయమే!

ఇలాంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవటం నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. లబ్ధిదారుల ఎంపికలో చాలా అంశాలను అధికార పార్టీ ఎమ్మెల్యేలు పరిగణనలోకి తీసుకుంటారు. ఈ క్రమంలోనే కొత్తగా దరఖాస్తులు స్వీకరించి మరీ జాబితాలు రూపొందించే అవకాశం ఉందని అంటున్నారు. అదే జరిగితే ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు అలంకారప్రాయంగానే మిగిలిపోయే పరిస్థితి ఉండనుంది.

క్లుప్తంగా...

కవిత బెయిల్ పిటిషన్‌పై సీబీఐకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు సీబీఐకి నోటీసులు జారీ చేసింది. బెయిల్ కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్లను గురువారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారించారు. కవిత తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపిస్తూ.. ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీలోవున్న పిటిషనర్‌ను సీబీఐ కూడా అరెస్టు చేసిందన్నారు. కవిత అరెస్టుకు అనుమతిస్తూ.. సీబీఐకి ట్రయల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అనంతరం కవిత బెయిల్ పిటిషన్‌పై వైఖరి తెలపాలంటూ సీబీఐకి న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు.

బీజేపీ 12 ఎంపీ సీట్లు గెలవబోతోంది: ఈటల



నల్లగొండ టూటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 12 ఎంపీ సీట్లు గెలవబోతోందని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం నల్లగొండలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశానికి హాజరైన ఈటల మీడియాతో మాట్లాడారు. అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కేసీఆర్ మీద ఉన్న వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేశారని అన్నారు. హామీలు అమలు చేయకుండా మొహం చాటేయడంతో సీఎం రేవంత్‌ని ప్రజలు ఛీకొడుతున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలో భారత్‌ను ఆర్థికంగా అగ్రగామిగా నిలబెట్టిన ఘనత మోదీదే అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత ఈటల వెంట ఉన్నారు.

6 గ్యారంటీల అమలు అసాధ్యం: కొండా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరమైన పరిస్థితుల్లో ఉన్నందున రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఆచరణలోకి తీసుకురావడం అసాధ్యమని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మొత్తం ఆరు గ్యారంటీలు కూడా అమలు చేయడం సాధ్యం కాదని చెప్పారు. ఒక్క రుణమాఫీ హామీ అమలు కోసమే రూ.32 వేల కోట్లు అవసరమని చెప్పారు. గురువారం విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కార్ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని, ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులుంటే రైతుల రుణమాఫీకి రూ.32 వేల కోట్లు ఇవ్వ డం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలోనే రైతు సమస్యలు మొదలయ్యాయని, రైతాంగాన్ని ఆయన నట్టేట ముంచారని మండిపడ్డారు.

‘ఇందిరమ్మ’కు కొత్త దరఖాస్తులు?

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తుల్లో చాలావరకు గతంలో ఇళ్లు పొందిన వారికి సంబంధించినవీ ఉన్నాయని సమాచారం. ఆధార్ నంబరు, ఇతర వివరాల ఆధారంగా ఇప్పటికే ఆ విధంగా ఇళ్లు పొందినవారి దరఖాస్తులను తొలగించనున్నారు. అయితే గతంలో ఇల్లు పొందినా, ఆ తర్వాత వారి పిల్లల పెళ్లిళ్లు కావటంతో మరో ఇంటి అవసరం ఉంటుంది. అప్పుడు ఆ దరఖాస్తు అర్హమైనదే అవుతుంది. దీంతో దరఖాస్తుల్లోని వివరాల పరిశీలనే కాకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాల్సి ఉంటుంది. దీనిపై పెద్దయెత్తున కసరత్తు అవసరం కాగా.. లబ్ధిదారుల ఎంపికలో తుది ఆమోదముద్ర జిల్లా ఇన్‌చార్జి మంత్రే వేయనున్నారు. అంటే ఎమ్మెల్యేలు సిఫారసు చేసే వాటికే ఆమోదముద్ర పడే అవకాశం ఉంటుంది. ఏయే ఊళ్లను ఎంపిక చేయాలి, ఆ ఊళ్లలో ఎవరికి ఇళ్లు మంజూరు చేయాలి అన్న దానిపై ఎమ్మెల్యేల నిర్ణయానికే ప్రాధాన్యం దక్కనుంది. దీంతో ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులకే వీరు పరిమితం అయ్యే పరిస్థితి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అంచనాలకు మించి..

వరుసగా మూడో ఏడాది పన్ను ఆదాయంలో వృద్ధి

- 2023–24లో బడ్జెట్ ప్రతిపాదనలకు మించి వచ్చిన రాబడులు
- బడ్జెట్ ప్రతిపాదన రూ.1.31 లక్షల కోట్లు..వాస్తవిక రాబడి రూ.1.35 లక్షల కోట్లు
- కాగ్ గణాంకాల వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.48 వేల కోట్ల పన్ను ఆదాయం
- అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రూ.2 వేల కోట్లు ఎక్కువ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పన్ను ఆదాయం ఏటేటా పెరుగుతోంది. వరుసగా మూడో ఏడాది పన్ను రాబడుల్లో వృద్ధి నమోదు అయ్యింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లెక్కల ప్రకారం మార్చి 2024 నాటికి రూ.1.35 లక్షల కోట్లు పన్ను ఆదాయం కింద సమకూరాయి. వస్తు సేవల పన్ను (జీఎస్టీ), రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, అమ్మకపు పన్ను, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నుల రూపేణా ఈ మొత్తం సమకూరిందని కాగ్ తెలిపింది. బడ్జెట్ ప్రతిపాదనల కంటే రూ.4 వేల కోట్లు ఎక్కువగా, సవరించిన అంచనాల కంటే రూ.17 వేల కోట్లు ఎక్కువగా ఈ ఏడాది పన్ను రాబడులు రావడం గమనార్హం. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్ను రాబడుల వ్యవస్థ సజావుగానే ముందుకెళుతోందని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు రాష్ట్రంలో రూ.48 వేల కోట్ల పన్ను ఆదాయం వచ్చింది.



గత మూడేళ్లుగా..

పన్ను రాబడులు తొలిసారిగా 2021–22లో బడ్జెట్ ప్రతిపాదనలకు మించి వచ్చాయి. ఆ ఏడాదిలో రూ.1.06 లక్షల కోట్లు పన్ను రాబడుల కింద వస్తాయని ప్రభుత్వం అంచనా వేయగా, రూ.1.09 లక్షల కోట్ల వాస్తవిక రాబడులు వచ్చాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఆ ఏడాది పన్ను వసూళ్లలో ఏకంగా రూ.30 వేల కోట్ల పెరుగుదల చోటు చేసుకుంది. కరోనా మహమ్మారి ప్రభావం నుంచి పూర్తిగా కోలుకుని, సాధారణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆదాయంలో మంచి వృద్ధి కనిపించింది. ఆ తర్వాతి ఏడాది కూడా బడ్జెట్ ప్రతిపాదనలతో పోల్చితే స్వల్ప పెరుగుదలే నమోదయ్యింది. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రూ.1.31 లక్షల కోట్ల పన్ను ఆదాయం వస్తుందని వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపెట్టారు. అయితే మారిన పరిస్థితుల దృష్ట్యా ఈ పన్ను రాబడులు రూ.1.18 లక్షల కోట్లు వచ్చే అవకాశముందని సవరించిన అంచనాల్లో పేర్కొన్నారు. కానీ అనూహ్యంగా వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల కంటే రూ.4 వేల కోట్లు అదనంగా రూ.1.35 లక్షల కోట్ల పన్ను ఆదాయం సమకూరింది.

శాఖల వారీగా ఇలా...!

శాఖల వారీగా పరిశీలిస్తే.. 2022–23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే జీఎస్టీ రాబడులు రూ.5 వేల కోట్ల వరకు పెరిగాయి. 2022–23లో రూ.41,888 కోట్లు జీఎస్టీ కింద రాగా, 2023–24లో రూ.46,500 కోట్లు వచ్చాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో అంతకుముందు ఏడాది రూ.14,228 కోట్లు రాగా, గత ఏడాదిలో రూ.14,295 కోట్లు వచ్చాయి. ఇక అమ్మకపు పన్ను ద్వారా 2022–23లో రూ.29,604 కోట్లు రాగా, గత ఏడాది కొంచెం ఎక్కువగా రూ.29,989 కోట్లు సమకూరాయి. ఇక ఎక్సైజ్ ద్వారా అంతకు ముందు సంవత్సరం రూ.18740 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది 20,298.89 కోట్లు వచ్చింది. కేంద్ర పన్నుల్లో వాటా కింద 2022–23లో రూ.13,394 కోట్లు రాగా, 2023–24లో రూ.16,536.65 కోట్లు వచ్చాయి. ఇతర పన్నుల రూపంలో అంతకుముందు ఏడాది రూ. 8,430 కోట్లు రాగా, ఈసారి రూ.7,918.74 కోట్లు మాత్రమే వచ్చాయి.

కాగ్ లెక్కల ప్రకారం 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి పన్ను ఆదాయ గణాంకాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ ప్రతిపాదన	వాస్తవిక రాబడులు
2019–20	89,047.14	83,585.08
2020–21	1,02,026.58	79,339.92
2021–22	1,06,900.13	1,09,991.91
2022–23	1,26,606.04	1,26,617.09
2023–24	1,31,028.65	1,35,540.17

గత ఐదు నెలల్లో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పన్ను ఆదాయ రాబడులు పెరిగాయని కాగ్ లెక్కలు చెబుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నెల నాటికి రూ. 80,853 కోట్ల పన్ను ఆదాయం వచ్చింది. ఆ తర్వాతి నాలుగు నెలల్లో మరో రూ.46 వేల కోట్లు రాగా, మొత్తం ఆ ఏడాది పన్ను ఆదాయం రూ. 1.26 లక్షల కోట్లకు చేరింది. 2023–24లో నవంబర్ నెల నాటికి రూ.87,083 కోట్లుగా నమోదైన పన్ను ఆదాయం ఏడాది చివరి నాటికి (మార్చి 2024) రూ. 1.35 లక్షల కోట్లకు చేరింది. అంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతి 4 నెలల్లో వచ్చిన పన్ను ఆదాయం రూ. 48 వేల కోట్లన్నమాట. గత ఏడాది చివరి నాలుగు నెలలతో పోలిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో పన్ను ఆదాయం రూ.2వేల కోట్లు పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి.

భూమి విలువ పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

పెంపుతో పాటు స్థిరాస్తి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా భూముల మార్కెట్ ధరల సవరణ ఉండాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది.. తగ్గించాలా.. పెంచాలా..అనేది కూడా అధ్యయనం చేయాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయి. ప్రజోపయోగాల కోసం సేకరించిన స్థలాలను గుర్తించి అధునాతన మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలి..’ అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పన్ను ఎగవేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

‘రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలి. అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా పన్నుల ఎగవేతదారులపై కఠిన చర్యలు చేపట్టాలి. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. అవసరమైన సంస్కరణలు చేపట్టాలి. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలి. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదు. ఆదాయం పెంపుపై ఇకపై ప్రతినెలా ఆదాయం సమకూర్చే శాఖల ఉన్నతాధికారులంతా సమీక్షలు జరపాలి.

తనిఖీలు, ఆడిటింగ్ పక్కాగా జరగాలి

బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకానెల లక్ష్యాలను నిర్దేశించుకుని ఆదాయం సమకూరేలా కృషి చేయాలి. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చే జీఎస్టీ ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఆడిటింగ్ పక్కాగా జరగాలి. జీఎస్టీ ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలి. జీఎస్టీ రిటర్న్స్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలి. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలి. ఇసుక నుంచి వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలి..’ అని సీఎం ఆదేశించారు

ఆదాయం ఎందుకు పెరగలేదు?

గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్ కారణంగా మద్యం అమ్మకాలు, ఇతర వస్తు విక్రయాలు ఎక్కువగా జరిగినా లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలు చెప్పాలంటూ అధికారులను రేవంత్‌రెడ్డి నిలదీశారు. మద్యం అక్రమ రవాణా, పన్ను ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



కాంగ్రెస్ తీరు అన్యాయం

ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనసగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం పలుచోట్ల బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన నివాసంలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం అన్యాయమని కమలాకర్ ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ధర్నాలు సిగ్గుచేటు: మహేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో ఏనాడూ రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్‌ఎస్ నాయకులు.. ధాన్యం గురించి ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పాలనలో కేసీఆర్ రైతుల పట్ల ఎలా ప్రవర్తించారో చూశామని, ఖమ్మంలో మిర్చి రైతులను బేడీలు వేసి కొట్టుకుంటూ తీసుకువెళ్లారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక మార్చి నెలలోనే కొనుగోలు కేంద్రాలు తెరిచి , గత ప్రభుత్వం కన్నా ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి: పీఆర్‌టీయూటీఎస్

సాక్షి, హైదరాబాద్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు తక్షణమే చేపట్టాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సంఘం నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. టెట్‌తో నిమిత్తం లేకుండా హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని, గతంలో ట్రాన్స్‌ఫర్ అయిన టీచర్లను రిలీవ్ చేయాలని కోరారు. టెట్‌పై సరైన సమాచారం ఇవ్వకుండా గందరగోళం చేసిన పాఠశాల విద్య కమిషనర్ దేవసేన, అదనపు సంచాలకులు లింగయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కూళ్ల ప్రారంభం నాటికి పూర్తి: టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే పూర్తి చేయాలని భావిస్తున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం చెప్పినట్లు ఉపాధ్యాయుల ఉమ్మడి కార్యాచరణ సంఘం నేతలు చావా రవి, కె.జంగయ్య తెలిపారు.

‘అభయహస్తం.. భస్మాసుర హస్తంగా మారింది’



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం కాస్తా ప్రజల పాలిట భస్మాసుర హస్తంగా మారిందని బీజేపీ నేత, భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలపై హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఆరు మోసాలకు పాల్పడిందని మండిపడ్డారు. భువనగిరిలో ఎన్నికల ప్రచారం సందర్భంగా రుణ మాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి.. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేశారని, కానీ ఆగస్టు 15 తర్వాత ఆయన ప్రజలను మరోసారి ఏప్రిల్ ఫూల్ చేయబోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి అంటే చెప్పింది అమలు చేయాలి కాని, ఇచ్చిన హామీల అమలు కోసం దేవుడిపై ప్రమాణం చేయడం కాదన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏదో ఒకసాకు చెప్పి రుణ మాఫీ హామీని ఎగ్గొట్టేందుకు రేవంత్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం దుర్మార్గమన్నారు. భువనగిరి నుంచి తాను బీజేపీ ఎంపీగా కచ్చితంగా గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు.

9 సీట్లలో గెలుపు ఖాయం

సాక్షి , హైదరాబాద్

ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 9 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆ పార్టీ నియమించిన ఎన్నికల నిర్వహణ కమిటీ తేల్చి చెప్పింది. మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు గాను 13 చోట్ల గెలిచే అవకాశాలు ఉన్నప్పటికీ, పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమైనట్లు పేర్కొంది. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ కన్వీనర్‌గా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, పుష్పలీల, రాములు నాయక్ తదితరులు సభ్యులుగా ఏర్పాటైన కమిటీ.. ఈ మేరకు ఒక మధ్యంతర నివేదికను ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి సమర్పించింది. తాము పార్లమెంటు నియోజకవర్గాల వారీగా గుర్తించిన అంశాలను గురువారం గాంధీభవన్లో మున్షీకి వివరించింది. బీఆర్‌ఎస్‌ను నిలువరించగలిగినప్పటికీ, ఆపార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు తిప్పుకోవడంలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదని తెలిపింది. బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి మళ్లి, కొన్నిచోట్ల కాంగ్రెస్ గెలుపు అవకాశాలను దెబ్బకొట్టినట్లు పేర్కొంది.

13 నుంచి 14 సీట్లు లక్ష్యంగా పనిచేసినా..

లోక్‌సభ ఎన్నికల్లో 13 నుంచి 14 సీట్లు గెలవాలనే లక్ష్యంతో పార్టీ పనిచేసినప్పటికీ, ఎన్నికల నిర్వహణలో సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లక పోవడం వల్ల నాలుగైదు సీట్లలో వెనుకబడినట్లు కమిటీ తన నివేదికలో పేర్కొంది. పెద్దపల్లి, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్, భువనగిరి, జహీరాబాద్‌లలో ప్రత్యర్థి పార్టీల కన్నా బలంగా ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల్లో పోల్ మేనేజ్‌మెంట్‌లో 2 శాతం నుంచి 8 శాతం వరకు మెరుగ్గా ఉంటే, నాలుగైదు నియోజకవర్గాల్లో 25 శాతం వరకు మెరుగైన స్థానంలో ఉన్నట్లు తెలిపింది. ఆదిలాబాద్, చేవెళ్ల, నిజామాబాద్, మెదక్ స్థానాల్లో ఇంకొంత కష్టపడి ఉంటే బాగుండేదని, అయినా ఈ నియోజకవర్గాల్లో కూడా గెలుపు అవకాశాలు ఉన్నట్లుగా పేర్కొన్నట్లు సమాచారం.

మూడుచోట్ల బీజేపీకే అవకాశాలు: కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మల్కాజిగిరి, కరీంనగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు కాంగ్రెస్ ఎన్నికల నిర్వహణ కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించలేదని, అప్పటికి ఇప్పటికీ పార్టీ పురోగతి ఆశించినంత లేదని పేర్కొంది. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సరైన ప్రణాళికతో ముందుకు వెళితే బాగుండేదని కమిటీ సూచించినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ ఓట్లు బదిలీ కావడం, ఎన్నికలకు ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రజల్లోకి వెళ్లడం బీజేపీకి అనుకూలంగా మారినట్లు విశ్లేషించింది. టీజేఎస్, సీపీఐ, సీపీఎం పార్టీలతో సమన్వయం లేకపోవడం కూడా కొన్ని నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలను దెబ్బకొట్టినట్లు అభిప్రాయపడింది.

కాంగ్రెస్ ఎన్నికల నిర్వహణ కమిటీ నివేదిక


- 13 చోట్ల గెలిచే అవకాశాలు ఉన్నప్పటికీ పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం
- 4 నియోజకవర్గాల్లో ఇంకొంత కష్టపడితే బాగుండేది..
- బీఆర్‌ఎస్ ఓట్లు బదిలీ కావడం బీజేపీకి అనుకూలంగా మారింది



గురువారం గాంధీభవన్‌లో సమావేశంలో దీపాదాస్‌మున్షీ తదితరులు

చిన్నారిని దత్తత తండ్రికి అప్పగించండి

అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎలాంటి విచారణ లేకుండా చిన్నారిని అధికారులు కస్టడీలోకి తీసుకోవడాన్ని తప్పుబట్టిన హైకోర్టు.. ఆ చిన్నారిని దత్తత తండ్రికి అప్పగించాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్.జైకిషన్, కాజల్ దంపతుల నుంచి 2021లో అరుణ్‌కుమార్ దంపతులు ఓ చిన్నారిని దత్తత తీసుకున్నారు. అనంతరం అరుణ్‌కుమార్ భార్య మృతి చెందారు. భార్య లేకుండా చిన్నారిని పెంచడం సాధ్యం కాదంటూ అరుణ్‌పై అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు ఎలాంటి విచారణ జరపకుండానే చిన్నారిని తమ కస్టడీకి తీసుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ అరుణ్‌కుమార్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. తన నుంచి చిన్నారిని తీసుకెళ్లినందుకు రూ.10 లక్షల పరిహారం కూడా ఇప్పించాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది హిమాంగిని సంఘీ వాదనలు వినిపిస్తూ.. భార్య లేనంత మాత్రాన చిన్నారిని పెంచలేరని అధికారులు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. చట్టప్రకారం విచారణ జరపాలని, బోర్డు ఏర్పాటు చేయాలని, అరుణ్‌కుమార్‌ను విచారించిన తర్వాత సరైన కారణాలు తెలుపుతూ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. అలాంటిదేమీ లేకుండానే చిన్నారిని తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం న్యాయవాది వాదనతో ఏకీభవిస్తూ అధికారుల తీరును తప్పుబట్టింది. వెంటనే చిన్నారిని దత్తత తండ్రికి అప్పగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పరిహారం కోసం చట్టప్రకారం తగిన పరిష్కారాన్ని ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ ఇస్తున్నామని స్పష్టం చేసింది.



గురువారం కురిసిన వర్షానికి హైదరాబాద్‌లోని వీఎస్టీ వద్ద జలమయమైన రహదారి



చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం



భారీవర్షం కారణంగా మాసబ్ ట్యాంక్ వద్ద ట్రాఫిక్ జామ్

దంచి.. ముంచి

▶ మొదటి పేజీ తరువాయి

ఇంత పెద్ద వాన కురవడం గత పదేళ్లలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.

మరో రెండు రోజులు..

తూర్పు విదర్భ, దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగిన ఉపరితల ఆవర్తనం గురువారం మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు చెప్పింది. రానున్న రెండు రోజులు రాష్ట్రంలోని చాలాప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు సైతం కురుస్తాయని పేర్కొంది. హైదరాబాద్, జనగామ, నాగర్‌కర్నూల్, నల్లగొండ, రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం రాష్ట్రంలో చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాలో.: ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దుబ్బాక మార్కెట్ యార్డులో తూకానికి సిద్ధం చేసిన 3 వేల క్వింటాళ్ల ధాన్యం, మిరుదొడ్డి,అక్బర్‌పేట– భూంపల్లి, ములుగు మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. పాపన్నపేట మండలం ఆరెపల్లిలో పిడుగుపడి 10 మేకలు మృతి చెందాయి.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో

ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. అడ్డాకుల, మిడ్జిల్, మూసపేట, ధరూర్, జడ్చర్ల, భూత్పూర్, వెల్దండ తదితర మండలాల్లో వర్షప్రభావం ఉంది. జడ్చర్ల మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన ధాన్యం, సర్వీస్ రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల మామిడి తోటలకు నష్టం వాటిల్లింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో, బొమ్మలరామారంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశుల్లోకి వర్షపు నీరు చేరింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోయాయి. సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో ఈదురుగాలుల కారణంగా హోర్డింగ్ కూలిపోయింది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	39.8
రామగుండం	39.0
నిజామాబాద్	38.8
ఖమ్మం	38.4
భద్రాచలం	38.2
మహబూబ్‌నగర్	38.1
నల్లగొండ	38.0
హనుమకొండ	36.0
హైదరాబాద్	35.6
హకీంపేట్	35.4
దుండిగల్	35.2
మెదక్	35.2

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ముగ్గురు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య (42) పొలంలో సాగు చేస్తుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మరణించాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన కంబోళ్ల శ్రీనివాస్ (32) చెట్టుపైకి ఎక్కి చింతకాయ తెంపుతుండగా పిడుగుపడి మృతిచెందాడు. చెట్టు కింద ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనివాస్‌కు తల్లిదండ్రులు, భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నారు. కద్దాల్ మండలం కలకొండకు చెందిన కార్పెంటర్ పసునూరి ప్రవీణ్ చారి (30) తన మామ నాగోజు జంగయ్య చారితో కలిసి పని నిమిత్తం బైక్‌పై కద్తాల్ వచ్చారు. పని ముగించుకుని సాయంత్రం స్వగ్రామాలకు వెళ్తుండగా వాస్‌దేవ్‌పూర్ గేట్ వద్దకు చేరుకోగానే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. బైక్‌ను నడుపుతున్న జంగయ్య వాహనాన్ని రోడ్డు పక్కన ఆపేశాడు. వెనకాల కూర్చున్న ప్రవీణ్ బైక్ దిగి బస్ షెల్టర్‌లోకి వెళ్తుండగా.. సమీపంలో పిడుగు పడింది. ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందగా.. జంగయ్యకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

పెండింగ్ డీఏలకు వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) అధ్యక్షురాలు జి.నిర్మల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం సమావేశం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. పీఆర్‌సీ నివేదిక తెప్పించుకుని, ఉద్యోగులకు 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని సంఘం కోరింది. ఏపీలోని ఉద్యోగులను రాష్ట్రానికి రప్పించాలని కోరారు.

బ్యారేజీలకు తక్షణ మరమ్మతులు

నిర్మాణ సంస్థలను కోరిన రాష్ట్ర నీటిపారుదల శాఖ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు యుద్ధప్రాతిపదికన అత్యవసర మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్లను రాష్ట్ర నీటిపారుదల శాఖ కోరింది. వర్షాకాలం రాకముందే అత్యవసర మరమ్మతులు చేయాలని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నీటిపారుదల శాఖ రామగుండం చీఫ్ ఇంజనీర్ కె.సుధాకర్‌రెడ్డి ఈ నెల 14న ఎల్‌అండ్‌టీ–పీఈసీ జాయింట్ వెంచర్(మేడిగడ్డ బ్యారేజీ), అఫ్కాన్స్–విజేత–పీఈఎస్(అన్నారం బ్యారేజీ), నవయుగ(సుందిళ్ల బ్యారేజీ) సంస్థలకు వేర్వేరుగా లేఖలు రాశారు. అయ్యర్ కమిటీ సమర్పించిన మధ్యంతర నివేదికను నిర్మాణ సంస్థలకు పంపించి ఆ మేరకు పనులు నిర్వహించాలని కోరారు.

ఒప్పందం మేరకే 'మేడిగడ్డ' చెల్లింపులు..

మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణలో భాగంగా చేపట్టే పనులకు చెల్లింపులు చేయాల్సిందేనని కోరుతూ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ–పీఈఎస్ జేవీ' విజ్ఞప్తి చేసింది. దీనిని పరిశీలించి ఒప్పందంలోని నియమాలు, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకుంటామని, ఆ మేరకు చెల్లింపులు జరుపుతామని నీటిపారుదలశాఖ స్పష్టం చేసింది. ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సూచించిన మేరకు మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న బ్లాకులు, షట్టర్ల తొలగింపు, పగుళ్లు వచ్చిన పియర్లకు అదనపు భద్రతకు బ్రేసింగ్ చేయడం, బ్యారేజీల్లో ఏర్పడిన బుంగలను పూడ్చివేయడానికి గ్రౌటింగ్ చేయడం, ప్లింత్ స్లాబుకు మరమ్మతులు చేయడం, గేట్లన్నీ ఎత్తడం వంటి అన్ని పనులు చేయాలని నిర్మాణ సంస్థను కోరింది. బ్యారేజీకి మరింత నష్టం జరగకుండా తక్షణమే పనులు ప్రారంభించాలని స్పష్టం చేసింది.

బీసీలకు తగిన వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచినా పేద, ధనిక వర్గాలమధ్య వ్యత్యాసాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో వారి వాటా వారికి ఇవ్వాల్సిందే అని, లేనిపక్షంలో దేశంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ బీసీలకు అనుకూల వైఖరి అవలంబించాలని, బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించాలని కోరారు. బీసీలకు జాతీయ స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ కోటా పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు

- జాజుల శ్రీనివాస్ డిమాండ్



పంజగుట్ట (హైదరాబాద్): బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసేందుకు జీవో నంబర్ 26ను, రూ.150 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకుని కులగణన చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో కులగణన ఒక్క నెలలోనే పూర్తి చేశారని తెలంగాణలో కూడా నెలలోనే కులగణన పూర్తి చేయవచ్చని తెలిపారు.

మీ దగ్గర ఏదైనా సమాచారం ఉందా?

- విద్యుత్‌రంగ నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణకు బహిరంగ ప్రకటన జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం (గత బీఆర్‌ఎస్ సర్కార్) బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ల ప్రాతిపదికన ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టడంతో రాష్ట్రానికి నష్టం వాటిల్లిందంటూ వచ్చిన ఆరోపణలపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ మంగళవారం బహిరంగ ప్రకటన జారీ చేసింది. సంబంధిత అంశాల్లో అవగాహన, అనుభవం, నైపుణ్యం కలిగిన వ్యక్తులు, సంస్థలు 10 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. cio2024.power@gmail.comకి మెయిల్ ద్వారా లేదా తమ కార్యాలయానికి (7వ అంతస్తు, బీఆర్‌కేఆర్ భవన్, ఆదర్శ్ నగర్, హైదరాబాద్–500004) పోస్టు ద్వారా పంపాలని సూచించింది. విచారణ కమిషన్‌కు పంపించే విజ్ఞాపనల్లో వ్యక్తులపై ఎలాంటి రాజకీయపరమైన ఆరోపణలు చేయరాదని కోరింది. ఎవరైనా కమిషన్ ముందు హాజరై మౌఖికంగా ఆధారాలు సమర్పించాలని భావిస్తే, ఏ విషయంలో వారు హాజరుకావాలని కోరుకుంటున్నారో తెలియజేయాలంది. సంబంధిత నిర్ణయాల్లో తప్పులను గుర్తించడంతోపాటు రాష్ట్రానికి జరిగిన ఆర్థిక నష్టాన్ని నిర్ధారించడం, బాధ్యులను గుర్తించడం కోసం న్యాయవిచారణ నిర్వహిస్తున్నట్టు తెలిపింది.

పోలీసుల సమక్షంలో పట్టపగలు దాడులు

- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు ప్రాణహాని ఉంది
- డీజీపీని కలిసి ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: అచ్చంపేట నియోజకవర్గంలో పోలీసుల సమక్షంలోనే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తోందని పార్టీ నాగర్‌కర్నూలు లోక్‌సభ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అచ్చంపేటలో రౌడీయిజం పెరిగిపోయిందని, నయీం తరహా ముఠాలు అక్కడ రాజ్యమేలుతున్నాయని తెలిపారు. అచ్చంపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ ఆ పార్టీ నేతలు గురువారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోనే ఉందని, ఇక్కడ జరుగుతున్న దాడులు ఆయనకు తెలియకుండా ఉండవని ప్రవీణ్‌కుమార్ అన్నారు. హోంమంత్రిత్వ శాఖ బాధ్యతలు కూడా తన వద్దే పెట్టుకున్న రేవంత్‌రెడ్డికి తెలిసే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

“ నిశ్చయంగా, నరకం ధిక్కారుల గమ్యస్థానం. అందులో వారు యుగాల తరబడి ఉంటారు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 17 మే 2024

ఉత్తరాఖండ్ నిర్లక్ష్యం

నిర్లక్ష్యం మంటల్లో నిత్యం దహించుకుపోతున్న ఉత్తరాఖండ్ అడవులపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టిసారించటం, సంజాయిషీ కోరడం హర్షించదగిన పరిణామం. ఈ మంటల్లో చిక్కుకుని ఇంత వరకూ అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇతర జీవరాశులకు కలిగిన నష్టమెంతో తెలియదు. హిమాలయ సానువుల్లో కొలువుదీరి పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ అడవులపై అధికార యంత్రాంగం ప్రదర్శిస్తున్న అంతులేని నిర్లక్ష్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. వాతావరణపరంగా ఉత్తరాఖండ్‌లో, పొరుగునున్న హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ఈ రెండుచోట్లా శీతా కాలంలో భారీ వర్షాలు కురుస్తాయి. బలమైన గాలులు వీస్తాయి. అంతకుముందు విపరీతంగా మంచుకురుస్తుంది. దేవదారు వృక్షాలనుంచి రాలిపడిన ఆకులతో కొండ ప్రాంతాలన్నీ నిండిపోతాయి. ఈ ఆకులు మామూలుగా అయితే చిన్న నిప్పురవ్వ తగిలినా భగ్గునమండుతాయి. కానీ ఆ సమయంలో పడే వర్షాలతో అటవీప్రాంతమంతా చిత్తడిగా మారిపోతుంది. వేసవిలో కూడా ఇదే స్థితి కొనసాగుతుంది. అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇదంతా తారుమారైంది. నవంబర్ నుంచే అడవుల్లో అగ్నికీలలు కనబడ్డాయి. ఈ పరిణామాన్ని అంచనా వేయటం పెద్ద కష్టం కాదు.

కొండ ప్రాంతమంతా రాలిన ఆకులతో నిండినప్పుడు, ఎండలు మండుతున్నప్పుడు ఏం జరుగుతుందో గత అనుభవాలే చెబుతున్నాయి. దీనికితోడు పొగరాయుళ్లు నిర్లక్ష్యంగా పడేసే చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కూడా ప్రమాదాలు తెస్తున్నాయి. మాఫియాల బెడద సరేసరి. అటవీ భూములు అందుబాటులోకొస్తే కోట్లు గడించవచ్చని ఉద్దేశపూర్వకంగా అడవుల్ని తగలబెడుతుంటారు. వీరికి రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉంటాయి. ఇక కొండప్రాంతాలకు సమీపంలో పంట వ్యర్థాలను కళ్లాల్లోనే తగలబెట్టే అలవాటు అధికం. ఇది కూడా అడవులు అంటుకోవటానికి కారణమవుతోంది. ఇలాంటివారినుంచి అడవుల్ని కాపాడటానికీ, నిప్పు జాడ కనుక్కుని వెనువెంటనే ఆర్పడానికీ కొండలపై గార్డులు గస్తీ కాస్తుంటారు. కానీ వారంతా ఎన్నికల విధులు నిర్వర్తించటానికి తరలిపోయారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన దాఖలా లేదు. అందువల్లే ఈ దఫా ఇంతవరకూ 1,400 హెక్టార్ల అడవి తగలబడిందని ఒక అంచనా. గత నెలనుంచి చూసుకున్నా అడవులు అంటుకున్న ఉదంతాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లతో పోలిస్తే ఉత్తరాఖండ్‌లోనే అధికమని ఈమధ్య ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) డేటా తెలిపింది. ఉత్తరాఖండ్‌లో దాదాపు 24,305 చదరపు కిలోమీటర్లమేర అడవులున్నాయి. రాష్ట్ర భౌగోళిక ప్రాంతంలో ఇది 44.5 శాతం. ఇంత విస్తారంగా అడవులున్న రాష్ట్రం వాటిని ప్రాణప్రదంగా చూసుకోవద్దా?

కొండలపై రాలిపడే ఆకుల్ని ఏరేందుకూ, తామరతంపరగా పెరిగే గడ్డి మొక్కల్ని తొలగించటానికీ, అగ్ని ప్రమాదాల నివారణకూ మనుషుల్ని నియమించాలి. ఇందుకోసం ఏటా దాదాపు రూ. 9 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కానీ చిత్రమేమంటే ప్రభుత్వం కేవలం రూ. 3.15 కోట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. మంటల జాడ లేకుండా చూడాలే తప్ప, ఒకసారి అంటుకుంటే అదుపు చేయటం అంత సులభం కాదు. ఈ నెల మొదట్లో అడవులు తగలబడుతున్నప్పుడు వైమానిక దళ హెలికాప్టర్లు రంగంలోకి దిగి వేలాది లీటర్ల నీటిని వెదజల్లాయి. ఈ చర్య కొంతమేర ఉపయోగపడినా అనుకోకుండా కురిసిన భారీ వర్షంతో పరిస్థితి అదుపులోకొచ్చింది. ఇలా ప్రతిసారీ జరుగుతుందని ఆశిస్తూ కూర్చుంటే అంతా తలకిందులవుతుంది. తమకున్న అడవుల్లో కేవలం 0.1 శాతం ప్రాంతంలో మాత్రమే మంటల బెడద ఉన్నదని ఉత్తరాఖండ్ దాఖలుచేసిన అఫిడవిట్ తెలిపింది. ఎంత శాతమని కాక, ఏమేరకు ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తున్నామో, వాటి లోటుపాట్లేమిటో అధ్యయనం చేస్తున్న దాఖలా లేదు. ఎంత ప్రాంతంలో వృక్షాలు దెబ్బతిన్నాయో లెక్కలు చెబుతున్నారు. కానీ పర్యావరణానికి కలిగే నష్టం ఎవరూ గమనించటం లేదు. అగ్ని ప్రమాదాలవల్ల వాతావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్ పరిమాణం పెరుగుతుంది. నేలల్లో తేమ తగ్గిపోతుంది. పోషకాలు కూడా కనుమరుగవుతాయి. వీటికి సంబంధించిన డేటా ప్రభుత్వం దగ్గర ఉందో లేదో తెలియదు. నిజానికి ఇలాంటి డేటాతో స్థానిక ప్రజల్లో చైతన్యం తీసుకొస్తే, అడవులు తగలబడటంవల్ల భవిష్యత్తులో ఎన్ని చిక్కులు ఏర్పడే అవకాశమున్నదో చెబితే వారే స్వచ్ఛంద సైనికుల్లా ముందుకొస్తారు. అడవులను కాపాడతారు. మాఫియాలను కట్టడి చేసేందుకు సైతం సంసిద్ధులవుతారు. కానీ ప్రభుత్వం వైపు నుంచి ఆ రకమైన చొరవేది?

ఉత్తరాఖండ్ అడవులు విశిష్టమైనవి. అక్కడ రెండు టైగర్ రిజర్వ్‌లున్నాయి. పక్షుల సంరక్షణ కేంద్రాలున్నాయి. ఇక్కడి గాలులు మోసుకెళ్లే ఆక్సిజన్ కారణంగానే కాలుష్యం కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ నగరం ఆ మాత్రమైనా ఊపిరి పీల్చుకోగలుగుతోంది. ఇక్కడి వృక్షాలవల్ల హిమాలయాల్లోని మంచుపర్వతాలు ఒక క్రమపద్ధతిలో కరిగి జీవనదులు పారుతున్నాయి. ఇంతటి అపురూపమైన అడవులు మానవ నిర్లక్ష్యం కారణంగా నాశనం కావటం అత్యంత విషాదకరం. ఎంత ప్రాంతమని కాదు...అడవిలోని ఒక్క వృక్షమైనా మన నిర్లక్ష్యంవల్ల, తప్పిదాలవల్ల నేలకొరగరాదన్న దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తే, దానికి అనుగుణమైన చర్యలు తీసుకుంటే అడవులు కళకళలాడతాయి. మనుషులు మాత్రమే కాదు...సకల జీవరాశులూ సురక్షితంగా ఉంటాయి. సర్వోన్నత న్యాయస్థానం జోక్యంవల్ల ఇదంతా నెరవేరితే అంతకన్నా కావాల్సిందేముంది?

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.నవమి ఉ.9.09 వరకు, తదుపరి దశమి నక్షత్రం: పుబ్బ రా.9.40 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: లేదు దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.52 వరకు, తదుపరి ప.12.22 నుండి 1.10 వరకు, అమృతఘడియలు: ప.2.54 నుండి 4.28 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అనిశ్చితి కొనసాగితే అంతులేని నష్టం

విశ్లేషణ



జైదీప్ సైకియా

ఏడాది తర్వాత కూడా మణిపుర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మెరుగు పడలేదు. మణిపుర్ రాజధాని ఇంఫాల్‌తో నాగాలాండ్‌ను కలిపే జాతీయ రహదారి మీద ఉన్న వంతెనను దుండగులు పేల్చేశారు. మరో ఘటనలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లను చంపేశారు. అరాచకం ఎంత స్థాయికి వెళ్లిందంటే, న్యూఢిల్లీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని భావించే శక్తులు ఉన్నాయి. పదునైన టీమ్ వర్క్ ఫలితంగా అస్సాంలో శాంతి యుగానికి నాంది పడింది. అస్సాంలో జరిగినట్లుగానే మణిపుర్, నాగాలాండ్, దక్షిణ అరుణాచల్ ప్రదేశ్‌లకు ఏకీకృత కమాండ్ వ్యవస్థ (యూనిఫైడ్ కమాండ్ స్ట్రక్చర్)ను తక్షణమే ఏర్పాటు చేయడం మేలు. ప్రస్తుతం ఉన్న గందరగోళాన్ని, అనిశ్చితిని ఇలాగే కొనసాగనిస్తే, మణిపుర్ కోలుకోలేని విధంగా నష్టపోతుంది.

హింస చెలరేగిన ఏడాది తర్వాత కూడా మణిపుర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మరింత దారుణంగానే ఉంది. ఈ రాష్ట్రంలోని ప్రధాన శక్తులు ఏకతాటిపైకి వచ్చి తక్షణ దిద్దుబాటు కోసం ఒక మార్గాన్ని అన్వేషించడమే ఇప్పుడున్న ఏకైక పరిష్కారం.



సైన్యం లక్ష్యంగా దాడి

మణిపుర్‌లో ఇటీవల జరిగిన మూడు సంఘటనలను దృష్టిలో పెట్టుకోవాలి. ఏప్రిల్ 24న కాంగ్‌పోక్పి జిల్లాలోని జాతీయ రహదారి–2పై ఉన్న వంతెన మీద దుండగులు ఐఈడీ పేలుడుకు పాల్పడ్డారు. ఈ వంతెన ఇంఫాల్‌ను నాగాలాండ్‌లోని దిమాపూర్‌తో కలుపుతుంది. ఈ రహదారి రాష్ట్రానికి ప్రధాన జీవనాధారం. రాష్ట్రం నిలువునా చీలిపోయిన కారణంగా మణిపుర్ ప్రజలకు అవసరమైన సామగ్రిని తీసుకువెళ్లే 100కు పైగా ట్రక్కులు అక్కడ నిలిచిపోవాల్సి వచ్చింది.

ఏప్రిల్ 27న బిష్ణుపూర్ జిల్లాలోని నారాన్‌సీనా వద్ద జరిగిన దాడిలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించారు. సీఆర్పీఎఫ్ జవాన్లు విడిది చేసి ఉన్న ప్రాంతానికి 200 మీటర్ల దూరంలోనే ఇండియా రిజర్వ్ బెటాలియన్ క్యాంపు (ఐఆర్బీ) ఉంది. ఐఆర్బీలో సిబ్బంది ప్రధానంగా మైతేయి కమ్యూనిటీకి చెందినవారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది తమ శిబిరాన్ని ఖాళీ చేసే పనిలో ఉన్నారనీ, అక్కడ ఒక ప్లాటూన్ మాత్రమే మిగిలి ఉందనీ తెలియవచ్చింది.

దాడి చేసినవారు ఐఆర్బీలోని మైతేయి సభ్యులను లక్ష్యంగా చేసుకున్నారని భావించే అవకాశం ఉంది; రాత్రిపూట దాడి జరిగినందున, వారు సీఆర్పీఎఫ్ శిబిరాన్ని ఐఆర్బీ అని పొరపడి ఉండొచ్చు.

అయితే, ఆ దాడి లక్ష్యం సీఆర్పీఎఫ్ కూడా అయి ఉండవచ్చు – 1990ల మధ్యకాలంలో, అస్సాంలోని హిందీ మాట్లాడే ప్రజలను యథేచ్ఛగా హతమార్చడానికి ప్రయత్నించిన తిరుగుబాటు బృందం యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోమ్ (ఉల్ఫా) కార్యాచరణను ఇది తలపింపజేస్తోంది. అప్పట్లో ఉల్ఫా కేంద్రప్రభుత్వ దృష్టిని ఆకర్షించడానికి గట్టిగా ప్రయత్నించింది. అందులో విజయవంతం అయింది కూడా. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుండి కొంతమంది ఎంపీలు హిందీ మాట్లాడే తమ సోదరులకు సహాయం చేయడానికి వెంటనే అస్సాంలో దిగారు. బయటి వ్యక్తులు తమ రాష్ట్రంలో దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించే ఒక వర్గం అస్సామీ జనాభాలో ఉండేది. అది ఇప్పటికీ అలాగే ఉంది.

నారాన్‌సీనా ఘటనకు సంబంధించి, మణిపుర్‌లో అరాచకం ఎంత తీవ్రస్థాయికి వెళ్లిందంటే, న్యూఢిల్లీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని భావించే శక్తులు ఉన్నాయి. కాకపోతే సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ వంటి కేంద్ర పారామిలిటరీ బలగాలను వీరు గతంలో లక్ష్యంగా చేసుకోలేదని గమనించడం ముఖ్యం.

ఒకే తాటిపైకి వస్తేనే...

వంతెనపై ఐఈడీ పేలుడు, సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడికి సంబంధించిన అనుమానపు చూపు ప్రధానంగా కుకీ మిలిటెంట్ల వైపు మళ్లింది. అయితే, అది చేసింది ఎవరైనా కావచ్చు. 2023 మే 3 నుండి నియంత్రణ లేకుండా ఉన్న రాష్ట్రంలో, దాదాపు ప్రతి సమూహం సైనికీకరించబడింది.

మూడో విషయం రాజకీయ అండదండలతో కొనసాగుతున్న అరాచకానికి సంబంధించినది. అక్రమ ఆయుధాలతో ఉన్న అరామ్‌బాయి తెంగోల్ సభ్యులను పట్టుకున్న తర్వాత, సైన్యానికి చెందిన కాస్పిర్ వాహనాన్ని మీరా పైబీలు(మహిళా బృందాలు) అడ్డగించారు. వందలాది మంది మీరా పైబీలు కాస్పిర్‌ను చుట్టుముట్టి సైనికులను దూషించారు. ఆ సమయంలో గనక సైనిక సిబ్బంది సంయమనం కోల్పోయి ఉంటే రక్తపాతం జరిగి ఉండేది.

పదునైన టీమ్ వర్క్ ఫలితంగా అస్సాం శాంతి యుగానికి నాంది పలికింది. అస్సాంలో జరిగినట్లుగానే మణిపుర్, నాగాలాండ్, దక్షిణ అరుణాచల్ ప్రదేశ్‌లకు ఏకీకృత కమాండ్ వ్యవస్థ (యూనిఫైడ్ కమాండ్ స్ట్రక్చర్)ను తక్షణమే ఏర్పాటు చేయడం మేలు. ఇది రంగాపహాడ్(నాగాలాండ్) కేంద్రంగా పనిచేసే 3 కోర్‌కు చెందిన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మొత్తం నాయకత్వం కింద ఉండాలి. సహజంగానే సంప్రదింపుల తర్వాతే ఒక స్పష్టమైన స్వరం... శాంతి, సాధారణ స్థితికి రావడానికి కావాల్సిన వ్యూహాలు, మార్గాలు, సాధనాలపై దృష్టి పెట్టాలి.

మణిపుర్ విభజితమై ఉంది. రాష్ట్ర పోలీసు యంత్రాంగం దాదాపుగా పనిచేయడం లేదు. ఎటువంటి ఎదురూ లేని రాడికల్ మిలీషియా సంస్థకు పోలీస్ విభాగం తన బాధ్యతను వదిలేసుకుంది. కొంతమంది పోలీసులను ఆయుధాలు వదిలివేయమని బలవంతం చేస్తూ అరామ్‌బాయి తెంగోల్ ఒక డీఎస్పీని తీసుకెళ్లింది. ఇలాంటి తరుణంలో పోలీసులకు నాయకత్వం అవసరం. దురదృష్టవశాత్తు, అది పోలీసు శాఖ లోపల నుండి ఉద్భవించదు. దానిపై అధికారాన్ని 3 కోర్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ వంటి బలమైన సంస్థాగత మద్దతుతో కూడిన దృఢమైన నాయకుడికి అప్పగించాలి.

అస్సాం రైఫిల్స్ అద్భుతంగా పని చేస్తోంది. కానీ అది పక్షపాత దృష్టితో ఉందని అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నారు. మణిపుర్ లోయ నివాసితులు దానిని తొలగించాలని కోరారు. మణిపుర్‌లోని అనేక ప్రాంతాల నుండి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం తొలగించబడింది. దాంతో రాష్ట్రంలో ప్రభుత్వేతర శక్తులు చేస్తున్న చర్యలను ఎవరైనా చూడవచ్చు. అస్సాం రైఫిల్స్ ఇప్పటికే 3 కోర్ కార్యాచరణ కమాండ్ కింద ఉంది. కానీ దీనిని ఏకీకృత కమాండ్ వ్యవస్థ(యూసీఎస్)లో భాగం చేస్తే... ఆర్మీ, మణిపుర్ పోలీస్, కేంద్ర పారామిలిటరీ బలగాలతో దాని కార్యాచరణ కదలికలను క్రమాంకనం చేయడానికి అది వీలు కల్పిస్తుంది. అంతేగాక, యూసీఎస్ లోని ఇతర అంతిమ వినియోగదారులకు అనుగుణంగా పటిష్ఠమైన నిఘా వీలవుతుంది.

అన్నీ కలగలిసే...

మణిపుర్, నాగాలాండ్, దక్షిణ అరుణాచల్‌లకు పరస్పరం ముడిపడి ఉన్న సమస్యలే దీనికి కారణం. ఉదాహరణకు, ప్రత్యేక అడ్మినిస్ట్రేటివ్ జోన్లను ఏర్పర్చిన తర్వాత, నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్- ఇసాక్- ముయివా (ఎన్ఎస్‌సీఎన్-ఐఎమ్) సహాయంతో లోయ-ఆధారిత తిరుగుబాటు గ్రూపులు మణిపుర్‌లోకి ప్రవేశించే సమస్యనుంచి ఎవరూ తప్పించుకోలేరు. అలాగే, 'ఈస్టర్న్ నాగా నేషనల్ గవర్నమెంట్' నుండి ఎన్ఎస్‌సీఎన్-ఐఎమ్‌కు లభిస్తున్న మద్దతు వెలుగులోనే, దక్షిణ అరుణాచల్‌లోని తిరప్, చాంగ్లాంగ్, లాంగ్డింగ్ జిల్లాలలో జరిగే కుతంత్రాలను చూడాలి.

భారత రాజ్యం, దాని సైన్యం చాలా శక్తిమంతమైనవి. అవి ఎలాంటి సవాలునైనా ఎదుర్కోగలవు. ఈ క్లిష్ట సమయంలో న్యూఢిల్లీ తీసుకోవాల్సిన ఏకైక చర్య తన బలగాలను బలోపేతం చేయడమే. అసాధ్యమైన వాటిని సాధించగల సామర్థ్యం సైన్యానికి ఉంది. ప్రస్తుతం ఉన్న గందరగోళాన్ని, అనిశ్చితిని ఇలాగే కొనసాగనిస్తే, మణిపుర్ కోలుకోలేని విధంగా నష్టపోతుంది.

వ్యాసకర్త భద్రత – తీవ్రవాద వ్యవహారాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మెజారిటీ దక్కేనా?



ఇప్పుడు ఉన్న స్థితిగతులను బట్టి చూస్తే, బీజేపీ తన మెజారిటీ మార్క్ కంటే అత్యంత దిగువన ఉంది. ఆఖరికి ఎన్డీయేకు కూడా మెజారిటీ దక్కకపోవడమూ సంభవమే.

– యోగేంద్ర యాదవ్, విశ్లేషకుడు

ఎందుకంత పట్టింపు?



నన్ను రంధ్రాన్వేషి అన్నా సరే... ఉన్నట్టుండి బైడెన్(అమెరికా అధ్యక్షుడు) ఎందుకు (ట్రంప్‌తో) డిబేట్ కోసం ఉత్సాహపడుతున్నారు? ఆయన ఏదో ఒకటి చేయాలని ఆత్రంలో ఉన్నారా లేక అదొక నాటకం అయివుండొచ్చా? ఏమైనా దీని మీద ఓ కన్నేసి ఉంచండి.

– వివేక్ రామస్వామి, అమెరికా రిపబ్లికన్ నేత

స్లొవేకియాకు సంఘీభావం



స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో మీద జరిగిన దాడి వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ పిరికి, పిదప చర్యను తీవ్రంగా ఖండిస్తూ, ఫికో వేగంగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. స్లొవాక్ రిపబ్లిక్ ప్రజలకు ఇండియా సంఘీభావం చూపుతోంది.

– నరేంద్ర మోదీ, ప్రధాని

తగిన మనిషి



నేను ట్విట్టర్‌లో పనిచేస్తున్నప్పుడు, ఆ వేదికను బాగా అర్థం చేసుకోవడం కోసం ఒక సింగపూర్ మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి మీటింగ్ అభ్యర్థన వచ్చింది. అరగంట అనుకున్నది గంటన్నర చర్చ నడిచింది. మళ్లీ ఆయన్ని ఈమధ్యే కలిసే భాగ్యం దక్కింది. ఆయన జ్ఞానం, అణకువ, నడత నన్ను ముగ్ధుడిని చేశాయి. నిన్న(15 మే) ఆయన (లారెన్స్ వాంగ్) సింగపూర్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

వార్త కాదా?



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పాకిస్తానీ భద్రతా దళాల హింస, రక్తపాతాలకు వ్యతిరేకంగా గొంతెత్తిన కశ్మీరీ కవి, కార్యకర్త అహ్మద్ ఫర్హాద్‌ను రావల్పిండి నుంచి పాకిస్తాన్ ఐఎస్ఐ అపహరించుకువెళ్లింది. పాక్, అంతర్జాతీయ మీడియాలో ఈ వార్తే లేదు. విచారకరం.

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

దుర్బల మనుషులం



ప్రకృతి శక్తుల ముందు నాగరికత ఎంత దుర్బలమైనదో మనం గ్రహించాలి. ఈ శక్తులను మనం ఎప్పటికీ నియంత్రించలేం. కేవలం వాటి ప్రభావాన్ని మాత్రమే అనుభవించగలం. ప్రకృతిలో ప్రతిదానిలాగానే నాగరికత వస్తుంది, పోతుంది. ఈ భూమ్మీది చరిత్ర మనకు అదే బోధిస్తుంది.

– ఫ్రాంక్ హూగెర్‌బీట్స్, పరిశోధకుడు

ఆ మాత్రం నడవరా?



యువతలో స్థూలకాయ సమస్యకు మూలం ఎక్కడుందో నాకు ఇప్పుడు అర్థమవుతోంది. సన్నం, పొడవు, నగటు– వాళ్లు ఎలాంటివారైనా సరే, మెట్రో స్టేషన్లలో వృద్ధులు, దివ్యాంగుల కోసం కేటాయించిన ఎలివేటర్లలోకి యువకులు దూరుతున్నారు. ఇది చూడటానికే చీదరగా ఉంది. మధుమేహం, గుండె సంబంధిత జబ్బులు కూడా ఎక్కువ అవుతున్నాయంటే ఇంకా ఆశ్చర్యమా?

– అర్షియా మలిక్, రచయిత్రి

ఇన్ బాక్స్

అవిశ్రాంత ఉద్యమశీలి

మార్క్సిస్ట్ – లెనినిస్ట్ నాయకుడు కామ్రేడ్ రాగి సుబ్బారావు రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమైనది. దాదాపు 5 దశాబ్దాలకు పైగా కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి, పౌర హక్కుల ఉద్యమాలతో మమేకమై ఉంది ఆయన జీవితం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మలితరం మార్క్సిస్ట్ లెనినిస్ట్ నాయకుల్లో ప్రముఖుడు. యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) పార్టీ గుంటూరు జోనల్ కమిటీకి కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. సీపీఐ (ఎమ్ఎల్) జనశక్తి నాయకునిగా, సీపీఐ (ఎమ్ఎల్) న్యూ డెమొక్రసీ నాయకునిగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మార్క్సిస్ట్ లెనినిస్ట్ ఉద్యమ నేతృత్వంలో ఏర్పడిన ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, అఖిల భారత పౌర ప్రజాతంత్ర హక్కుల సంస్థ మహాసభలు గుంటూరులో జరపటంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. భారత్ – చైనా మైత్రి మండలిలో పనిచేశారు. వర్కర్స్ సాలిడారిటీ, ఏఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, ప్రజాస్వామ్య యువజన సంఘం, రైతు కూలీ సంఘం వంటి ప్రజా సంఘాలను నిర్మాణం చేయడంలో ప్రముఖ పాత్ర వహించారు. గుంటూరు నగరంలో సిటీ బస్సులు జాతీయాకరణ చేయాలనే పోరాటంలో జైలుకెళ్లారు.



రాగి సుబ్బారావు

1974కు పూర్వమే రాగి సుబ్బారావు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)ల నాయకత్వాన ఉన్న యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) పార్టీ సంబంధాల్లోకి వెళ్ళారు. నాగిరెడ్డి, డీవీ చెప్పిన పొలిటికల్ ఓరియంటేషన్నూ, నిర్మాణ విధానాన్నీ వంట పట్టించుకున్నారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో పోలీసులకు దొరక్కుండా రహస్య జీవితంలోకి వెళ్లారు. ఎమర్జెన్సీ తర్వాత రహస్య జీవితం నుంచి బయటికి వచ్చినా విప్లవమే వృత్తిగా, సమ సమాజమే సిద్ధాంతంగా, పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా మారారు. సీపీఐ (ఎమ్ఎల్) న్యూ డెమొక్రసీ పార్టీలో భాగస్వామ్య సభ్యునిగా ఉంటూ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను కోరుకుంటూ మే ఒకటవ తేదీన అమరులయ్యారు.

– మన్నవ హరిప్రసాద్
సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు
(నేడు గుంటూరులో రాగి సుబ్బారావు సంస్మరణ సభ)

కమలనాథుల ధీమా సడలుతోందా?

అభిప్రాయం



ఎస్. అబ్దుల్ ఖాలిక్

లోక్‌సభ ఎన్నికల్లో అనుకున్న సంఖ్యాబలాన్ని సాధించడంలో భారతీయ జనతా పార్టీ ధీమా సడలుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మొదటి, రెండో విడత పోలింగ్ తరువాత పరిస్థితి ఆశాజనకంగా లేదన్న సంగతి బీజేపీ అగ్రనాయకులకు తెలిసిపోయింది. దీంతో ఒక్కసారిగా ప్రధాని నరేంద్ర మోదీ స్వరం మారిపోయింది. పదేళ్ల పాలనలో ప్రజలకు తాము ఏం చేశామో ఇప్పటికీ ధీమాగా మోదీ చెప్పలేకపోతున్నారు. ముస్లిం రిజర్వేషన్ల రద్దు, పాకిస్తాన్ బూచితో మూడోసారి అధికారంలోకి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ.



మోదీ పదేళ్ల పాలనను పరిశీలిస్తే రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినే అనేక చర్యలు కనిపి స్తాయి. తమకు 400 సీట్ల మెజారిటీని కట్టబెడితే అసలు రాజ్యాంగాన్నే మార్చివేస్తాం అని కొందరు బీజేపీ నాయకులు ప్రకటించే స్థాయికి చేరడం ఈ సందర్భంగా గమనార్హం. 2014లో అచ్చేదిన్ పేరుతో మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అంతకు ముందు కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ కూటమి వరుసగా పదేళ్లపాటు అధికారం చలాయించింది. ఈ పదేళ్ల కాలంలో కాంగ్రెస్ పాలన అంతా కుంభకోణాల మయంగా మారింది. ఆ పార్టీ పాలనపై దేశవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి పరోక్షంగా బీజేపీ విజయానికి దారితీసింది. 2019 నాటికి దేశంలో పరిస్థితులు మారిపోయాయి. ఆ ఏడాది లోక్‌సభ ఎన్నికల ముందు పుల్వామా సంఘటన జరిగింది. అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వెంటనే పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. దీంతో దేశభక్తి వరదలా పొంగింది. ఫలితంగా ఎన్డీఏ కూటమి మరోసారి కేంద్రంలో పాగా వేయగలిగింది.


అయితే 2024 ఎన్నికల సమయానికి పుల్వామా వంటి కలిసివచ్చే సంఘటన ఏదీ ఎన్డీఏ కూటమికి అందుబాటులోకి రాలేదు. దీంతో తానే అవకాశాన్ని సృష్టించుకోదలచింది. ఫలితంగా అయోధ్య ఆలయంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను తెరపైకి తీసుకువచ్చింది. కానీ ఎన్నికలు ప్రారంభ మయ్యేనాటికి అయోధ్య అంశం సృష్టించిన హైప్ చల్లబడింది. అదే సమయంలో పదేళ్లపాటు ప్రధానిగా పనిచేసిన మోదీ... ప్రజలకు తాము చేసింది ఇదీ అని చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్క అంశం కూడా లేకుండా పోయింది. దీంతో కమలం పార్టీ 'వికసిత్ భారత్' నినాదం అందుకొంది. లోక్‌సభ ఎన్నికలు ప్రారంభానికి ముందు ఎన్డీఏ కూటమికి తాము ఆశించినట్లు 400 సీట్లు వస్తాయని కమలనాథులు ఆశించారు. అయితే మొదటి విడత పోలింగ్ ముగియగానే పరిస్థితి నిరాశాజనకంగా ఉందన్న సంగతి బీజేపీ అగ్రనాయకత్వం గుర్తించింది.

దీంతో ఒక్కసారిగా మోదీ ప్రచార తీరు మారింది. రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ అకస్మాత్తుగా ముస్లిం మైనారిటీలపై విషం చిమ్మారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలోని సంపదనంతా ముస్లిం మైనారిటీలకు దోచి పెడుతుందని హుందాతనం మరచిపోయి ఆరోపించారు. అంతేకాదు మిగిలిన విడతల్లో విజయం కోసం రెండంచెల వ్యూహాన్ని కమలం పార్టీ అమలు చేస్తోంది. ఒకవైపు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయడం, మరోవైపు సమాజంలో ముస్లిం వ్యతిరేకతను పెంచడం ఈ వ్యూహంలో భాగం. దీంతో యావత్ హిందూ ఓటు బ్యాంక్ బీజేపీకి అనుకూలంగా మారుతుందన్నది బహుశా బీజేపీ ఆలోచన కావచ్చు. తాజాగా ఓటర్లను ఆకట్టుకోవడానికి మరో అస్త్రాన్ని కూడా ప్రయోగించింది కమలం పార్టీ. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పాకిస్తాన్ కోరుకుంటోందన్నది మోదీ చేసిన తాజా కామెంట్. పాకిస్తాన్ ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉంది. దానికి మన రాజకీయాలను పట్టించుకునే తీరిక ఎక్కడ అనేది విశ్లేషకుల మాట. మొత్తంగా ఈ ఎన్నికల్లో బీజేపీ గెలవడానికి పన్నుతున్న ఎత్తుగడలు మన రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా పరిణమించాయని చెప్పవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 63001 74320

తప్పు చేసే దుఃస్థితి రాకుండా...

జరగకూడని నష్టం జరిగినపుడు మనసు అంతులేని దుఃఖంతో నిండిపోతుంది. అయితే, నష్టం ఎంతటిదైనప్పటికీ అతిగా దుఃఖిస్తూ కూర్చోవడం అభిలషణీయం కాదు. దుఃఖం చేత ఆక్రమించబడిన మనస్సు ఆలోచనను పోగొట్టుకుంటుంది. కనుక, ఆలోచనాపరుడు జరిగిన కీడును దీర్ఘకాలం తలపోస్తూ కూర్చోడు. చింతను వదిలి, తనలోని బాధ అనే అగ్నిని వివేకమనే చల్లదనంతో అణిచివేయగల వాడే క్రియాశీలుడౌతాడు. తమకు అత్యంత ప్రియమైన వస్తువు తమది కాకుండాపోవడం, తమకు అత్యంతగా కష్టం కలిగించేది జరగడం అన్నవి 'నిత్యానిత్య వివేకహీనులైన' అల్పాశయులకు, అనగా చాలా తక్కువ ఆశయ పరిధి కలిగినటువంటి సాధారణ మానవులకు, అమితమైన దుఃఖాన్ని కలిగిస్తాయి. మానవ శరీరం ఒక రథం వంటిది. దానికి సారథి బుద్ధి. కరచరణాది ఇంద్రియాలు గుర్రాలు. హితం కాని విషయాలను సైతం ఊహించగలిగిన బుద్ధి చేసే ఆలోచనలు పగ్గాలు. ఎన్నెన్నో బాధలకు గురిచేసి ఎంతో దుఃఖాన్ని నింపే సామర్థ్యం కలిగినదిగా ఉంటుంది ఆ రథం. ఆ కారణంగానే జ్ఞానవంతులైన మనుషులు వివేకమనే మందుతో ఆ రథాన్ని తమ అధీనంలో ఉంచుకుంటారు. ప్రాణులన్నీ అశాశ్వతములే అన్న ధర్మాన్ని ఎప్పుడూ వింటూనే ఉంటాం. ధైర్యం నిండిన మనస్సుతో ఆ ధర్మాన్ని ఆచరించడం మొదలుపెట్టాలి. ఆ జ్ఞానమే అన్ని దుఃఖాలను పోగొట్టి మనసుకు సాంత్వనను కలుగజేస్తుంది. దైవసంకల్పంగా సంభవించే పరిణామాలను ఎవరూ ఆపలేరు. అవి దైవం సంకల్పించినట్లే జరుగుతాయి. కనుక లోకం దృష్టిలో చివరిదాకా గౌరవంగా మనగలగాలంటే, ఎంతటి శోకాన్నైనా తట్టుకుని నిలబడాలి. ఆ స్థితిని సాధించడానికి ఆంధ్ర మహాభారతం, స్త్రీపర్వంలోని ఈ కందపద్యం మార్గాన్ని చెప్పింది.



జ్యోతిర్మయం

తన మేలు గీడు దా మది
గనుచు, హితులు సెప్పు బుద్ధి గైకొని శుభముం
గొనకొని నడుపు పతికి వ
చ్చునె పశ్చాత్తప మెట్టి చోట? నరేంద్రా!

ఎప్పటికప్పుడు తన మంచిచెడులను తానే గుర్తించి బేరీజు వేసుకుంటూ, హితులు చెప్పే మాటలను పెడ చెవిన పెట్టక గ్రహించి ఆచరిస్తూ, శుభాన్ని సాధించే వ్యక్తికి ఎప్పుడూ చేసిన తప్పుకు చింతించాల్సిన అవసరం కలగదు. అనగా అసలు తప్పు చేసే పరిస్థితి రాదు అని తిక్కన రచనలో అంతరార్థంగా చెప్పబడిన మంచి విషయం!

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

జూన్ 9న విశాఖలో జగన్ ప్రమాణ స్వీకారం

కనీవినీ ఎరుగని రీతిలో ఫలితాలు వస్తాయి: బొత్స



సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని ఫలితాలతో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించబోతోందని, జూన్ 9వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరంలో సీఎంగా మరోసారి ప్రమాణ స్వీకారం చేస్తారని ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మంత్రి గురువారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా ఈసారి కూడా జగనే రావాలని కోరుకున్నారని తెలిపారు. సీఎంగా జగన్ వస్తేనే ఒకటో తేదీన పింఛన్ వస్తుందని, క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అందుతాయని భావించి ఓట్లేశారన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో చెప్పినట్లు ఈ ఐదేళ్లలో మేలు జరిగితేనే ఓటేయండని ప్రజలను అడిగి సీఎం వైఎస్ జగన్ దేశంలోనే కొత్త ట్రెండ్ తీసుకొచ్చారని తెలిపారు. చంద్రబాబు ఎంతసేపు జగన్‌ను తిట్టి ఓటేయమన్నాడే తప్ప చేసిందేమీలేదన్నారు. అందుకే ప్రజలు కూడా ఉవ్వెత్తున పోలింగ్ బూత్‌లకు బారులు తీరారని, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అందరూ జగన్‌ను ఆశీర్వదించారని చెప్పారు. టీడీపీ అల్లర్లకు ప్రతిగా తమ నాయకుడు కూడా స్పందిస్తే వేరేలా ఉండేదని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం మంచి సంప్రదాయం కాదని వైఎస్ జగన్ అందర్నీ సంయమనం పాటించాలని కోరారని తెలిపారు.

జగన్ రెండోసారి సీఎం కావడం ఖాయం

భారతదేశం లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాల



రహమత్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావడం ఖాయమని భారతదేశం లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాల ధీమా వ్యక్తం చేశారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఏపీలో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలే మరోసారి ఆయనను గెలిపిస్తాయన్న ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తరువాత టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. ఏపీలోని అన్ని అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని మాల స్పష్టం చేశారు.

గోపిరెడ్డి హత్యకు చదలవాడ కుట్ర..!

నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హత్యకు వ్యూహం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు ఇల్లు కేంద్రంగా కుట్ర
- గోపిరెడ్డి దొరక్కపోవడంతో ఆయన మామపై హత్యాయత్నం



రామకోటిరెడ్డి



అరవింద్



గోపిరెడ్డి



టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు ఇంట్లో స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట టౌన్: నరసరావుపేటలో రాజకీయాలను 'పచ్చ' దండు వ్యక్తిగత కక్షగా మార్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఓటమి భయంతో టీడీపీ అరాచకం సృష్టిస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు.. చివరకు ఓటు వేసిన వారి ఇళ్లపై విధ్వంసానికి పూనుకుంది. పల్నాడు ప్రాంతంలో ఎన్నికలప్పుడు ప్రధాన పార్టీల మధ్య గొడవలు ఎన్నో ఏళ్లుగా రగులుతూనే ఉంటాయి. ఎన్నికల అనంతరం ఆ పగలు చల్లారి, అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉంటారు. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం తెలుగుదేశం పార్టీ నాయకత్వం సరికొత్త ప్రతీకారానికి తెర తీసింది. గత ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకుని మరోసారి పోటీకి దిగిన నరసరావుపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబుకు మళ్లీ ఓటమి ఖాయమని పోలింగ్‌కు ముందే అన్ని సర్వేలు తేల్చాయి. దీంతో ఆయన వెన్నులో వణుకు పుట్టింది. ఈ క్రమంలో ప్రత్యర్థిని అడ్డు తొలగించుకుంటే తన గెలుపు ఖాయమని భావించి, నరసరావుపేటలో విధ్వంసానికి ప్రణాళిక రచించారని సమాచారం. ఇందులో భాగంగా పోలింగ్ రోజున నరసరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపైకి సుమారు 200 మంది టీడీపీ రౌడీలు మారణాయుధాలతో పట్టపగలు దాడికి వెళ్లారు. ఆ సమయంలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన మామ కంజుల రామకోటిరెడ్డిపై దాడికి తెగబడ్డారు. ఈ సంఘటనపై అరవింద్‌బాబుతో పాటు మరో 30 మందిపై నరసరావుపేట టూటౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మట్టుబెట్టాలనే పథకంతోనే ఆయన ఇంటిపైకి దాడికి వచ్చినట్లు తెలిసింది. ఈ దాడికి ఇతర రాష్ట్రాల నుంచి బౌన్సర్లు, కిరాయి రౌడీలను అరవింద్ బాబు పోలింగ్ ముందు రోజు రాత్రికే రప్పించినట్టు సమాచారం.

అరవిందబాబు ఇంట్లో పెట్రోల్ బాంబులు, వేట కొడవళ్లు

గొడవల నేపథ్యంలో పోలింగ్ అనంతరం టీడీపీ అభ్యర్థి అరవిందబాబును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆ సయమంలో ఆయన ఇంట్లో (ఇల్లు, ఆస్పత్రి ఒకచోటే) సోదాలు నిర్వహించగా.. పెట్రోల్ బాంబులు, ఇనుప రాడ్లు, వేట కొడవళ్లు, కంకర రాళ్లు, ఇతర మారణాయుధాలు దొరికాయి. పోలింగ్‌కు ముందుగానే వీటిని తీసుకొచ్చి ఉంచినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లోనూ ఓటమి ఖాయమని తేలడంతో గోపిరెడ్డిని అడ్డు తొలగించుకోవాలనే మారణాయుధాలు తెప్పించినట్లు తెలిసింది. మారణాయుధాలకు సంబంధించిన వీడియోలు రెండు రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అయినా పోలీసులు ఇందుకు సంబంధించి ఎటువంటి కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. పోలీసు పెద్దల అనుమతి రాకపోవడం వల్లే అరవింద్‌బాబుపై కేసు నమోదు కాలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా నరసరావుపేటలో అల్లర్ల కారణంగా రెండు రోజుల పాటు దుకాణాలు బంద్ చేయాలని పోలీసులు ఆదేశించారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉంది. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీడీపీ స్వార్థ రాజకీయాల కోసం తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇలాగైతే తామెలా బతకాలని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పల్నాడు, అనంత ఎస్పీలపై వేటు

- ఎన్నికల అనంతర ఘర్షణలపై ఈసీ సీరియస్
- 'సిట్'ఏర్పాటు.. రెండు రోజుల్లో నివేదిక!
- పల్నాడు కలెక్టర్, తిరుపతి ఎస్పీ బదిలీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ఎన్నికల సంఘం విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు అధికారులపై వేటు వేసింది. పల్నాడు, అనంతపురం ఎస్పీలు బిందు మాధవ్, అమిత్ బర్దర్‌లను సస్పెండ్ చేయగా తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌ను బదిలీ చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను సైతం బదిలీ చేసి శాఖాపరమైన విచారణ చేపట్టాలని సూచించింది. అలాగే పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాలకు చెందిన 12 మంది పోలీసు అధికారులను సస్పెండ్ చేసి శాఖాపరమైన విచారణ నిర్వహించాలని పేర్కొంది. హింస చెలరేగేందుకు కారకులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి రెండు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది. ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా గురువారం ఢిల్లీ వెళ్లి ఎన్నికల వేళ చెలరేగిన హింసపై స్వయంగా వివరణ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని, కౌంటింగ్ రోజు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఆరు ప్రతిపాదనలకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది.

టీడీపీ చెప్పినట్లు ఆడినందుకే

- ప్రజాస్వామ్య ప్రక్రియకు పాతరేసిన ఫలితం.. విధి నిర్వహణలో అలసత్వమే ఈసీ వేటుకు కారణం
- రాజకీయ ఒత్తిళ్లతో పోలీస్ అధికారుల బదిలీ.. పురందేశ్వరి జాబితా ప్రకారం నియామకాలు
- ఆ ప్రాంతాల్లోనే హింసాత్మక ఘటనలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఐ-ప్యాక్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెల్ఫీ

మరోసారి చరిత్ర సృష్టించబోతున్నాం

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం జగన్ గురువారం సందర్శించారు. విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలో ఉన్న ఐ - ప్యాక్ కార్యాలయానికి వచ్చిన ఆయన సుమారు అరగంట సేపు గడిపారు. ఐ-ప్యాక్ ప్రతినిధులను అభినందించి సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. 2019 ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలను దక్కించుకుని వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించిందని ఈ సందర్భంగా సీఎం జగన్ గుర్తు చేశారు. ఈ దఫా అంతకంటే ఎక్కువ స్థానాల్లో విజయ పతాకం ఎగురవేసి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు.

మరింత మంచి చేద్దాం..

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4న వచ్చే ఫలితాలు చూసి దేశం షాక్ అవుతుందని.. ఫలితాలు వెల్లడైన తర్వాత దేశం మొత్తం మన వైపు చూస్తుందని సీఎం జగన్ చెప్పారు. 59 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజలకు మంచి చేశామని.. రాబోయే ఐదేళ్లలో ఇంకా ఎక్కువ మేలు చేద్దామని చెప్పారు. రానున్న రోజుల్లో ఐ-ప్యాక్‌తో ప్రయాణం ఇలాగే కొనసాగుతుందన్నారు.

విశ్వసనీయతే విజయానికి మెట్టు..

గత ఎన్నికల్లో చారిత్రక విజయంతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ తొలి ఏడాదే మేనిఫెస్టోలోని హామీల్లో 95 శాతం అమలు చేశారు. మొత్తమ్మీద 99 శాతం హామీలను అమలు చేశారు. అర్హతే ప్రామాణికంగా వివక్ష, లంచాలకు తావు లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు అందించారు. సంక్షేమ పథకాల ద్వారా 59 నెలల్లో పేదల ఖాతాల్లోకి డీబీటీ రూపంలో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు. చెప్పిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరిగింది. వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయానికి ఇదే బాటలు వేసిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మహిళలు, గ్రామీణులు వైఎస్సార్‌సీపీ వైపే..

అమ్మ ఒడి, ఆసరా, చేయూత లాంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు సీఎం జగన్ సుస్థిర బాటలు వేశారు. కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకూ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేశారు. నామినేటెడ్ పనులు, పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మరీ మహిళలకు పట్టం కట్టారు. ఇంటి స్థలంతోపాటు ఇంటిని కూడా మహిళల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మహిళా సాధికారతకు బాటలు వేసిన సీఎం జగన్ నాయకత్వంపై మహిళల్లో మద్దతు మరింత పెరిగింది. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి గుమ్మం వద్దే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. ఊరు దాటాల్సిన అవసరం లేకుండా పనులన్నీ జరుగుతుండటంతో సీఎం జగన్ నాయకత్వంపై గ్రామీణుల నమ్మకం మరింత పెరిగింది.ఇటు ప్రభుత్వం.. అటు ప్రైవేట్ రంగాల్లో భారీ ఎత్తున ఉద్యోగాలు ఇవ్వడంతో సీఎం జగన్ నాయకత్వంపై యువతలో విశ్వసనీయత రెట్టింపైంది. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, గ్రామీణులే ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మహిళలు, గ్రామీణులు పెద్ద ఎత్తున సీఎం జగన్ నాయకత్వానికి మద్దతుగా ఓటు వేయడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందని, వైఎస్సార్‌సీపీ మరోసారి చారిత్రక విజయం సాధించడం ఖాయమని తేల్చి చెబుతున్నారు.

రాష్ట్రీయం

రుణమాఫీపై కసరత్తు

- పంటల బీమా టెండర్లకు అర్హతలు
- రైతులు వరి కొయ్యలు తగలబెడితే జరిమానా
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ పథకం విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. రుణమాఫీ పథకం అమలుకు సంబంధించి అధికారులతో చర్చించామని, ఖరీఫ్ కార్యాచరణకు సమాయత్తం అవుతున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి అమలయ్యే పంటల బీమా విధివిధానాలపైనా దిశానిర్దేశం చేసినట్లు గురువారం తుమ్మల ఒక ప్రకటనలో వెల్లడించారు. టెండర్లలో పేర్కొనే నిబంధనలు, ముందుకొచ్చే కంపెనీలకున్న అర్హతలు వంటివాటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించుకొని, రైతులు పంట నష్టపోయిన సందర్భంలో వారిని ఆదుకునేలా పథకం ఉండాలని అధికారులను ఆదేశించారు. పథకం అమలుకు ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు విధివిధానాలు రూపొందించి వెంటనే సరఫరా ప్రారంభించాలన్నారు. మొదటి విడత పంట నష్టపరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, రెండో విడత (ఏప్రిల్‌లో), మూడో విడత (మేలో) జరిగిన పంట నష్టం వివరాలను సమర్పించాలని ఆదేశించారు. అలాగే, వరి కొయ్యలు కాల్చకుండా యుద్ధప్రాతిపదికన రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అప్పటికీ వినకపోతే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వరి కొయ్యలు తగలబెడితే జరిమానా విధించాలని ఆదేశాలు జారీచేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్లను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేసేయాలని ఆదేశించారు. మల్బరీ సాగుకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసి పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల్లో మ్యాచింగ్ గ్రాంటు బకాయి నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని రకాల సహకార సంఘాల్లో సభ్యుల గుర్తింపు, పదవీకాలం ముగిసిన సంఘాల ఎన్నికల నిర్వహణకు సత్వరమే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

'అఖిలపక్షాన్ని పిలిచి రైతు సమస్యలు పరిష్కరించాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే రాజకీయ పార్టీలు, రైతు సంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు సంబంధించిన అనేక విషయాల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో రైతులను తన మాటలతో మభ్యపెట్టి రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని, అధికారంలోకి వచ్చాక ఆయన ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా గాలి కొదిలేసిందని ఆరోపించారు.

తహసీల్దార్ కార్యాలయంలో పెట్రోల్ పోసుకుని...

- భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలంటూ తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో ఘటన



తహసీల్దార్ కార్యాలయంలో రోదిస్తున్న తల్లీకూతుళ్లు

శాలిగౌరారం: తమ మాట వినకుండా మొదటి భార్య కుమార్తెకు తన భర్త భూమి రిజిస్ట్రేషన్ చేయడంపై ఆగ్రహించిన రెండో భార్య, ఆమె కుమార్తె తహసీల్దార్ కార్యాలయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి చెందిన పులిగిళ్ల బాలయ్యకు తక్కెళ్లపహాడ్-మనిమద్దె రోడ్డు వెంట 30 గుంటల వ్యవసాయ భూమి ఉంది. బాలయ్య మొదటి భార్య శిరీష అనారోగ్యంతో 2004లో మృతిచెందింది. వారికి కుమార్తె అఖిల ఉంది. ఆ తర్వాత బాలయ్య 2005లో శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన అన్నపూర్ణను రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు ఇద్దరు కుమార్తెలు వర్షిత, వైష్ణవి సంతానం. బాలయ్య తన అక్క పున్నమ్మ కుమారుడిని మొదటి భార్య కుమార్తె అఖిలకు ఇచ్చి వివాహం చేయాలనుకున్నాడు. ఈ క్రమంలో బాలయ్య తన పేరున ఉన్న 30 గుంటల భూమి నుంచి మొదటి భార్య కుమార్తె అఖిలకు 10 గుంటలు, అక్క పున్నమ్మకు 10 గుంటలు రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రెండో భార్య అన్నపూర్ణ, ఆమె కుమార్తెలు వర్షిత, వైష్ణవితో పాటు ఆమె తరఫు బంధువులు భూమిలో కొంత వాటా అన్నపూర్ణకు కూడా రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. అందుకు బాలయ్య ససేమిరా అనడంతో పాటు అన్నపూర్ణను గత నెల 17న కొట్టి తల్లిగారింటికి పంపించాడు. దీంతో అన్నపూర్ణ అదేరోజు రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాలయ్యపై ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే బాలయ్య మొదటి భార్య కుమార్తె అఖిలకు, అక్క పున్నమ్మకు భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు గత నెల 19న ధరణిలో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేశాడు. 20న భూమి రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉండగా.. రెండో భార్య అన్నపూర్ణ తహసీల్దార్‌ను భూమి రిజిస్ట్రేషన్ చేయవద్దని కోరడంతోపాటు, నకిరేకల్ కోర్టులో ఈనెల 5న పిటిషన్ కూడా దాఖలు చేసింది. 9న కోర్టు అర్జంట్ నోటీస్ జారీ చేసింది. గురువారం భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసీల్దార్ సిద్ధం కాగా.. బాలయ్య అతని కుమార్తె అఖిల, అక్క పున్నమ్మతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రెండో భార్య అన్నపూర్ణ, ఆమె చిన్న కుమార్తె వైష్ణవి, బంధువులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వాగ్వాదానికి దిగారు. పరిస్థితి గమనించిన తహసీల్దార్ పోలీసులకు ఫోన్ చేయడంతో నలుగురు పోలీసులు కార్యాలయానికి చేరుకొని అన్నపూర్ణ బంధువులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో తహసీల్దార్ చాంబర్‌లోకి వెళ్లిన అన్నపూర్ణ, ఆమె చిన్న కుమార్తె వైష్ణవి అప్పటికే తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించారు. వెంటనే పోలీసులు తల్లీకుమార్తెను బయటకు తీసుకొచ్చారు. అదేసమయంలో బాలయ్య కార్యాలయం నుంచి వెళ్లిపోతుండటం గమనించిన అన్నపూర్ణ తరఫు బంధువులు బాలయ్యపై రాళ్లతో దాడి చేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు బాలయ్యను ఓ కారులో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఓ ప్రమాదం నుంచి బయటపడి.. మరో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి..

- అమెరికాలో రోడ్డు ప్రమాదంలో జహీరాబాద్ వాసి మృతి



పృథ్వీరాజ్ (ఫైల్)

జహీరాబాద్: అమెరికాలోని చార్లెట్ ప్రాంతంలో గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన అబ్బరాజు పృథ్వీరాజ్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. పృథ్వీరాజ్ ఎనిమిదేళ్ల క్రితం ఐటీ ఉద్యోగం నిమిత్తం అమెరికా వెళ్లాడు. ఏడాదిన్నర కిందట సిద్దిపేట ప్రాంతానికి చెందిన శ్రీప్రియతో వివాహం జరిగింది. భార్యాభర్తలు బయటకు వెళ్లి పని ముగించుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. రోడ్డుపై నిలిచి ఉన్న ఓ వాహనాన్ని పృథ్వీరాజ్ నడుపుతున్న కారు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో భార్యాభర్తలిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం అనంతరం వారు రహదారికి మరోవైపు చేరుకున్నారు. కాగా, ప్రమాదం జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు పృథ్వీరాజ్ కారులో ఉండిపోయిన సెల్‌ఫోన్ కోసం వెళుతూ.. మళ్లీ రోడ్డు దాటుతున్న క్రమంలో అదే సమయంలో వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పృథ్వీ మృతదేహం శనివారం లేదా ఆదివారం ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని బంధువులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాల్ సీజ్

ఆర్మూర్: బీఆర్‌ఎస్‌కు చెందిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి భార్య రజితరెడ్డి పేరిట ఆర్మూర్ పట్టణంలో నిర్మించిన జీవన్‌రెడ్డి మాల్‌ను టీఎస్ ఆర్టీసీ అధికారులు గురువారం సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు బకాయి చెల్లించడానికి నెల రోజుల పాటు సమయం ఇచ్చి నోటీసులు ఇచ్చారు. పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించనందున మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు మైక్‌లో ప్రకటించారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈ నెల 9న ఆర్టీసీ అధికారులు రూ.మూడు కోట్ల 15 లక్షల బకాయిలు చెల్లించని పక్షంలో మాల్‌ను సీజ్ చేస్తామంటూ నోటీసులు జారీ చేస్తూ మైక్‌లో ప్రకటించారు. మాల్ నిర్వాహకులు రూ.63 లక్షల 15 వేలు చెల్లించినట్లు సమాచారం. మిగిలిన రూ.2 కోట్ల 51 లక్షల 85 వేలు రాబట్టుకోవడానికి ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇక నిత్యం క్షేత్రస్థాయిలోనే..

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన కార్యాచరణపై త్వరలో స్పష్టత ఇస్తామన్నారు.

'స్థానిక'సన్నద్ధత ప్రారంభించాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతను కూడా ఇప్పటినుంచే ప్రారంభించాలని కేసీఆర్ భావిస్తున్నారు. త్వరలో తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయమై దిశా నిర్దేశం చేయనున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారితో పాటు క్షేత్ర స్థాయిలో పనిచేసే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తామని కేసీఆర్ పలు సందర్భాల్లో చెప్తూ వస్తున్నారు. పార్టీ కార్యవర్గాల ఏర్పాటులోనూ ఇలాంటి నేతలు, కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించేందుకు 113 బీసీ ఉప కులాల గణన చేపట్టాలనే డిమాండ్‌ను కూడా ప్రభుత్వం ముందు పెట్టాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది.

అన్ని ఎన్నికల ఫలితాలు అనుకూలమే

రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల ఫలితాలూ పార్టీకి అనుకూలంగా వెలువడే అవకాశం ఉన్నట్లు కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మార్చి 28న జరిగిన శాసన మండలి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుస్తారని పార్టీ నేతలు కేసీఆర్‌కు వివరించినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,439 మంది ఓటర్లకు గాను 800 మందికి పైగా పార్టీ అభ్యర్థికే ఓటు వేసినట్లుగా అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉంటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి నివేదిత మంచి మెజారిటీ సాధిస్తారని కేసీఆర్ చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో జాతీయ పార్టీలతో పోలిస్తే బీఆర్‌ఎస్ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని చెప్పారు. 27న జరిగే 'వరంగల్- ఖమ్మం- నల్లగొండ'శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలో పార్టీ నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ఫలితాల గురించి ఆలోచించకుండా పార్టీ నేతలు, అభ్యర్థులు పార్టీ ఇచ్చే తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టాలని చెప్పారు.

నకిలీ వీడియో.. బీజేపీ కార్పొరేటర్ అరెస్టు

అరెస్టయిన వారిలో మరో ముగ్గురు



కారులోకి శ్రవణ్‌ను ఎక్కిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు



శ్రవణ్ (ఫైల్)

మల్కాజిగిరి (హైదరాబాద్): బహదూర్‌పురలోని ఓ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతోందంటూ నకిలీ వీడియోను వైరల్ చేశారన్న ఆరోపణలపై మల్కాజిగిరి బీజేపీ కార్పొరేటర్ శ్రావణ్‌తో పాటు మరో ముగ్గురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో తొలుత శ్రావణ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్టు సామాజిక మాధ్యమాలలో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ప్రచారం జరిగింది. కానీ గురువారం సాయంత్రానికి కార్పొరేటర్‌ను సైబర్ క్రైమ్ స్టేషన్‌కు తరలించినట్లు హైదరాబాద్ సైబర్ పోలీసులు ధ్రువీకరించారు. తాజా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పాతబస్తీ బహదూర్‌పురలో రిగ్గింగ్ జరుగుతోందంటూ ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయింది. ఈ వ్యవహారంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, మహ్మద్ బిన్ అలీ, కాశీ, మిథిలేష్‌లను అరెస్టు చేశారు. వీరే ఈ నకిలీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. అయితే శ్రవణ్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో వ్యవహరించిన తీరు ఆందోళనకు కారణమైంది. శ్రవణ్‌ను ఆయన కార్యాలయంనుంచి గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. బీజేపీ నేతలు, శ్రవణ్ కుటుంబ సభ్యులు మల్కాజిగిరి పోలీసు స్టేషన్‌కు వెళ్లినా సమాచారం లేకపోవడంతో ఆందోళన చెందారు. శ్రవణ్ కార్యాలయం సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను గమనించగా.. పోలీసులు మఫ్టీలో వచ్చినట్లు తేలింది.

ఎలాంటి మినహాయింపులు లేవు!

కేజ్రీవాల్‌కు బెయిల్‌పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌కు బెయిల్ విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవని సర్వోన్నత న్యాయస్థానం గురువారం స్పష్టంచేసింది. అయితే తీర్పుపై విమర్శనాత్మకమైన సమీక్ష వైఖరిని స్వాగతిస్తున్నామని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. మరోవైపు బెయిల్ తర్వాత ఎన్నికల ర్యాలీల్లో కేజ్రీవాల్ చేస్తున్న ప్రసంగాలను తప్పుబడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన వాదనలను, ప్రసంగాలను సమర్థిస్తూ కేజ్రీవాల్ తరఫు లాయర్లు చేసి వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకునేందుకు నిరాకరించింది. '' ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. ఏదైతే న్యాయంగా తోచిందో దానిని ఉత్తర్వుల రూపంలో మేం వెల్లడించాం'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈడీ అభ్యర్థన తిరస్కరణ

'' ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తే జూన్ రెండో తేదీన తాను మళ్లీ జైలుకు వెళ్లాల్సిన అవసరం రాదని ఎన్నికల ర్యాలీల్లో కేజ్రీవాల్ చెబుతున్నారు. ఆయనపై చర్యలు తీసుకోండి'' అని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. దీనిపై కోర్టు..' అది అంతా ఆయన ఊహ మాత్రమే. ఈ విషయంలో మేం ఇకపై ఏమీ చెప్పదల్చుకోలేదు'' అని ఈడీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ''తీర్పుపై విమర్శనాత్మకమైన సమీక్ష వైఖరికి అడ్డుచెప్పం. తీర్పుపై విమర్శలను మేం స్వాగతిస్తున్నాం. '' అని కోర్టు వ్యాఖ్యానించింది. '' ఆయన ఏ రోజున లొంగిపోవాలనేది మా ఉత్తర్వులో స్పష్టంగా ఉంది. ఇది స్వయంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్. ఈ ఉత్తర్వు ద్వారానే చట్టం అమలవుతుంది'' అని కోర్టు తెలిపింది. '' సొంత ఊహలతో బెయిల్ షరతులను ఆయన ఉల్లంఘిస్తున్నారు. ఆయన ఏం చేద్దామనుకుంటున్నారు? వ్యవస్థకు చెంపపెట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు'' అని సొలిసిటర్ జనరల్ ఆరోపించారు. '' ఆయన జూన్ రెండో తేదీన తప్పకుండా లొంగిపోవాల్సిందే. అయితే ఈ కేసు గురించి ఆయన మాట్లాడొచ్చు అనిగానీ మాట్లాడకూడదు అని గానీ మేం బెయిల్ ఉత్తర్వుల్లో 'పేర్కొనలేదు'' అని ధర్మాసనం వెల్లడించింది.

అమిత్ షా సంగతేంటి?: కేజ్రీవాల్ లాయర్

''సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ప్రత్యేక ట్రీట్‌మెంట్ జరిగినట్లు అనిపిస్తోంది. ఈయన బెయిల్ ఇతరుల సాధారణ బెయిల్ మాదిరి కనిపించట్లేదు. నేనే కాదు దేశంలో చాలా మంది ఇలాగే భావిస్తున్నారు అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్న మాటలను కేజ్రీవాల్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు గుర్తుచేశారు. ఆయన సంగతేంటి?అని ప్రశ్నించారు. ఆ విషయం జోలికి తాము వెళ్లదల్చుకోలేదని ధర్మాసనం తెలిపింది. '' ఆప్‌కు ఓటేయకపోతే జైలుకు వెళ్లక తప్పదేమో అని కేజ్రీవాల్ అనలేదు. కావాలంటే ఆమేరకు కోర్టులో అఫిడవిట్ సైతం సమర్పిస్తాం '' అని సింఘ్వీ తెలిపారు.

మద్యం కేసులో కేజ్రీవాల్, ఆప్‌పై చార్జ్‌షీట్ వేస్తాం: ఈడీ

ఢిల్లీ మద్యం కుంభకోణంలో త్వరలోనే కేజ్రీవాల్, ఆప్‌పై చార్జ్‌షీట్ దాఖలుచేస్తామని సుప్రీంకోర్టుకు ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు గురువారం తెలిపారు. మనీ లాండరింగ్ కేసులో తన అరెస్టును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన సందర్భంగా కోర్టుకు ఈడీ ఈ విషయం తెలిపింది. ఈడీ కేసులో ఆప్‌ను నిందితుల జాబితాలో చేర్చుతామని ఇప్పటికే ఢిల్లీ హైకోర్టుకు సైతం ఈడీ తెలిపింది.

అమిత్ షా వ్యాఖ్యలు అభ్యంతరకరం: కపిల్ సిబల్

కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో స్పెషల్ ట్రీట్‌మెంట్ జరిగి ఉండొచ్చని అమిత్ షా మాట్లాడటం చాలా అభ్యంతరకరమని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. ''ఈ వ్యాఖ్యల ద్వారా అమిత్ ఏకంగా సుప్రీంకోర్టు జడ్జీల ఉద్దేశాన్నే ప్రశ్నిస్తున్నారు. జనం ఇలా అనుకుంటున్నారని ఆయన ఇంటర్వ్యూలో చెప్పారు. జనం మాటను మీరు(అమిత్) నమ్మకపోతే ఇంటర్వ్యూలో చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? జనం మాటను మీరు నమ్మితే మీ అభిప్రాయంగానే ఇంటర్వ్యూలో చెప్పాలిగానీ జనాన్ని ఎందుకు మధ్యలో లాగుతారు?'' అని నిలదీశారు.

ఉక్రెయిన్ యుద్ధానికి రాజకీయ పరిష్కారం

- చైనా అధినేత షీ జిన్‌పింగ్ వెల్లడి
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చలు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పుతిన్, జిన్‌పింగ్

బీజింగ్: ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవడానికి త్వరలోనే రాజకీయ పరిష్కారం కనుగొంటామని చైనా అధినేత షీ జిన్‌పింగ్ సంకేతాలిచ్చారు. ఐరోపా ఖండంలో శాంతి, స్థిరత్వం తిరిగి నెలకొంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. గురువారం చైనా రాజధాని బీజింగ్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. చైనా–రష్యా మధ్య వ్యూహాత్మక సంబంధాలను దెబ్బతీసేందుకు అమెరికా చేసే ప్రయత్నాలను సహించకూడదని, గట్టిగా ఎదిరించాలని నిర్ణయానికొచ్చారు. తమ రెండు దేశాల సంబంధాల్లో కలుగజేసుకోవద్దని అమెరికాకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. అంతకుముందు రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం ఉదయం రష్యా నుంచి చైనాకు చేరుకున్న పుతిన్‌కు ఘన స్వాగతం లభించింది. ఐదోసారి రష్యా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత పుతిన్ తొలి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. చర్చల అనంతరం జిన్‌పింగ్, పుతిన్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరగా తెరపడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చైనా–రష్యా సంబంధాలను మూడోదేశం ప్రభావితం చేయలేదని పేర్కొన్నారు. అలా ప్రభావితం చేసేందుకు సాగే ప్రయత్నాలను అడ్డుకుంటామని వెల్లడించారు. తమ రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని స్పష్టం చేశారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలం కంటే ఇప్పుడు తమ బంధం ఇంకా దృఢమవుతోందని పేర్కొన్నారు. తమ చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను కచ్చితంగా కాపాడుకుంటామని తేల్చిచెప్పారు. అణు ఇంధనం నుంచి ఆహార సరఫరా దాకా భిన్న రంగాల్లో చైనాతో సంబంధాలను బలోపేతం చేసుకుంటామని పుతిన్ వెల్లడించారు. రష్యాలో చైనా కార్ల తయారీకి ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి తెరదించే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నందుకు చైనాకు పుతిన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చైనా–రష్యా మధ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేలా ఒకఒప్పందంపై జిన్‌పింగ్, పుతిన్ సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఇరుదేశాల అధికారుల మధ్య విస్తృత స్థాయి చర్చల తర్వాత 30 పేజీల ఈ ఒప్పందం డాక్యుమెంట్‌ను సిద్ధం చేసినట్లు రష్యా ప్రతినిధి యూరి ఉషకోవ్ చెప్పారు.

నిలకడగా స్లొవాకియా ప్రధాని ఆరోగ్యం

బన్‌స్కా బిస్ట్రికా: దుండగుడి కాల్పుల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్లొవాకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో(59) పరిస్థితి విషమమే అయినప్పటికీ నిలకడగా ఉంది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ఆయనతో గురువారం మాట్లాడినట్లు ఎన్నికైన అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినీ చెప్పారు. ఫికో ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రధాని ఫిగోకు ఐదు గంటలపాటు ఆపరేషన్ చేసినట్లు బన్‌స్కా బిస్ట్రికాలోని ఎఫ్‌డీ రూజ్‌వెల్ట్ హాస్పిటల్ డైరెక్టర్ మిరియమ్ లపునికోవా గురువారం చెప్పారు. విషమమే అయినప్పటికీ ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. ఇలా ఉండగా, ప్రధాని ఫికోపై కాల్పులకు పాల్పడిన వ్యక్తి(71) ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు లేనట్లుగా తేలిందని ఇంటీరియర్ మంత్రి మటుస్ సుటాజ్ ఎస్టోక్ తెలిపారు. ప్రధానిపై హత్యాయత్నం రాజకీయ ప్రేరేపితమని ఆయన అన్నారు. ఫికో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు అతడు తెలిపాడన్నారు. కవి కూడా అయిన నిందితుడు గతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. అతడి పేరు, ఇతర వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేదు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. బుధవారం హాండ్లోవా పట్టణంలో ఓ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ఫికోపై దుండగుడు తుపాకీతో పలుమార్లు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. మరికొద్ది రోజుల్లో యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్న వేళ చోటుచేసుకున్న ఈ ఘటన యూరప్ వ్యాప్తంగా కలకలం రేపింది. తొలుత ఉక్రెయిన్‌కు అనుకూలంగా వ్యవహరించిన స్లొవాకియా అనంతరం రష్యా అనుకూలంగా, అమెరికాకు వ్యతిరేకంగా పలు చర్యలు తీసుకుంది. ఫికో రాజకీయ ప్రత్యర్థి, మరికొద్ది రోజుల్లో పదవిని వీడనున్న అధ్యక్షురాలు జుజానా కపుటోవా గురువారం రాజధాని బ్రాటిస్లావాలో మీడియాతో మాట్లాడుతూ.. 'సమాజంలో పెరుగుతున్న విద్వేషాలకు నిదర్శనం ఈ ఘటన. రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి దేశంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నాలు చేస్తాం'అని తెలిపారు. ఈ సమయంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా మెలగాలని ఆమె కోరారు.

దేశవ్యాప్తంగా అల్లర్లకు విపక్షాల కుట్రలు

పౌరసత్వ సవరణ చట్టంపై దుష్ప్రచారం

- జూన్ 4 తర్వాత 'ఇండియా' కూటమి ముక్కలు చెక్కలే
- కేంద్రంలో వచ్చేది మళ్లీ మా ప్రభుత్వమే..
- ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లూ పనిచేస్తా..
- ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ



అజంగఢ్: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, ఉత్తరప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి, ఈ చట్టాన్ని మాత్రం మీరు ఎప్పటికీ రద్దు చేయలేరు అని ప్రతిపక్షాలను ఉద్దేశించి తేల్చిచెప్పారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్, జాన్‌పూర్, బదోహీ, ప్రతాప్‌గఢ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. సీఏఏ కింద కాందిశీకులకు భారత పౌరసత్వం కల్పించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, వీరంతా హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులేనని చెప్పారు. మతం ఆధారంగా భారత్‌ను విడగొట్టడంతో వీరంతా బాధితులుగా మారి మన దేశానికి వచ్చారని, చాలాఏళ్లుగా ఇక్కడే కాందిశీకులుగా బతుకుతున్నారని తెలిపారు. ప్రాణభయంతో వలస వచ్చిన బాధితులను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. బహిరంగ సభల్లో ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే..

ఈసారి మూడు డోసుల బుజ్జగింపు విధానాలు

''ఉత్తరప్రదేశ్‌లో గతంలో భయానక పరిస్థితులు ఉండేవి. పేలుళ్లకు పాల్పడిన ఉగ్రవాదులకు క్షమాభిక్ష ప్రసాదించి వదిలేసేవారు. ముష్కరులకు రాజకీయ ముసుగేసి కాపాడుతూ ఉండేవారు. దీనివల్ల ఉగ్రవాదం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. అయినా కొందరు విపక్ష నాయకుల ధోరణిలో మార్పు రావడం లేదు. ఉగ్రవాదం పట్ల సానుభూతి చూపుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పు మొదలైంది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ అనేవి రెండు పార్టీలు. నిజానికి అవి ఒకే దుకాణం. అక్కడ బుజ్జగింపు రాజకీయాలు, అబద్ధాలు, కుటుంబస్వామ్యం, అవినీతిని అమ్ముతుంటారు. ఈసారి వారు మూడు డోసుల బుజ్జగింపు విధానాలతో ముందుకొస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను కాజేసి ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ఆస్తుల్లో సగం దోచుకొని ఓటు బ్యాంక్‌కు అప్పగించాలని కుట్రలు పన్నుతున్నారు. దేశ బడ్జెట్‌లో ఏకంగా 15 శాతం నిధులను మైనార్టీలకే కేటాయించాలని భావిస్తున్నారు.

ఎన్నికల తర్వాత రాహుల్, అఖిలేశ్ విదేశాలకు వెళ్లిపోతారు

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచక, అవినీతి పాలనను ఉత్తరప్రదేశ్‌లోనూ తీసుకురావాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు భావిస్తున్నాయి. హిందువులను హత్య చేయడం, దళితులను, ఆదివాసీలను వేధించడం, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడమే తృణమూల్ కాంగ్రెస్ పాలన. అలాంటి పాలన మనకు కావాలా? అనేది ఉత్తరప్రదేశ్ ప్రజలు ఆలోచించుకోవాలి. జూన్ 4 తర్వాత మళ్లీ మా ప్రభుత్వమే వస్తుంది. ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లూ పని చేస్తానని గ్యారంటీ ఇస్తున్నా. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ), సమాజ్‌వాదీ పార్టీ యువరాజు(అఖిలేశ్ యాదవ్) విదేశాలకు వెళ్లిపోతారు. నోట్లో బంగారు చెంచాతో పుట్టిన బడాబాబులు ఈ దేశాన్ని సమర్థంగా నడపలేరు'' అని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ఎక్స్‌-రే యంత్రాలు

''ఈ లోక్‌సభ ఎన్నికలు మనకొక సువర్ణావకాశం. బలమైన ప్రభుత్వాన్ని నడిపించడంతోపాటు ఇండియా బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పే నాయకుడిని ఎన్నుకోవాలి. అందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలి. ప్రజలు వేసే ఓటు బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. బీజేపీ అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు నేరుగా నరేంద్ర మోదీ ఖాతాలోకి చేరుతుంది. ఇండియా కూటమి నాయకులు అధికారంలోకి వస్తే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నారు. ఇందుకోసం రాజ్యాంగాన్ని సైతం మార్చేస్తామంటున్నారు. నేను బతికి ఉన్నంత కాలం అలాంటి ఆటలు సాగనివ్వను. ఎక్స్‌-రే యంత్రాలతో ప్రజల ఆస్తులను సర్వే చేస్తామని కాంగ్రెస్ పెద్దలు చెబుతున్నారు. అందుకే మనమంతా జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్ అజెండాను నేను బయటపెట్టా. దాంతో కాంగ్రెస్ ఎక్స్‌-రే యంత్రాలు ముక్కలు ముక్కలుగా విరిగిపోతున్నాయి''.

మలివాల్ వాంగ్మూలం నమోదు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో కలిసేందుకు వెళ్లిన సందర్భంగా ఆయన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడి చేశారని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ ఆరోపించిన ఉదంతంలో పోలీసులు ముందడుగు వేశారు. ఈ విషయంలో ఇంతవరకు స్వాతి పోలీసులకు ఫిర్యాదుచేయలేదు. అయినా సరే పోలీసులే గురువారం స్వయంగా ఆమె ఇంటికి వెళ్లిమరీ ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సోమవారం కేజ్రీవాల్ నివాసానికి వెళ్లినప్పుడు జరిగిన ఘటన వివరాలను ఇద్దరు సభ్యుల ఢిల్లీ పోలీసు బృందానికి స్వాతి వివరించింది. నాలుగున్నర గంటలపాటు అదనపు పోలీసు కమిషనర్ పీఎస్ కుష్వాహా బృందం స్వాతి ఇంట్లో వివరాలు సేకరించింది. వాంగ్మూలం నమోదు పూర్తయిన నేపథ్యంలో బిభవ్‌పై పోలీసులు గురువారం ఎఫ్‌ఐఆర్ నమోదుచేశారు. సోమవారం దాడి ఘటన జరిగిన వెంటనే స్వాతి సివిల్ లైన్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనపై జరిగిన దాడి విషయాన్ని చెప్పి వచ్చారుగానీ ఫిర్యాదుచేయలేదు. దీంతో ఇన్నిరోజులైనా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దీంతో ఈ విషయాన్ని సూమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్ శుక్రవారం తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని బిభవ్ కుమార్‌కు సమన్లు జారీచేసింది.

కేజ్రీవాల్ మౌనమేల?: బీజేపీ

సొంత ఇంట్లో జరిగిన ఘటనపై సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారని బీజేపీ ప్రశ్నించింది. లక్నోలో పత్రికా సమావేశం సందర్భంగా కేజ్రీవాల్‌ను మీడియా ప్రశ్నించగా ఆయన సమాధానం చెప్పలేదు. దీంతో బీజేపీ విమర్శించింది. '' ఆయన మౌనం కూడా ఎంతో చెప్తోంది. జైలు నుంచి విడుదలయ్యాక సీఎంగా కంటే గూండాలా వ్యవహరిస్తున్నారు'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు.

బీజేపీ రాజకీయాలు ఆపాలి: స్వాతి

దాడి ఉదంతాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని బీజేపీకి స్వాతి మలివాల్ హితవు పలికారు. '' ఆరోజు నా విషయంలో జరిగింది నిజంగా బాధాకరం. అందుకే పోలీసులకు వాంగ్మూలం ఇచ్చా. సరైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నా. ఇందులో బీజేపీకి ఏం సంబంధం. వ్యక్తిత్వ హననం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనను రాజకీయంచేయొద్దని బీజేపీ నేతలకు ప్రత్యేకంగా విన్నవిస్తున్నా'' అని స్వాతి 'ఎక్స్'లో హిందీలో పోస్ట్‌చేశారు.

మహారాష్ట్రలో ఐటీ సోదాలు రూ.170 కోట్ల నగదు, నగలు స్వాధీనం

ముంబై: మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణంలో ఆదాయపు పన్ను శాఖ(ఐటీ) 72 గంటలపాటు నిర్వహించిన సోదాల్లో రూ.170 కోట్ల విలువైన సొత్తు లభ్యమైంది. పట్టణంలోని భండారీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆదినాథ్ అర్బన్ మల్టీస్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకు కార్యాలయాల్లో ఐటీ అధికారులు ఈ నెల 10వ తేదీన సోదాలు ప్రారంభించారు. 12వ తేదీ ఈ సోదాలు ముగిశాయి. వందలాది మంది అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. రూ.14 కోట్ల నగదు, 8 కిలోల బంగారం సహా మొత్తం రూ.170 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నగదును లెక్కించడానికి 14 గంటలు పట్టినట్లు సమాచారం. పెద్ద ఎత్తున పన్ను ఎగవేసినట్లు భండారీ ఫైనాన్స్, ఆదినాథ్ బ్యాంకుపై ఆరోపణలున్నాయి. నాందేడ్ టౌన్‌లో ఈ స్థాయిలో ఐటీ సోదాలు జరగడం, భారీగా సొమ్ము దొరకడం ఇదే మొదటిసారి.

ఇంటికి 100 మీటర్ల దూరంలో.. 26 ఏళ్ల పాటు చెరలో

అల్జీర్స్: టీనేజీ వయసులో పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యంలో అపహరణకు గురై ఏకంగా 26 సంవత్సరాలపాటు బందీగా ఉండిపోయిన అల్జీరియన్ వ్యక్తి వేదన ఇది. అల్జీరియా దేశంలోని డిజేఫ్లా రాష్ట్రంలో ఇటీవల కిడ్నాపర్ చెర నుంచి విముక్తుడైన 45 ఏళ్ల ఒమర్ బిన్ ఒమ్రాన్ గాథను స్థానిక అల్జీరియన్ ఎల్‌ఖబర్ వార్తాసంస్థ వెలుగులోకి తెచ్చింది.

గడ్డితో నిండిన సెల్లార్‌లో ఏళ్ల తరబడి..

ఒమర్‌కు 19 ఏళ్ల వయసు ఉన్నపుడు అంటే 1998 సంవత్సరంలో ఒకరోజు ఉదయం వృత్తివిద్యా పాఠశాలకు ఒమర్ తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. కొంతదూరం వెళ్లగానే కిడ్నాప్‌కు గురయ్యాడు. కిడ్నాప్‌చేసిన వ్యక్తి ఒమర్‌ను ఒక గడ్డితో కప్పిన నేల మాళిగలో దాచిపెట్టాడు. ఎందుకు కిడ్నాప్ చేశాడో, ఎందుకు ఇన్ని సంవత్సరాలు అక్కడే ఉంచాడో ఎవరికీ తెలీదు.

తోబుట్టువు పోస్ట్‌తో వెలుగులోకి

కిడ్నాపర్‌కు ఒక తోబుట్టువు ఉన్నారు. ఆ వ్యక్తి ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో ఒక విషయం రాసుకొచ్చారు. ఊరిలో ఒక కిడ్నాప్ ఉదంతంలో తన పాత్ర కూడా ఉందని ఒక పోస్ట్‌చేశారు. ఈ పోస్ట్‌ను ఒమర్ కుటుంబం గమనించి వెంటనే దర్యాప్తు సంస్థకు సమాచారం ఇచ్చారు. దీంతో నేషనల్ జెండర్‌మెరీన్(దేశ దర్యాప్తు సంస్థ) పాత కేసును తిరగతోడింది. పోస్ట్ పెట్టిన వ్యక్తిని విచారించి కిడ్నాపర్ ఇంటిని కనిపెట్టారు. అధికారులు ఆదివారం కిడ్నాపర్ ఇంటిపై మెరుపుదాడి చేసి ఇళ్లంతా వెతికారు. చివరకు గడ్డితో ఉన్న రహస్య సెల్లార్‌లో ఒమర్‌ను కనుగొన్నారు. 61 ఏళ్ల కిడ్నాపర్ పారిపోతుంటే పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాపర్ ఇల్లు.. ఒమర్ సొంత ఇంటికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉంది. ఈ సెల్లార్ ఒక గొర్రెల కొట్టం కింద ఉన్నట్లు తెలుస్తోంది.

కిటికీలోంచి చూసేవాడిని: ఒమర్

''కిడ్నాప్‌కు గురయ్యాక ఈ సెల్లార్‌లోనే ఉండిపోయా. నా కుటుంబసభ్యులు అటుగా వెళ్లేటపుడు సెల్లార్ కిటికీ నుంచి చూసేవాడిని. అరిచి పిలుద్దామని వందలసార్లు అనుకున్నా. కానీ పక్కనే కిడ్నాపర్ ఉండేవాడు. భయంతో నోరు మెదపలేదు'' అని విడుదలయ్యాక ఒమర్ చెప్పారు.

ఎలక్షన్ బీట్



గురువారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మీడియాతో మాట్లాడుతున్న ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్

రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తోంది: కేజ్రీవాల్

లక్నో: ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400పైగా సీట్లు సాధించి రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీ చూస్తోందని ఆప్ అగ్ర నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే హోంమంత్రి అమిత్ షా ప్రధాని అవుతారని, యోగి ఆదిత్యనాథ్‌ను యూపీ సీఎం పదవి నుంచి తొలగిస్తారని పునరుద్ఘాటించారు. 'అధికారంలోకి వస్తే భారీ కార్యక్రమం ఒకటుంటుందని బీజేపీ చెబుతోంది. రిజర్వేషన్లను తొలగించడమే ఆ కార్యక్రమం. రిజర్వేషన్లకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ఎల్లప్పుడూ వ్యతిరేకమే. మళ్లీ ఆ పార్టీకే అధికార పగ్గాలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు ముగింపు పలుకుతుంది'అని ఆయన అన్నారు. గురువారం కేజ్రీవాల్ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 'బీజేపీలో 75 ఏళ్లు దాటిన ఏ నేతకు కూడా ప్రభుత్వంతోపాటు పార్టీలో ఎలాంటి పదవులు ఇవ్వబోమని, అటువంటి వారు రిటైర్ కావాల్సిందేనంటూ ప్రధాని మోదీ నిబంధన తెచ్చారు. ఈ ప్రకారమే ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి నేతలు కొందరు రిటైరయ్యారు. మరికొందరిని తొలగించడమో, ఎన్నికల్లో టికెట్ నిరాకరించడమో జరిగింది. మోదీ ఈ నిబంధన అమలుకు కృషి చేస్తున్నారు'అని కేజ్రీవాల్ ఆరోపించారు. తనకు అడ్డుగా ఉంటారనుకున్న శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజె, రమణ్ సింగ్, దేవేంద్ర ఫడ్నవీస్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి వారి కథను మోదీ ముగింపునకు తెచ్చారని విమర్శించారు. 'అమిత్ షాకు ఆదిత్యనాథ్ అడ్డుగా ఉన్నారు. బీజేపీయే మళ్లీ అధికారంలోకి వస్తే రెండు నెలల్లోనే యూపీ సీఎం ఆదిత్యనాథ్‌ను సైతం పక్కన బెట్టడం ఖాయం'అని కేజ్రీవాల్ అన్నారు.

చీపురుకు ఓటేస్తే..జైలుకెళ్లాల్సిన పనుండదు

అమృత్‌సర్: తాను మళ్లీ జైలుకు వెళ్లరాదని భావిస్తే ఆప్‌కే ఓటేయాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రజలను కోరారు. గురువారం ఆయన పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. 'నేను జైలుకు వెళ్లాలా వద్దా అనేది మీ చేతుల్లోనే ఉంది. చీపురు గుర్తు బటన్‌ను మీరు నొక్కితే నేను మళ్లీ జైలుకెళ్లాల్సిన అవసరం ఉండదు. కేజ్రీవాల్‌కు స్వేచ్ఛా లేక జైలా అనే విషయం ఆలోచించి మీరు బటన్ నొక్కండి. చీపురు గుర్తుపై నొక్కితే దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించినట్లేనని గుర్తుంచుకోండి'అని ఆయన అన్నారు.

ఇండియా కూటమిలో మేము భాగమే

మళ్లీ మాటమార్చిన మమత

తమ్లుక్: ఇండియా కూటమికి బయటి నుంచి మద్దతు ఇస్తామని ప్రకటించిన మరుసటి రోజే తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తన మాటలను సవరించుకున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమిలో తాను ముమ్మాటికీ భాగస్వామినేనని, కూటమిలో కొనసాగుతానని మమత గురువారం ప్రకటించారు. బెంగాల్‌లో మాత్రమే సీపీఎం, కాంగ్రెస్‌తో పొత్తులు లేవని గురువారం తమ్లుక్‌లోని ఒక ఎన్నికల సభలో అన్నారు. 'కొందరు నిన్నటి నా ప్రకటనను తప్పుగా అర్థం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో నేను ఇండియా కూటమిలో భాగస్వామినే. ఇండియా కూటమి అనేది నా ఆలోచన. జాతీయ స్థాయిలో అందరం కలిసే ఉన్నాం. ఇకమీదటా ఉంటాం కూడా' అని ఆమె వ్యాఖ్యానించారు.

గోవధను అడ్డుకుంటాం: అమిత్ షా

మధుబని: 'బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం గోవధకు వ్యతిరేకం. అధికారంలోకి రాగానే మేం ఎట్టి పరిస్థితుల్లోనూ దానిని అనుమతించం'అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ)పై కేంద్రం విధించిన నిషేధాన్ని ఆయన సమర్థించుకున్నారు. గురువారం ఆయన బిహార్‌లోని మధుబని, సతామర్హి లోక్‌సభ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రచారం ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఒకరి తర్వాత ఒకరు చేపట్టేందుకు ఇండియా కూటమి నేతలు సిద్ధంగా ఉన్నారని అమిత్ వ్యాఖ్యానించారు. 'ప్రధాని మోదీకి మూడోసారీ అధికారం ఇవ్వాలని ఇప్పటికే ప్రజలు నిర్ణయించుకున్నారు. ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి లేనే లేరు. కూటమి తరఫున ప్రధాని అభ్యర్థి ఎవరుంటారో మీకు తెలిస్తే చెప్పండి' అని మంత్రి అమిత్ షా అన్నారు.

గోశాలల పరిస్థితి అధ్వానం: ప్రియాంక

రాయ్‌బరేలి: కాంగ్రెస్ పార్టీ గాంధీజీ విధానాలను అనుసరిస్తోందని, చనిపోయేముందు ఆయన 'హే రామ్' అని అన్నారని ప్రియాంకా గాంధీ గురువారం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హిందువులకు వ్యతిరేకమని మోదీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 'మేము హిందూ మతానికి వ్యతిరేకమని బీజేపీ ఆరోపిస్తోంది. తుదిశ్వాస విడిచేముందు హే రామ్ అన్న గాంధీజీ ఆదర్శాలను కాంగ్రెస్ పాటిస్తోందని ప్రియాంక గురువారం రాయ్‌బరేలీలోని ఒక ఎన్నికల సభలో అన్నారు. 'కాషాయ పార్టీ హిందూ ధర్మ పరిరక్షకులని చాటింపు వేసుకుంటుంది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం నడిపే గోశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానాలను తిరస్కరించామని మమ్మల్ని హిందూ వ్యతిరేకులమని బీజేపీ ముద్ర వేస్తోంది. ఒకసారి యూపీలోని గోశాలల పరిస్థితి చూడండి. ఒక వీడియోలో మృత ఆవును కుక్కలు పీక్కుతింటున్నాయి. అదే ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడు గోశాలలను మెరుగుపరిచాం. గోశాలలను నడుపుతున్న స్వయం సహాయక గ్రూపులకు ఆర్థికంగా అండగా నిలవాలని పేడను ప్రభుత్వం ఖరీదు చేసింది' అని ప్రియాంక పేర్కొన్నారు.

మోదీ ప్రజా విశ్వాసం కోల్పోయారు: పవార్

నాసిక్: దేశ ప్రజలు ఈ దఫా రాజకీయ మార్పును కోరుకుంటున్నందున ప్రధాని మోదీ విశ్వాసం కోల్పోయారని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ చెప్పారు. 'లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం అనేక ప్రాంతాలకు వెళ్లా. రాజకీయాలపై ప్రజల ఆలోచనలు మారినట్లు గమనించా. వారు మార్పును కోరుకుంటున్నారు. అందువల్ల మోదీ ప్రజల విశ్వాసం కోల్పోయినట్లే. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)కి ప్రస్తుతం పరిస్థితి అనుకూలంగా ఉంది' అని పవార్ చెప్పారు. అయితే, ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయనేది తాను చెప్పలేనన్నారు.

నాలుగు దశల్లో సగటున 67% పోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఈ నెల 13వ తేదీన జరిగిన నాలుగో విడత పోలింగ్‌లో సవరించిన అంచనాల ప్రకారం 69.16% పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ తెలిపింది. 2019 పార్లమెంటరీ ఎన్నికలతో పోలిస్తే ఇది 3.65 శాతం ఎక్కువని తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం మూడో విడతలో 65.68%, రెండో విడతలో 66.71%, మొదటి విడతలో 66.14% పోలింగ్ నమోదైనట్లు వివరించింది. మొదటి నాలుగు దశల్లో కలిపి సగటున 66.95 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ గురువారం తెలిపింది. ఇప్పటి వరకు సుమారు 97 కోట్ల మంది ఓటర్లకు గాను 45.10 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించింది. మొత్తం 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 379 స్థానాలకు పోలింగ్ పూర్తయిందని తెలిపింది.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం | 17 | మే | 2024



మళ్లీ 'అమ్మహస్తం'
రేషన్ సరుకుల పంపిణీలో భాగంగా అమ్మహస్తం పథకాన్ని మళ్లీ ప్రవేశపెట్టేందుకు సర్కారు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.
8లో▸



కథలు చదవండి
చిన్నారుల్లో పఠనాసక్తిని పెంచేందుకు విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. లిటరసీ క్లౌడ్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.
8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/26.0
వాతావరణం
జిల్లాలో నేడు స్వల్పంగా ఉక్కపోత ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అధిక సాంద్రత పత్తిసాగుపై అవగాహన అవసరం



కరీంనగర్ అర్బన్: అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై అధికారులకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని కృషిభవన్‌లో కేవీకే జమ్మికుంట ఆధ్వర్యంలో ఏవోలు, ఏఈవోలకు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై అవగాహన కల్పించారు. పత్తి సాగు విధానం, పాటించాల్సిన మెలకువలు వివరించారు. చీడపీడల నివారణ, తెగుళ్ల నియంత్రణపై సమగ్రంగా తెలియజేశారు. జీఎస్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి విజయగోపాల్‌రెడ్డి, కేవీకే కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఆత్మ పీడీ ప్రియదర్శిని, తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డా.విజయభాస్కర్, శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, వేణుగోపాల్, ప్రభాకర్, మహేశ్, ప్రశాంతి, ఏడీఏ రణధీర్‌రెడ్డి, హుజూరాబాద్ ఏడీఏ సునీత తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణ అందరి బాధ్యత



కరీంనగర్‌టౌన్: దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుని డెంగీ నివారణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా వైద్యాధికారి సుజాత పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీని డీఎంహెచ్‌వో సుజాత ప్రారంభించారు. డెంగీ ఏడీస్ దోమకాటు ద్వారా వ్యాప్తిచెందుతుందని, వ్యాధి సోకితే తీవ్రమైన తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, కండరాలు, కీళ్లనొప్పులు, రక్తస్రావం జరుగుతుందని వెల్లడించారు. డెంగీ దోమలు కూలర్లు, పాతటైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బొండాలు, పూలతొట్టిల్లో పెరుగుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు డ్రైడే పాటించాలన్నారు. గతేడాది జిల్లాలో 200 డెంగీ కేసులు నిర్ధారణ కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 23కేసులు నిర్ధారణ అయినట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జువేరియా, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రాజగోపాల్‌రావు, డీఐవో సాజిదా పాల్గొన్నారు.

గాలి దుమారంపై అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ సిబ్బందికి ఎస్ఈ గంగాధర్ సూచన



కొత్తపల్లి(కరీంనగర్): ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడుతున్న గాలిదుమారంపై విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. కరీంనగర్ విద్యుత్ భవన్‌లో గురువారం అలుగునూర్ సబ్‌డివిజన్ పరిధిలోని ఓఅండ్ఎం స్టాఫ్‌తో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యుత్ లైన్లను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలు, గాలి దుమారం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కరీంనగర్ రూరల్ డీఈ ఎం.తిరుపతి, ఎస్ఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకింద పంట మిగులు కాల్చొద్దు

కొత్తపల్లి (కరీంనగర్): పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగలబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. విద్యుత్ లైన్ల కింద సాగుచేసే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మానకొండూర్ మండలం అన్నారం, చెంజర్ల, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, లలితాపూర్, ముంజంపల్లి, పచ్చునూరు, వేగురుపల్లి, వెల్ది గ్రామాలు, చిగురుమామిడి మండలం ఇందుర్తి, ముదిమాణిక్యం, ముల్కనూర్, నవాబుపేట, పీచుపల్లి, సుందరగిరి, తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్, మన్నెంపల్లి, పర్లపల్లి, పాలంపల్లి, పోరండ్ల గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంటసాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, సమీపంలోని జంతువులు, మానవులకు హాని జరిగే ప్రమాదముందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ లైన్లకింద పంటవ్యర్థాలు కాల్చొద్దన్నారు.

పెద్దపల్లి బైపాస్ చకచకా

- ఊపందుకున్న రైల్వేస్టేషన్ పనులు
- చీకురాయి వద్ద స్టేషన్, ట్రాక్ కోసం భూమి చదును
- పెద్దపల్లి–నిజామాబాద్–కాజీపేట రూట్లో తగ్గనున్న దూరభారం
- తిరుపతి ప్రయాణికులకు సమయం ఆదా
- రైల్వేలైన్ పూర్తయితే మధ్యలో ఆగకుండా కాజీపేట వెళ్లే అవకాశం



చీకురాయి వద్ద కొనసాగుతున్న బైపాస్ పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ మార్గంలో పెద్దపల్లి బైపాస్ స్టేషన్ పనులు ఊపందుకున్నాయి. దాదాపు దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉండగా గతేడాది మోక్షం లభించిన విషయం విదితమే. చీకురాయి వద్ద ట్రాక్, స్టేషన్ పనులు చకచకా సాగుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ట్రాక్ వచ్చే రైల్వే బడ్జెట్ నాటికి అందుబాటులోకి రావొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అప్పుడు పెద్దపల్లి–నిజామాబాద్ రూట్ నుంచి కాజీపేట మీదుగా వెళ్లాల్సిన రైళ్లు ఎక్కడా ఆగే అవసరం లేకుండా నేరుగా వెళ్లొచ్చు.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా..
1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేశారు. అది దాదాపు మూడు దశాబ్దాలకు అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు ముంబై నుంచి కాజీపేటను కలిపే రైల్వే మార్గం అందుబాటులోకి వచ్చింది. ఈ మార్గం నుంచి కాజీపేటకు వెళ్లాల్సిన రైళ్లు పెద్దపల్లి వెళ్లాలి. ఇలా దాదాపు 40 నుంచి 60 నిమిషాలకు పైగా వేచి చూడాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా పెద్దపల్లి–బల్లార్షా–కాజీపేట లైన్‌ను పెద్దపల్లి–నిజామాబాద్ మార్గంతో అనుసంధానం చేయాలని నిర్ణయించారు. భవిష్యత్తు అవసరాల నేపథ్యంలో చీకురాయి సమీపంలో స్థలాన్ని ఎంపిక చేశారు. తొలుత ఈ మార్గంలో సర్వే చేశారు. అనంతరం పెద్దపల్లి జిల్లాలోని చీకురాయి–పెద్దబొంకూరు గ్రామాల మధ్య పెద్దపల్లి బైపాస్ రైల్వేస్టేషన్ నిర్మించ తలపెట్టారు. దాంతో రెండు మార్గాలను కలపాలంటే దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాక్ వేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అధికా రులు రెండు గ్రామాల పరిధిలో గతేడాది భూసేకరణకు స్థానికులను ఒప్పించారు. గత ఆగస్టులో బైపాస్ లైన్‌లో ఎలక్ట్రిక్ లైన్ నిర్మించేందుకు టెండర్లు పిలిచారు.

తగ్గనున్న దూరభారం, సమయం..
ఈ స్టేషన్, రెండు కిలోమీటర్ల బైపాస్ రైల్వేలైన్ పూర్తయితే నిజామాబాద్ మీదుగా కాజీపేట వెళాల్సిన రైళ్లు పెద్దపల్లిలో ఆగాల్సిన అవసరం లేదు. అవి నేరుగా కాజీపేట వెళ్లే వీలుంటుంది. ప్రస్తుతం తిరుపతి–కరీంనగర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ గురువారం, ఆదివారం కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్తోంది. ఈ క్రమంలో కాజీపేటకు సిగ్నల్ దొరికేందుకు దాదాపు 40 నిమిషాల నుంచి గంట వరకు సమయం పడుతుంది. త్వరలో బైపాస్ స్టేషన్, ట్రాక్ పూర్తయితే తిరుపతి ప్రయాణంలో ఒక గంట కలిసి వస్తుంది. ఇదే రైలు తిరిగి వచ్చే క్రమంలోనూ మరో గంట సమయం ఆదా అవుతుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ మార్గం పూర్తయితే విజయవాడ తోపాటు సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్ మార్గాల్లో దూరభారం, సమయం తగ్గనున్నాయి.

గణనీయంగా పెరిగిన ఫ్రీక్వెన్సీ
కరోనాకు ముందు ఇది కేవలం సింగిల్ లైన్ మార్గం. నిజామాబాద్ వరకు కనెక్టివిటీ ఉండటం, ఈ మార్గంలో వందే భారత్ వంటి రైళ్లు సైతం నడిచేలా ఇటీవల 100 కి.మీ. వేగం తట్టుకునేలా ట్రాక్ సామర్థ్యం పెంచారు. గతంలో ఖాజీపేట–బల్లార్షా సెక్షన్‌లోని రైళ్లు సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్లేవి. దీని వల్ల చాలా ఇంధనం, సమయం వృథా అయ్యేవి. ఈ మార్గం పూర్తి కావడంతో కరోనా కాలంలో పెద్దపల్లి–నిజామాబాద్ రూట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. ప్రతీరోజు గ్రానైట్, బొగ్గు, బాయిల్డ్ రైస్, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే రైళ్ల ఫ్రీక్వెన్సీ గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సరుకు రవాణా రైళ్ల ద్వారా అత్యధికంగా ఆదాయం తీసుకువచ్చే రైల్వే మార్గాల్లో పెద్దపల్లి–నిజామాబాద్ మార్గం ఒకటిగా నిలిచింది.

ఏఎంఆర్‌యూటీ పథకం కింద నిధులు
ఈ మార్గంలో కేవలం రెండు పుష్‌పుల్(డెమూ, మెమూ) ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. కాజీపేట నుంచి దాదర్ ముంబయి వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును ఇటీవల నిలిపివేశారు. తిరుపతి నుంచి కరీంనగర్ బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే రెగ్యులర్‌గా నడుస్తోంది. ఈ రైల్వే మార్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ లాంటి ఎక్కువ జనాభా కలిగిన పట్టణాలున్నాయి. భవిష్యత్తులో ఈ మార్గం డబ్లింగ్ పూర్తయితే ఇటు ముంబై వైపు, అటు సికింద్రాబాద్ వైపు ప్రయాణికుల రైళ్లు పెరిగే అవకాశాలున్నాయి. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్(ఏఎంఆర్‌యూటీ) పథకం కింద ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌కు రూ.26.60 కోట్లు, రామగుండం రూ.26.50 కోట్లు పెద్దపల్లికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. కరీంనగర్, రామగుండం పనులు త్వరలో పూర్తికానుండగా, పెద్దపల్లిలోనూ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

సంతోషంగా ఉంది



చీకురాయి–పెద్దబొంకూరు మధ్య రైల్వేస్టేషన్ నిర్మిస్తారని తెలిసినప్పటి నుంచి సంతోషంగా ఉంది. ఇక్కడ స్టేషన్ కడితే.. పెద్దపల్లి పట్టణం మరో పక్క నుంచి అభివృద్ధి మొదలవుతుంది. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్ నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి సమయం, దూరభారం తగ్గుతాయి.
– మేకల శ్రీనివాస్, చీకురాయి, పెద్దపల్లి

దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి



తన నివాసంలో ధర్నాలో కూర్చున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావు తదితరులు

- తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్
- రైతుధర్నాలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుధర్నా నిర్వహించారు. కమలాకర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు మాట ఇచ్చిన ప్రకారం ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసి, అన్ని రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్దతుధరతో పాటు ప్రతీరైతు ఖాతాలో ఎలాంటి నిబంధనలు లేకుండా క్వింటాల్‌కు రూ.500 బోనస్ వేయాలన్నారు. కేవలం సన్నరకానికే రూ.500 బోనస్ ఇస్తామనడం మోసపూరిత చర్య అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లను గుర్తించే విధానం లేదని, ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు వచ్చినా ఇప్పటి వరకు 33 లక్షల టన్నులే కొన్నారని అన్నారు. అకాల వర్షాలతో అన్నదాతలు అల్లాడిపోతున్నారని తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మేయర్ వై.సునీల్‌రావు, పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, కొత్తపల్లి వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డవేణి మధు, పొన్నం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాగు రంగాన్ని లాభసాటిగా మలచండి



కేవీకే శాస్త్రవేత్తలకు టార్చ్‌ను అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల కసరత్తు అవసరం
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: సాగురంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ రైతులను తదనుగుణంగా ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి శాస్త్రవేత్తలు, అధికారులను ఆదేశించారు. కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి వచ్చిన టార్చ్‌ను గురువారం కలెక్టర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులకు అందజేశారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. సదరు విధానంతో కలిగే లాభాలను వివరించాలని, రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. రైతులకు పంటల సాగులో ఏ ఇబ్బంది వచ్చినా వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్, కేవీకే ప్రధాన కార్యదర్శి విజయ్ గోపాల్‌రెడ్డి, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు, ఏడీఏ రణదీర్ రెడ్డి, శాస్త్రవేత్తలు ప్రభాకర్, ప్రశాంతి, విజయ్, వేణుగోపాల్, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదరణ లేక.. ఆదాయం రాక

- 'వెండితెర'కు గడ్డుకాలం
- నేటి నుంచి కొన్ని థియేటర్స్ బంద్
- మరికొన్ని యథావిధిగా నిర్వహణ



కరీంనగర్‌కల్చరల్: ఒకప్పుడు వెలుగు వెలిగిన వెండితెర ప్రస్తుతం వెలవెలబోతోంది. ఆదరణ లేక.. ఆదాయం రాక గడ్డుకాలం ఎదుర్కొంటోంది. ఓటీటీల పరంపర.. ప్రస్తుతం పెద్ద సినిమాలు లేకపోవడం.. ఓ వైపు ఎన్నికల హడావుడి.. మరోవైపు ఐపీఎల్ సందడి వెరసి సినిమా థియేటర్లు కష్టకాలం ఎదుర్కొంటున్నాయి. కనీస నిర్వహణ ఖర్చులు రాక మూతపడుతున్నాయి. దీంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల సంఘం పిలుపు మేరకు నగరంలోని పలు థియేటర్లు నేటినుంచి పదిరోజుల పాటు మూసివేయాలని నిర్ణయించారు. ఒకవేళ సరిపడా ప్రేక్షకులు వస్తే అప్పటికప్పుడు సినిమాలు ప్రదర్శిస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం సినిమాల సందడి తగ్గిందని, ఒక్కోషోకు కనీసం 20మంది ప్రేక్షకులు రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతీషోకు కనీసం రూ.3వేలకు పైగా వస్తేనే థియేటర్లు నడిపేందుకు వీలవుతుందని, లేకుంటే ఆర్థిక భారం తప్పదని అంటున్నారు. కాగా.. ఐపీఎల్, లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం పెద్దసినిమాలు వస్తే థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య పెరిగే అవకాశముందని కొందరు థియేటర్ల యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ప్రస్తుతం ఐదు సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండగా.. రెండు, మూడు థియేటర్లు పదిరోజుల పాటు మూసివేసే అవకాశముంది.

రూ.100 తగ్గిన పత్తి ధర



జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో బుధవారం క్వింటాల్‌కు రూ.7,150 ధర ఉండగా.. గురువారం రూ.100 తగ్గుముఖం పట్టి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,050 పలికింది. మార్కెట్‌కు తొమ్మిది వాహనాల్లో 77 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6,500కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

Special Story



కరీంనగర్‌లోని మద్యపాన, మాదక ద్రవ్య విముక్తి కేంద్రం

బానిషాకు విముక్తి

'కరీంనగర్‌కు చెందిన అజర్ హుస్సేన్ మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో గొడవలు జరిగాయి. అతడి భార్య పోలీసులను ఆశ్రయించగా అజర్‌ను చికిత్స కోసం డీ అడిక్షన్ సెంటర్‌కు రెఫర్ చేశారు. 40 రోజులు చికిత్స, యోగా, ధ్యానం చేయిస్తూ, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో అతడు మద్యం నుంచి విముక్తి పొంది సాధారణ జీవనం సాగిస్తున్నాడు'.

'జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన రాజేశ్వరి బీడీ కార్మికురాలు. పొగాకుతో ఉత్పత్తి అయిన అంబర్‌కు అలవాటైంది. ఆమె ఊరి డాక్టర్ సూచన మేరకు డీ అడిక్షన్ కేంద్రంలో చేరగా కేవలం 15 రోజుల వ్యవధిలో తన అలవాటు మానుకుంది'.

'సత్యనారాయణ రైతు. 20 ఏళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి భార్య సఖి కేంద్రాన్ని ఆశ్రయించగా వారు చికిత్స కోసం డీ అడిక్షన్ కేంద్రానికి పంపించారు'.

'కరీంనగర్ సమీప గ్రామానికి చెందిన ఆరో తరగతి బాలుడు స్నేహితుల ద్వారా గంజాయికి అలవాటు పడ్డాడు. తల్లిదండ్రులు చైల్డ్‌లైన్ వారిని సంప్రదించారు. వారు సీడబ్ల్యూసీ ద్వారా చికిత్స కోసం సెంటర్‌లో చేర్పించగా రెండునెలల్లో గంజాయి అలవాటు మానేసి స్కూల్‌కు వెళ్తున్నాడు.. ఇలా ఒకరిద్దరు కాదు.. ఈ కేంద్రం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు దాదాపు వెయ్యి మంది మత్తు పదార్థాల నుంచి విముక్తి పొంది కుటుంబాలతో సంతోషకరమైన జీవనం సాగిస్తున్నారు'.



కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులు



క్యారమ్స్ ఆడుతున్న బాధితులు

- కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో డీ అడిక్షన్ సెంటర్
- మద్యపాన, మాదకద్రవ్య బాధితుల పునరావాస కేంద్రం
- ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉచితంగా సేవలు, చికిత్స





విద్యానగర్(కరీంనగర్):

మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటుపడుతూ చాలా మంది తమ జీవితాలను నరకప్రాయం చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత విద్యార్థి దశ నుంచి వీటి బారిన పడుతోంది. నగరాలు, పట్టణాలకే పరిమితమైన మత్తుపదార్థాల జాడ్యం ఇప్పుడు గ్రామాలకు పాకడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల జగిత్యాల, చొప్పదండిలో వెలుగుచూసిన ఘటనలు బలాన్ని చేకూరుస్తున్నాయి.

తీవ్ర ప్రభావం
యువత సరదాగా తాగే మద్యం అలవాటు తర్వాత మత్తు పదార్థాల వైపు అడుగులు వేసేలా చేస్తోంది. మత్తు పదార్థాలు సేవించిన తర్వాత మెదడులో డోపమైన్, సెరటోనిన్ అనే ఉత్ప్రేరకాలు విడుదలై ఉత్తేజం, హుషారుగా అనిపిస్తుంది. అది కొద్దిసేపే ఉంటుంది. దీంతో మళ్లీ మళ్లీ మత్తుపదార్థాలు తీసుకోవాలనిపించి వాటికి బానిసవుతారు. ఈక్రమంలో ఆరోగ్యం, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి జీవితాలు అల్లకల్లోలమవుతాయి.

ప్రకృతి పర్యావరణ సంస్థ
ప్రకృతి పర్యావరణ సంస్థ 2011లో స్వతహాగా మద్యపాన, మాదక ద్రవ్యాల విముక్తి కేంద్రాన్ని కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో ప్రారంభించింది. అనేక మందికి ఉచిత సేవలు, చికిత్స అందించింది. సంస్థ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ 15 పడకల కేంద్రం నిర్వహణకు అవకాశం కల్పించగా, 2019 నవంబర్‌లో డీ అడిక్షన్ సెంటర్ ప్రారంభించారు. ఇప్పటి వరకు దాదాపు 900 మందిని చేర్చుకుని చికిత్స అందించగా, అవుట్ పేషెంట్లుగా మరో 1,000 మందికి చికిత్స, 500 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

చికిత్స విధానం
మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని ఈ కేంద్రంలో చేర్చుకుని ముందుగా డీ టాక్సికేషన్ తర్వాత డీ అడిక్షన్ చేస్తారు. వ్యక్తి ప్రశాంతంగా ఉండేలా వైద్యం అందిస్తారు. ఆగోనెస్ట్ థెరపీ ద్వారా బాధితులు పదిరోజుల్లో సాధారణ స్థితికి వస్తారు. మద్యం జోలికి పోకుండా, అయిష్టత ఏర్పడేలా మందులు ఇస్తారు. ఈ మందులు వాడినప్పుడు మద్యం సేవిస్తే రియాక్షన్ అయి వాంతులు, తలనొప్పి వంటివి జరిగి మద్యం జోలికి వెళ్లరు. ఈ కేంద్రంలో అన్ని సేవలను ఉచితంగా అందిస్తారు.

విముక్తి కేంద్రంలో దినచర్య ఇలా..
ఉదయం 6 గంటలకు: నిద్ర లేవడం
6.30 నుంచి 8 గంటల వరకు: యోగా, వ్యాయామం
8.30 నుంచి 9.30 వరకు : అల్పాహారం, టీ
10.30 నుంచి 11.30 వరకు: గ్రూప్ థెరపీ
11.30 నుంచి 12.30 వరకు: కార్యాచరణ
12.30 నుంచి 1.30 వరకు: భోజనం
సాయంత్రం 4 గంటలకు: టీ
4.30 నుంచి 5.30 వరకు ఆటలు
5.30 నుంచి 6.30 వరకు: ఒకరితో ఒకరు సమావేశం కావడం
6.30 నుంచి 7.30 వరకు వ్యక్తిగత హిత బోధన (కౌన్సెలింగ్)
7.45 గంటలకు: ప్రార్థన
రాత్రి 8 నుంచి 8.30 వరకు: భోజనం

బాధితులను మార్చాలని..



మద్యం, మత్తు పదార్థాలకు బానిస అయినవారిని పూర్వ స్థితికి తీసుకువచ్చేందుకు మా సంస్థ ద్వారా స్వచ్ఛందంగా డీ అడిక్షన్ కేంద్రాన్ని 2011లో ప్రారంభించాం. ఇప్పటి వరకు దాదాపు 1,500 మందికి మత్తు పదార్థాల నుంచి విముక్తి కల్పించాం. ఈ కేంద్రం ద్వారా బాధితులను మత్తు నుంచి విముక్తి చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాం.
–జయశ్రీ, ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రకృతి పర్యావరణ సంస్థ, కరీంనగర్

రెండేళ్ల నుంచి..
రెండేళ్ల క్రితం మద్యం అలవాటు అయి రోజురోజుకు తాగడం ఎక్కువైంది. అది లేకుండా ఉండలేని పరిస్థితికి వచ్చా. ఏ పని చేయను. భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఇంటి బాధ్యత భార్య చూసుకుంటుంది. డాక్టర్ వద్దకు వెళ్తే ఆయన సూచన మేరకు 6 రోజుల క్రితం ఇక్కడ చేరిన. ఇప్పుడు మందు లేకుండా ఉండగలుగుతున్నా.
– నాగరాజు, రాంనగర్, కరీంనగర్

18 రోజులు అవుతోంది
నేను కార్పెంటర్ పని చేస్తా. భార్య ఉంది. పిల్లలు లేరు. తాగుడు ఎక్కువైంది. పని చేయడం బంద్ చేసిన. రోజూ తాగందే ఉండలేను. అందుకే నన్ను ఇక్కడ 18 రోజుల కింద చేర్పించారు. ఇప్పుడైతే తాగకుండా ఉండగలుగుతున్నా.
– శ్రీకాంత్, లక్ష్మీపూర్

క్లుప్తంగా

గుండెపోటుతో జీపీ కార్మికురాలు మృతి


సూరవ్వ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు లింగం సూరవ్వ(58) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించింది. సూరవ్వ తంగళ్లపల్లి గ్రామపంచాయతీలో 20 ఏళ్లుగా పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తుంది. ఆమెకు భర్త నర్సయ్య, కొడుకు ఉన్నారు. సూరవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. మూడు నెలలుగా వేతనం పెండింగ్‌లో ఉందని, సమయానికి వేతనాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, కార్యదర్శి లింగంపల్లి కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు రవీందర్, నాయకులు అన్నల్‌దాస్ గణేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన చిట్యాల బన్నీ (19) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై లక్ష్మణ్‌రావు వివరాల ప్రకారం.. గత నెల 23న బన్నీ హన్మంతునిపేట శివారులో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడదెబ్బతో రైతు..


రాజయ్య (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన రైతు గొల్లపల్లి రాజయ్య(55) గురువారం వడదెబ్బతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లిన రాజయ్య మధ్యాహ్నం ఇంటికి వచ్చి అస్వస్థకు గురై కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తరలించే లోపు మృతిచెందాడు.

యువకుడి ఆత్మహత్య


నరసింహాచారి (ఫైల్)

కోరుట్ల: పట్టణానికి చెందిన ఇందూరి నరసింహాచారి (25) యాసిడ్ తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం ఇందూరి వెంకటరమణ, విజయ దంపతుల కుమారుడు నరసింహా కంసాలి పనిచేస్తున్నాడు. కొంతకాలంగా సరైన పని దొరకడం లేదు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక రాంనగర్ ఏరియాలో యాసిడ్ తాగాడు. స్థానికులు అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..


రాయలింగయ్య మృతదేహం

వెల్గటూర్: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎండపల్లి మండలం అంబరిపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోతె రాయలింగయ్య (80) కొద్ది నెలలుగా కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తితో గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

మళ్లీ 'అమ్మహస్తం'

- రేషన్ దుకాణాల్లో పెరగనున్న సరుకులు
- సీఎం ప్రకటనతో కార్డుదారుల్లో హర్షం
- డీలర్లకు, హమాలీలకు ప్రయోజనం



కరీంనగర్ అర్బన్: రేషన్ దుకాణం మళ్లీ పూర్వశోభను సంతరించుకోనుందా.. నిత్యవసర సరుకుల భారం తప్పనుందా.. సీఎం ప్రకటనతో అదే నిజమనిపిస్తోంది. వీలైనంత త్వరగా రేషన్ దుకాణాల్లో సరుకుల సంఖ్య పెంచుతామని బుధవారం జరిగిన సమీక్షలో సీఎం ప్రకటించడంతో మళ్లీ అమ్మహస్తం తెరపైకొచ్చింది. పదేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమ్మహస్తం పథకం కింద 8రకాల సరుకులను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో కార్డుదారులకు ప్రయోజనం చేకూరనుండగా డీలర్లు, హమాలీలకు ఉపాధి దొరకనుంది.

కార్డుదారులపై తగ్గనున్న రూ.కోట్ల భారం

పదేళ్ల క్రితం ఎనిమిది రకాల సరుకులు ఇవ్వగా ఒక్కో సరుకుకు కోత పెడుతుండటంతో నిరుపేద కుటుంబాలపై నెలకు రూ.27కోట్ల భారం పడుతుండగా ఏటా రూ.328కోట్లను కార్డుదారులు అదనంగా ఖర్చు చేస్తున్నారు. గతంలో రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా మలుస్తామని చెప్పగా ప్రస్తుతం ప్రభుత్వం మారడం సరుకుల సంఖ్యను పెంచుతామని ప్రకటించడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ప్రభుత్వపరంగా నిత్యవసర సరుకులు ఇవ్వాలనే లక్ష్యంతో 1975–80 కాలంలో చౌక ధరల దుకాణాలను తెరపైకి తెచ్చారు. అప్పటి నుంచి పేదల నిత్యవసర వస్తువులను చేర్చుతూ పంపిణీ చేసేది. పండుగలు వచ్చినపుడు కోటా పెంచడం జరిగేది. సామాన్యులకు భారం కాకూడదనే భావనతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.185కే 8 రకాల సరుకులు పంపిణీ చేసింది. 2014 వరకు ఒడిదుడుకుల మధ్య ఇదే విధానం సాగగా ప్రస్తుతం పరిస్థితి డోలయమానంలో పడింది. గతంలో ప్రతీకార్డుదారుకు అరకిలో చొప్పున చక్కెర, కిలో కందిపప్పు, రెండు కిలోల గోధుమలు, గోధుమపిండి, పసుపు, ఉప్పు ఇచ్చేవారు.

ప్రస్తుతం రెండే సరుకులు

కార్డుదారులకు సరుకుల సంఖ్య ఏటేటా తగ్గడం ఆందోళనకు గురి చేస్తోంది. తొలుత పామాయిల్ తదుపరి కందిపప్పు అనంతరం గోధుమలు, ప్రస్తుతం చక్కెర సరుకులకు మంగళం పాడటంతో ఇక రేషన్ దుకాణాలు ఎందుకన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 2,080 రేషన్ దుకాణా లుండగా 10.93లక్షల కార్డుదారులున్నారు. ఇందులో ఆహారభద్రత కార్డులు, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులున్నాయి. ప్రతీనెలా 20,139 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతుండగా కేవలం అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుదారులకే చక్కర సరఫరా చేస్తున్నారు.

డీలర్లకు ఉపాధి దెబ్బ

వాస్తవానికి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న క్రమంలో రేషన్ దుకాణాల్లో అవసరమున్న సరుకులు అందుబాటులో ఉంచాల్సి ఉండగా తదనుగుణంగా చర్యలు కరవయ్యాయి. 1984లో నిర్ణయించిన కమీషనే నేటివరకు కొనసాగుతుండగా ప్రస్తుతం వస్తున్న సరుకులతో క్వింటాల్ బియ్యాన్ని ఇచ్చేది రూ.75, ఖాళీ సంచుల ద్వారా మరో రూ.1800 వస్తుండగా నెలకు ఒక్కో డీలర్‌కు సగటున వచ్చే ఆదాయం అరకొరే. అద్దె, ఇతరత్రా ఖర్చులు పెరుగుతుండగా మిగిలేది శూన్యం. సీఎం ప్రకటనతో మళ్లీ పాత రోజులు వస్తాయని, ఉపాధి మెండుగా ఉంటుందని డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో

రేషన్ దుకాణాలు:	2080
మొత్తం కార్డులు:	10,93,674
ఆహారభద్రత కార్డులు:	10,25,692
అంత్యోదయ కార్డులు:	67,317
అన్నపూర్ణ కార్డులు:	665
తగ్గిన సరుకులతో నెలకు భారం:	రూ.27కోట్లు

ప్రస్తుతం సరఫరా అవుతున్న సరుకులు

ప్రతీనెలా

బియ్యం సరఫరా:	20,139మెట్రిక్ టన్నులు
చక్కర:	67,982కిలోలు(అంత్యోదయకే)

జగిత్యాలలో హైటెక్ వ్యభిచారం

- శివారు ఇళ్లలో నిత్యకృత్యం
- వాట్సాప్ స్టేటస్‌ల్లో యువతుల ఫొటోలు
- ఐదు నెలల్లో ఐదుగురిపై కేసులు


వ్యభిచార నిర్వాహకుల అరెస్ట్ చూపుతున్న సీఐ నటేశ్ (ఫైల్)

- జగిత్యాల జిల్లాకేంద్రం నడిబొడ్డున ఇటీవల వ్యభిచారం చేస్తూ కోదాడకు చెందిన ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు.
- జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో మూడు నెలలుగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పెద్ద ఎత్తున వ్యభిచారం నిర్వహిస్తున్నారు.
- మల్యాల మండలం నూకపల్లి అర్బన్‌హౌసింగ్ కాలనీ సమీపంలో ఓ ఇంట్లో గత కొద్దిరోజులుగా జోరుగా వ్యభిచారం జరుగుతోంది. పలువురు పోలీసులకు సమాచారం అందించినా నిర్వాహకులు చాకచక్యంగా తప్పించుకుంటూ.. అక్కడే ఇళ్లను మార్చుతున్నారు.

జగిత్యాలక్రైం: జిల్లాలో కొద్దికాలంగా వ్యభిచారం జోరుగా సాగుతోంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి, మల్యాల, కొండగట్టు, బీర్‌పూర్ ప్రాంతాల్లో నిర్వాహకులు తమకు పరిచయం ఉన్న వ్యక్తులకు వివిధ ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను తీసుకొచ్చి వారి ఫొటోలు పంపిస్తూ రేటు కుదుర్చుకుని వ్యభిచారం చేయిస్తున్నారు. ఇలా జిల్లాలో 2023లో 10 కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఐదుగురిపై రెండు కేసులు నమోదు చేశారు.

యువతులతో ఎర

కొంతమంది ప్రముఖులకు అందమైన యువతులను వారు కోరిన చోటకు (ఫాంహౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు, ఇళ్లకు) పంపిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. కొందరు ప్రముఖులు యువతుల కోసం వాహనాలు సమకూర్చుతుండడం గమనార్హం. నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, వైజాగ్, వరంగల్, హైదరాబాద్, సంగారెడ్డి, కోదాడ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి యువతులను రప్పిస్తూ యువకులకు వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా పంపిస్తున్నారు. నచ్చిన యువతికి ఫోన్‌లోనే రేటు కుదుర్చుకుంటున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు పంపించాక వారు చెప్పిన అడ్రస్‌కు పంపిస్తున్నారు.

నిఘా పటిష్టం చేశాం



జిల్లాలో వ్యభిచారం అరికట్టేందుకు నిఘా పటిష్టం చేశాం. వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో నిఘా పెడుతున్నారు. దాడులు చేసి నిర్వాహకులను అరెస్ట్ చేస్తున్నారు. – సన్‌ప్రీత్‌సింగ్, జగిత్యాల ఎస్పీ

లైసెన్స్ లేకుండా మందులు అమ్మిన వ్యక్తికి జైలు

జగిత్యాల: లైసెన్స్ లేకుండా మందులు నిల్వ చేసి అమ్మిన కోరుట్లకు చెందిన పి.రాంమోహన్ అనే వ్యక్తికి ఏడాది జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఏప్రిల్ 2015లో అనుమతి లేకుండా మందులు నిల్వ చేసి అమ్ముతున్నారని సమాచారం మేరకు ఔషధ నియంత్రణ అధికారులు కోరుట్లలోని శ్రీరామ క్లినిక్‌పై దాడిచేసి పలురకాల అలోపతి మందులను జప్తుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున మాదవి వాదనలు విన్పించగా సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి డ్రగ్స్ కాస్మోటిక్ చట్టం నిబంధనలకు విరుద్ధంగా మందులు నిలువ చేసి అమ్మినట్లు నిరూపణ కావడంతో నిందితునికి ఏడాది జైలుశిక్షతో పాటు, రూ.50 వేల జరిమానా విధిస్తూ కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి తీర్పునిచ్చినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

గుండెపోటుతో హమాలీ మృతి


రాజయ్య (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): గుండెపోటుతో హమాలీ కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని ముత్తునూర్ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సంకెనపల్లి రాజయ్య (54) వ్యవసాయంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీగా పనిచేస్తుంటాడు. గురువారం ఉదయం కేంద్రంలో పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు హాస్పిటల్‌కు తరలించేందుకు 108కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చేసరికి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పటి వరకు అందరితో కలివిడిగా ఉన్న రాజయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

పిడుగుపాటుకు గేదె..


గేదె కళేబరం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో గురువారం పిడుగుపాటుకు వీరగోని రమేశ్‌కు చెందిన గేదె మృతి చెందింది. గేదె సూడిదని, దాని విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని రమేశ్ తెలిపాడు.

పర్లపల్లిలో ఆవుదూడలు..


మృతిచెందిన ఆవు దూడలు

తిమ్మాపూర్: మండలంలో గురువారం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షాలకు నుస్తులాపూర్, పర్లపల్లి గ్రామాల్లో పిడుగుపాటుతో ఆవు దూడలు మృతిచెందాయి. పర్లపల్లికి చెందిన ఏనుగుల మల్లయ్య వ్యవసాయ భూమిలో కట్టేసిన ఆవు దూడలు పిడుగు పడడంతో మృతిచెందాయి. సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పిడుగుపాటుకు గురై ఆవు మృతిచెందిందని నుస్తులాపూర్‌కు చెందిన రాజిరెడ్డి తెలిపాడు. సుమారు రూ.80వేల నష్టం జరిగినట్లు తెలిపాడు. అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

జాతీయస్థాయి డాడ్జిబాల్ పోటీలు ప్రారంభం


పోటీలో తలపడుతున్న హరియాణా, మహారాష్ట్ర జట్లు

- హాజరైన 12 రాష్ట్రాల క్రీడాకారులు
- రెండు రోజుల పాటు నిర్వహణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): తెలంగాణ ప్రాంతంలో తొలిసారిగా పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్ కలాం స్టేడియంలో గురువారం జాతీయస్థాయి డాడ్జిబాల్ ఫెడరల్ కప్– 24 పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో గుజరాత్, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణా, మధ్యప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, బిహార్, ఉత్తర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 24 మహిళ, పురుషుల జట్లు పాల్గొన్నాయి. డాడ్జిబాల్‌లో 12 మంది క్రీడాకారులతో 20 నిమిషాల వ్యవధిలో నిర్వహించే ఈ క్రీడ ఆసక్తికరంగా కొనసాగుతుంది. రెండురోజుల పాటు నిర్వహించే పోటీల్లో అత్యంత ప్రతిభచూపిన రెండు జట్లను ఎంపిక చేసి ఆగస్టులో 11 నుంచి 17 వరకు ఆస్ట్రియా దేశంలో నిర్వహించే అంతర్జాతీయస్థాయి పోటీలకు పంపిస్తారు.

ధాన్యం కొనుగోలు చేయాలి


ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జోగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కోనరావుపేట/చందుర్తి(వేములవాడ): ధాన్యం కొనడం లేదని, తూకం వేసిన ధాన్యాన్ని తరలించడం లేదంటూ కోనరావుపేట మండల కేంద్రం, చందుర్తి మండలం జోగాపూర్‌లో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. రైతులు మాట్లాడుతూ కోనరావుపేటలోని కొనుగోలు కేంద్రంలో వారం రోజులుగా లారీలు రావడం లేదన్నారు. తూకం వేసిన బస్తాలు ఇప్పటికే 3వేలకు పైగా ఉన్నాయని తెలిపారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చందుర్తి మండలం జోగాపూర్‌లో నెల రోజులు లారీలు రాక ధాన్యాన్ని కాంటా పెట్టడం లేదన్నారు. ధర్నాలో రైతులు చల్ల వెంకట్‌రెడ్డి, గంగసాని రమణారెడ్డి, రత్నాకర్, యాస రాజం, మాందాల శ్రీనివాస్, సదానందం, జోగాపూర్‌లో మాజీ సర్పంచ్ మ్యాకల పర్శరాములుతోపాటు 30 మంది రైతులు పాల్గొన్నారు.


కోనరావుపేటలో ధర్నా చేస్తున్న రైతులు

స్కాన్ చేయండి.. కథలు చదవండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ (ఫైల్)

- అందుబాటులోకి క్యూఆర్ కోడ్
- గతంలో టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, వినే కార్యక్రమానికి శ్రీకారం
- విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు విద్యాశాఖ కసరత్తు
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచన

క్యూఆర్ కోడ్

జ్యోతినగర్: వేసవి కాలం చిన్నారులకు సెలవుల కాలం.. ఎండలు మండిపోతున్నాయి. పిల్లలు బయటకు వెళ్లకుండా చూసేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వేసవి సెలవులను సద్విని యోగం చేసుకునేలా ఫోన్ చేసి నవలలు, కథలు వినేలా రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్, విద్యాశాఖ సహకారంతో టోల్ ఫ్రీ నంబర్ 040–452–09722ను అందుబాటులోకి తెచ్చింది. కాల్ చేసి కథలు వినండి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి గతంలోనే శ్రీకారం చుట్టింది. తాజాగా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా నవలలు, కథలను చిత్రాలను చూస్తూ చదివించేందుకు చర్యలు చేపట్టింది. దీనివల్ల పిల్లలు చదవడం, రాయడం, మాతృభాషలో స్పష్టంగా మాట్లాడే అవకాశం ఉంటుందని భావిస్తోంది.

పిల్లలు బయట ఆడుకోకుండా..

ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రతిఒక్కరూ వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. పిల్లలు బయట ఆడుకోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దో హదపడనుంది. చాలామంది సెల్‌ఫోన్‌లో ఆటలు, ఇతర బొమ్మలు చూస్తూ ఉండిపోతున్నారు. అలాగే, టీవీ దగ్గర నుంచి కదలకుండా ఉంటున్నారు. ఇదివరకు పిల్లలు క్రికెట్, కోతికొమ్మచ్చి, కబడ్డీ, సిర్రగోనెతోపాటు పలు ఆటలు ఆడేవారు. నేడు వాటిని మరిచిపోయి ఇంట్లో ఫోన్లతో ఆటలు ఆడుకుంటున్నారు. దీంతో విద్యాశాఖ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. లిటరసీ క్లౌడ్ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి, కథలు, నవలలు, సందేశాత్మక చిత్రాలను చూడొచ్చు, చదవొచ్చు. //httpliteracycloud.org/stories? language=telugu&short new%20arrivals లింక్ ద్వారానూ సమాచారం తెలుసుకోవచ్చు.

పఠనాసక్తి పెరుగుతుంది



రూమ్ రీడ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఫోన్ చేసి, కథలు, నవలలు వినేలా, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, వాటిని చదివే అవకాశాన్ని కల్పించాం. వీటివల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుంది. పిల్లలందరూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి. – పీఎం షేక్, స్కూల్ అకాడమిక్ ఆఫీసర్, పెద్దపల్లి

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఎస్‌జీటీ నాయకులు

- ఎస్‌జీటీ యూనియన్

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీ యూనియన్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం అన్నారు. గురువారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్‌లోని వేతన సవరణ కమిటీ చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమికస్థాయిలో బోధించే టీచర్లకు అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా గౌరవప్రదమైన వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రతిపాదిత ఎస్‌జీటీ ఉపాధ్యాయుల వేతన స్కేలు రూ.71500 నుంచి రూ.2.20,770గా ఉండాలని కోరారు. పెరిగిన నిత్యావసరాల ధరలను అనుసరించి నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన పీఆర్‌సీ 43శాతానికి తగ్గకుండా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 3 శాతంగా వార్షిక వేతన హెచ్చింపు ఇంక్రిమెంట్ ఇస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం మూడు శాతం ఇవ్వాలని కోరారు. మాస్టర్ స్కేలు విధానాన్ని 80 స్టేజీలు, 32 గ్రేడ్లతో ఉండాలని, 2023 జూలై నాటికి గల డీఏ 33.76 శాతం, 43 శాతం ఫిట్‌మెంట్‌తో కలిపి మొత్తం 73.67 శాతం మాస్టర్ స్కేలు ప్రతిపాదించాలన్నారు. తెలంగాణ ఉద్యోగులకు రిటైర్మెంట్ గ్రాట్యుటీ రూ.16 లక్షలుగా ఉండగా, రూ.28 లక్షలు ఇవ్వాలని కోరారు. స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్లు 5 నుంచి 8కి పెంచాలని, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) అలవెన్సును పునరుద్ధరిస్తూ ఒక్కో ఉపాధ్యాయుడికి టీఎల్‌ఎం అలవెన్సుగా రూ. 2 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు నామమాత్ర వడ్డీతో రూ.50 లక్షల వరకు గృహరుణాలు మంజూరు చేయాలన్నారు. ఏడాదికి 12రోజులు సంపాదిత సెలవులు ఇవ్వాలని ప్రతిపాదించాలని, కరోనా నేపథ్యంలో ప్రస్తుతం ఏర్పడుతున్న అనారోగ్య సమస్యల వలన అర్ధవేతన సెలవులు 20 రోజుల నుంచి 30రోజులకు పెంచాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు.

అంతర్జాతీయ ప్రదర్శనకు 'అల్ఫోర్స్' విద్యార్థిని


పూజశ్రీని అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్)/సుల్తానాబాద్: జపాన్‌లోని సకురలో ఈ నెల 25వ తేదీ వరకు ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఇన్‌స్పైర్ అవార్డ్స్‌లో 'వీల్ ఆక్సిల్ కెమెరా' నమూనా ప్రదర్శించేందుకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ విద్యార్థిని ఎం.పూజశ్రీ వెళ్తున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. జపాన్ వెళ్తున్న సందర్భంగా పూజశ్రీని గురువారం అభినందించిన ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులో పూజశ్రీ ప్రదర్శించిన వీల్ ఆక్సిల్ కెమెరా నమూనా న్యాయ నిర్ణేతలను ఆకట్టుకోవడంతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే ప్రశంసలు అందుకోవడం గౌరవంగా ఉందన్నారు. జపాన్‌లో నమూనాను ప్రదర్శించేందుకు వెళ్తున్న అల్ఫోర్స్ విద్యార్థి పూజశ్రీ తెలంగాణ నుంచి రెండో విద్యార్థిని కావడం విశేషమని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో సైతం సత్తాచాటి ఉత్తమ నమూనాగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పూజశ్రీని పెద్దపల్లి డీఈవో మాధవి, డీఎస్‌వో రవినందన్‌రావు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సమాన హక్కులు కల్పించాలి


వడ్డెపల్లి రాంచందర్‌తో నగేశ్

జ్యోతినగర్(రామగుండం): చాలా ఏళ్ల నుంచి ఐదో షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాల్లో ని వాసముంటున్న ఎస్సీలకు ఎస్టీలతో సమా న హక్కులు కల్పించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌కు సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేశ్ విన్నవించారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏజెన్సీ ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో జన్మించిన ఎస్సీలకు భూమిపై హక్కులు, రాజకీయ రిజర్వేషన్ లేక, జీవో 3తో ఉద్యోగ అవకాశాలు రాక ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం, జీవో 3 తీసుకువచ్చి ఏజెన్సీ దళితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5వ, 6వ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్న దళితుల జీవన పరిస్థితులపై అధ్యయనం చేసి ఎస్టీలతో ఎస్సీలకు సమాన హక్కులు కల్పించాలని కోరారు. నేతకాని ఎస్సీ కులస్తుల కుల ధ్రువీకరణ పత్రం రాష్ట్ర గెజిట్‌లో నేత్కాని, కేంద్ర జాబితాలో నేతానిగా స్పెల్లింగ్ మిస్టేక్ వస్తుందని, నేతకానిగా వచ్చేలా కృషి చేయాలని కోరగా, రాంచందర్ సానుకూలంగా స్పందించి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కమ్మగిరి శ్రీకాంత్ పలువురు ఉన్నారు.

కాంట్రాక్టర్ తప్పిదం.. స్కూల్‌కు శాపం

• వల్లంపహాడ్ పాఠశాల వద్ద డ్రైనేజీ కంపు • కల్వర్టు నిర్మించకపోవడంతో దుస్థితి



పాఠశాల వద్ద రోడ్డుకు ఇవతలి వైపునే నిలిచిపోయిన డ్రైనేజీ నీరు

కరీంనగర్ కార్పొరేషన్: కాంట్రాక్టర్ తప్పిదం.. అధికారుల నిర్లక్ష్యం వెరసి ఆ పాఠశాలకు శాపంగా మారింది. కల్వర్టు నిర్మించకుండా ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం చేపట్టడం, డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో ఎగువ భాగం నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు ముందుకు పోయే దారి లేక పాఠశాల ఆవరణలోకి చేరుతున్నాయి. ఇక వర్షాకాలం వచ్చిందంటే చాలు వరద నీరు నేరుగా పాఠశాలను ముంచెత్తుతున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ వల్లంపహాడ్ గ్రామంలోని పాఠశాల వద్ద సంవత్సరం కాలంగా నెలకొన్న దుస్థితి ఇది.

వల్లంపహాడ్‌లోని మెయిన్ రోడ్డు వెంట ఏడాదిన్నర క్రితం డ్రైనేజీ నిర్మించారు. రోడ్డు అడ్డుగా ఉండడంతో వల్లంపహాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వరకు డ్రైనేజీ నిర్మించి వదిలేశారు. తీగలగుట్టపల్లి నుంచి వల్లంపహాడ్, గోపాల్‌పూర్ మీదుగా రాజీవ్‌రహదారి వరకు ఈ రోడ్డు ఉంటుంది. కాగా ఈ ఆర్అండ్‌బీ రోడ్డును నిర్మించే సమయంలో పాఠశాల వద్ద కల్వర్టు నిర్మించకపోవడం సమస్యకు కారణమైంది. కల్వర్టు నిర్మించి డ్రైనేజీని అవతలి వైపునకు మళ్లించాల్సి ఉండగా, అలా చేయకపోవడంతో డ్రైనేజీ నీళ్లన్నీ రోడ్డు అడ్డుగా ఉండడంతో ఇవతలివైపునే నిలిచిపోతున్నాయి. అయితే అక్కడే పాఠశాల ఉండడంతో ఈ మురుగునీరంతా పాఠశాల ఆవరణలోకి చేరిపోతున్నాయి. సంవత్సర కాలంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యను పరిష్కరించాలంటూ అధికారులకు చెబుతున్నా ఫలితం కనిపించడం లేదు. వచ్చే నెలలో పాఠశాలలు తిరిగి ప్రారంభించనుండటం, వర్షాకాలం సీజన్ నేపథ్యంలో ఈ సమస్యను ఇప్పుడైనా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. డ్రైనేజీ నీటితో పాటు, వర్షాలకు వరదనీరు పాఠశాల భవనాన్ని ముంచెత్తుతున్నాయి. గత ఏడాది పాఠశాల చుట్టూ వరదనీళ్లు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా మెయిన్‌రోడ్డుపై కల్వర్ట్ నిర్మించి, డ్రైనేజీని కొనసాగిస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. కాగా పాఠశాల వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌రెడ్డి గురువారం నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు విన్నవించారు. అలాగే పాఠశాల భవనంపైకి రెండు పెద్ద చెట్లు ఉన్నాయని, అవి విరిగిపడే అవకాశం ఉన్నందున తొలగించాలని కోరారు.



గతేడాది వరదనీరు ముంచెత్తడంతో పాఠశాల పరిస్థితి

సీఎంను కలిసిన 'వెలిచాల'



సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరిగిన పోలింగ్ సరళిపై సీఎం ఆరా తీశారు. నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పార్టీ శ్రేణులు సమన్వయంతో గట్టిగా పోరాడారని వెలిచాలను రేవంత్‌రెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

శిశుగృహ నుంచి చిన్నారి దత్తత



దత్తత పత్రం అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: కరీంనగర్ శిశుగృహలో పెరుగుతున్న ఏడాదిన్నర పాపను హైదరాబాద్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు అధికారులు దత్తత ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ఈ దత్తత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సీడబ్ల్యూసీ చెర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, పీఓ తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేశ్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: వేసవిలో నగరవాసుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో గురువారం శ్రీషిర్డీసాయి భక్త జనమండలి ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లి మాతా మాణిక్యేశ్వరీ ఆలయం వద్ద ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దాదాపు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్త జనమండలి గౌరవ అధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నుంచి వేసవికాలంలో ప్రతీ గురువారం కరీంనగర్‌లోని ఏదో ఒక ప్రాంతంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు నలుమాచు రాణి, వేణు మహేశ్వరరావు, వనజ, ప్రశాంత్, చంద్రమోహన్, తిరుపతి, కైలాస నవీన్, రాంచందర్, రాణి, సముద్రాల చంద్రమౌళి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ పథకంలో వ్యవసాయానికి ఉపయోగపడే పనులు చేపట్టాలని కోరుతూ కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గోష్కి శంకర్ గురువారం ఎంపీడీవో సంజీవరావును కలిసి వినతిపత్రం అందించారు. నల్లచెరువులో చేపట్టిన కందకాల తవ్వకంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. చెరువు కట్ట వెనుకభాగం నుంచి ఉన్న కాలువను తవ్వితే రైతులందరికీ ఉపయోగపడుతుందని వివరించారు. వ్యవసాయానికి ఉపయోగపడే పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరగా ఎంపీడీవో సానుకూలంగా స్పందించారు.

పోస్టాఫీసుకు ఏసీ అందజేత



ఏసీ అందజేస్తున్న సురేశ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి గురువారం రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ చిదుర భద్రయ్య జ్ఞాపకార్థం తన కుమారుడు చిదుర సురేశ్ ఏసీని పోస్టుమాస్టర్ పవన్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ పోస్టుమాస్టర్ శ్రీధర్, సత్యం, రాజు, ఏజెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రావికంటి కృష్ణ కిశోర్, ముప్ప శ్రీనివాసరావు గుప్తా, తడగొప్పుల రవీందర్, జంజీరాల రామకృష్ణ, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో గురువారం సాయంత్రం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గొల్లవాడ నుంచి యాదవ కులస్తులు బోనాలతో సిర్సపల్లి క్రాస్ రోడ్‌లోని పోచమ్మ దేవాలయానికి వెళ్లి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బద్దుల రాజ్‌కుమార్, కౌన్సిలర్ మక్కపల్లి కుమారస్వామి, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరేణి సమ్మయ్యల, సంఘం నాయకులు తొర్రి చిన్న సమ్మయ్య, భాషబోయిన సదానందం, భాషబోయిన ఓదెలు, గంద్రకోట రమేశ్, గంద్రకోట సారయ్య, మక్కపెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ

చొప్పదండి: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన గురుపూజ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చొప్పదండి పట్టణంలోని హరిహర క్షేత్రం నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మంగారి గుడి ఆవరణలో వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకొని, ఉదయం అభిషేకం, అనంతరం హోమం, మధ్యాహ్నం అన్నదానం చేపడుతామన్నారు. రాత్రి భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రాల్లో ధాన్యం.. అన్నదాతల దైన్యం

- వెంటాడుతున్న అకాల వర్షం
- కాంటా వేయడంలో జాప్యంతో ఆందోళన
- చివరిదశకు చేరిన ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు 1.90 లక్షల క్వింటాళ్ల సేకరణ



జూబ్లీనగర్‌లో ధాన్యం కాంటా పెడుతున్న నిర్వాహకులు

కరీంనగర్‌రూరల్: యాసంగిలో వరిపంట సాగు చేసిన రైతులను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. కరీంనగర్ మండలంలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం వరికోతలు దాదాపు పూర్తి కావొస్తుండగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చివరిదశకు చేరుకుంటున్న క్రమంలో కురుస్తున్న వర్షాలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులకు కాంటాలో జాప్యం శాపంగా మారింది. కేంద్రాల్లో నిర్వాహకులు నిబంధనల మేరకు 17శాతం తేమ ఉంటేనే కాంటా పెడుతున్నారు. వేసవి ఎండల తీవ్రతకు హమాలీలు ఉదయం వేళల్లో మాత్రమే కాంటా పెడుతుండటంతో కొనుగోళ్లలో జాప్యమేర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పొద్దంతా సూర్యుడు భగభగ, సాయంత్రానికి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమవుతోంది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోగానే రైతులు కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పగా చేసి వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పడం, మరుసటి రోజు మళ్లీ ఆరబెట్టే పనిలో నిమగ్నమవుతున్నారు.

1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

కరీంనగర్ మండలంలో యాసంగిలో 13వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ధాన్యం సేకరణకు కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో 11, దుర్శేడ్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో 6, ఐకేపీ ఆధ్వర్యంలో 3 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతనెల 1నుంచి కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ఇప్పటివరకు 1.90లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో 1,01,079 క్వింటాళ్లు, దుర్శేడ్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో 46,528క్వింటాళ్లు, ఐకేపీ ఆధ్వర్యంలో 24,510 క్వింటాళ్లు సేకరించారు. దుర్శేడ్ విండో పరిధిలోని దుర్శేడ్ మినహా మిగితా 5 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలోని ఎలబోతారం, బహదూర్‌ఖాన్‌పేట కేంద్రాలను మూసివేశారు.



నగునూరులో వర్షానికి ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

ఇప్పటివరకు 1.90లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించాం. కరీంనగర్ సింగిల్‌విండో పరిధిలోని నాగులమల్యాల కేంద్రాన్ని గురువారం మూసివేశాం. అకాల వర్షాలతో కొనుగోళ్లలో జాప్యమేర్పడుతోంది. మరో వారం రోజుల్లో మిగితా 10 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయి. – రమేశ్, సీఈవో

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కరీంనగర్: నగరంలో అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జ్యోతిరావుపూలే గ్రౌండ్ వెనుక అనుమతి లేకుండా అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు అనుమతులు రాకముందే ప్రచారం, అడ్మిషన్లు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని, అనుమతి లేని పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఛాంబర్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామరాపు వెంకటేష్, మచ్చ రమేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, నాయకులు సందీప్‌రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

యునెస్కో విద్యా సదస్సుకు ఆహ్వానం



మల్లారెడ్డి

కరీంనగర్‌సిటీ: యువత కోసం సమర్థవంతమైన వ్యవస్థాపకత విద్యా వ్యూహాల రూపకల్పన గురించి ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో అక్టోబర్ 10, 11వ తేదీల్లో జరుగనున్న విద్యా సదస్సుకు యునెస్కో ఆహ్వానం పంపినట్లు ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. సదస్సులో వ్యవస్థాపకత విద్య 21వ శతాబ్దపు అనిశ్చితులను నావిగేట్ చేయడానికి, యువతకు ఎదురయ్యే సమస్యల నుంచి తిరిగి పుంజుకోవడానికి అవసరమైన వినూత్న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ ప్రోగ్రామ్‌లను ప్రదర్శించడంతో పాటు, అనుకూలత, స్థితిస్థాపకతలు, భవిష్యత్ కార్యకలాపాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కాగా యునెస్కో సదస్సుకు మల్లారెడ్డి ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, జిల్లా బాధ్యుడు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ ప్రమోద్‌కుమార్, టి.రాజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న లారీ

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శివారులో గురువారం ఓ లారీ టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టిందని గ్రామస్తులు తెలిపారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లోని 11కేవీ రాంనగర్ ఫీడర్ వార్షిక మరమ్మతులో భాగంగా దెబ్బతిన్న ఇన్సూలేటర్ల మార్పు, క్రాస్ ఆర్మ్స్ వంటి నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, ఆదిత్య అపార్ట్‌మెంట్, చేపల మార్కెట్, సంతోష్‌నగర్, సత్యనారాయణ స్వామి ఆలయం, సిద్ధార్థ స్కూల్, పారమిత హై స్కూల్, వాసర ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం సందర్శన



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న ఎస్ఈ గంగాధర్

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ, షూటర్స్ బాస్కెట్ బాల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సందర్శించారు. శిక్షణ తీరుపై చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి శిబిరాల్లో శిక్షణపొంది భవిష్యత్‌లో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు ఏడీఈ రాజు క్రీడాదుస్తులు అందించగా ఎస్ఈ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ(టెక్నికల్) విజేందర్‌రెడ్డి, తిరుపతి, సుధీర్‌కుమార్, అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు సునీల్‌కుమార్, శ్రీధర్‌రావు, సత్యానంద్, జీవన్, వెంకటేష్, వెంకటరమణ, జాయ్, కృషి, తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ'లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ కోరారు. గత మార్చిలో పదోతరగతి ఉత్తీర్ణులైనవారు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులకు ఎలాంటి రుసుము లేకుండా ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు ఉచిత వసతిగృహ సౌకర్యం ఉంటుందన్నారు.

బోర్డులోని పేర్లను సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్..

కరీంనగర్ మండలంలోని గ్రామపంచాయతీల్లో గ్రామస్తుల సౌకర్యార్థం మండల, గ్రామ స్థాయి అధికారుల పేర్లు, సెల్‌నంబర్లతో ఏర్పాటు చేసిన బోర్డును పంచాయతీ అధికారులు సరిచేశారు. ఈనెల 8న 'సాక్షి'లో 'బోర్డులపై పాత అధికారుల పేర్లేనా'? శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దుర్శేడ్ పంచాయతీ బోర్డులో కొత్తగా ఎంపీడీవో, తహసీల్దార్, ట్రాన్స్‌కో ఏఈ, పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, ప్రత్యేక అధికారి పేర్లతోపాటు సెల్‌ఫోన్ నంబర్లను రాశారు.

– కరీంనగర్‌రూరల్



పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మౌలిక వసతులు కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నగరపాలకసంస్థ పరిధిలో 70 ప్రభుత్వ, ఎంపీపీ, జెడ్పీ తదితర పాఠశాలలున్నాయని తెలిపారు. ఈ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం సమాఖ్య అధ్యక్షులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీల ద్వారా ఆయా పాఠశాలల్లో విద్యుత్, రంగులు వేయడం, సులభ్‌కాంప్లెక్స్‌ల నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నందున పదిహేను రోజుల్లోగా ఈ పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 25 శాతం నిధులు సంబంధిత సమాఖ్య అధ్యక్షులు, హెచ్ఎంల జాయింట్ ఖాతాలో పడ్డాయన్నారు. త్వరితగతంగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జనార్దన్‌రావు, స్పెషల్ ఆఫీసర్, డీడబ్ల్యూఓ సరస్వతి, ఎంఈఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రెండో వేతన సవరణ సంఘం చైర్మన్‌కు ప్రతిపాదనలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర రెండో వేతన సవరణ సంఘ చైర్మన్ ఎన్.శివశంకర్‌కు గురువారం జిల్లాకు చెందిన తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పలు ప్రతిపాదనలు సమర్పించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యా విభాగం నిర్లక్ష్యానికి గురిచేయడం వల్ల మానవ వనరులు మన లక్ష్యానికి, ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని, ప్రాథమిక విద్య విద్యారంగానికి పునాదిలాంటిదని.. కానీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేకుండా 5 తరగతులు, 18 విషయాలు బోధించడం, విద్యా ప్రమాణాలు పెంచడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోలంపెల్లి ఆదర్శన్ రెడ్డి, గంప చంద్రశేఖర్, చిట్యాల ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఎస్సారార్ అటానమస్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కరీంనగర్‌సిటీ: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్' సైన్స్ కళాశాల (అటానమస్) డిగ్రీ రెండో, నాల్గో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉన్నందున పరీక్షలు కళాశాల ఎదురుగా ఉన్న వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్‌లో జరుగుతాయని, విద్యార్థులు గమనించాలని అన్నారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ లింక్ పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో చదువుకొని పరీక్షలు రాయాలని కోరారు.

బీసీనే ఉపకులపతిగా నియమించాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే ఉపకులపతిగా నియమించాలని బీసీ కులాల ఐక్య వేదిక, శాతవాహన యూనివర్సిటీ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ ఫోరం సమన్వయకర్త పెంచాల శ్రీనివాస్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలు నిర్లక్ష్యానికి గురి అయ్యాయన్నారు. యూనివర్సిటీలకు వెంటనే ఉపకులపతులను నియమించాలని, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి బీసీ వ్యక్తిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు శ్రీధర్‌రాజు, కనుకయ్య, రాజేశ్, రాకేశ్ ప్రశాంత్. సాగర్, శ్యాంకుమార్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఆందోళన

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు పడరానీపాట్లు పడ్డారు. కుటుంబసభ్యులతో కలిసి ధాన్యాన్ని కుప్పగా చేసి వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పారు. నగునూరు కేంద్రంలో తూకం వేసిన బస్తాలను లారీలో లోడింగ్ చేసేందుకు హమాలీలు సిద్ధపడగా వర్షం పడటంతో పనులను నిలిపివేశారు. తీగలగుట్టపల్లి, చామనపల్లి, దుర్శేడ్, బొమ్మకల్ కేంద్రాల్లోని ధాన్యం కుప్పలపై వర్షానికి తడవకుండా ఉండేందుకు రక్షణగా టార్పాలిన్లు, కవర్లు కప్పారు. బొమ్మకల్‌లో ఉరుములకు విద్యుత్‌వైర్లు అంటుకుని మంటలేర్పడ్డాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపేశారు.

భవన నిర్మాణ కార్మికుల ఐక్య సంఘాల కార్యవర్గం



నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో గురువారం భవన నిర్మాణ కార్మికుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో 14 సంఘాల ముఖ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఐక్య సంఘాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అస్తపురం నారాయణ, ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా మీస రాజయ్య, ఉపాధ్యక్షులుగా చాడ ఆనంద్, కన్నం మల్లేశం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తిరుపతిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎండీ సలీం, ఏనుగుల తిరుపతి, ముఖ్యసలహాదారులుగా తొంటి రాజయ్య, ఫారుక్ అలీ, గోగులకొండ శ్రీనివాస్, బడి మురళి, కార్యదర్శులుగా అంబాల ప్రభాకర్, మ్యాక శ్రీనివాస్, దావు ముత్యం, కార్యవర్గ సభ్యులుగా గొల్లపల్లి రాజు, మంద నాగరాజు, మధిర గట్టయ్య, శివరాత్రి బిక్షం, గోగుల రాములు, కాసర్ల మల్లేశం, వీరబ్రహ్మచారి, ఎండీ అజారుద్దీన్, కాంపెల్లి బాబు, కన్నం నర్సయ్యలు ఎన్నికయ్యారు.



దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించే మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 48 స్థానాలకు గాను నాలుగు విడతల్లో 35 సీట్లకు ఎన్నిక ముగిసింది. మిగతా 13 నియోజకవర్గాలకు ఐదో విడతలో భాగంగా ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. రెండుగా చీలిన శివసేన, ఎన్సీపీల్లో అసలు పార్టీగా ప్రజలు దేన్ని గుర్తిస్తున్నదీ ఈ ఎన్నికలతో తేలనుంది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ పాటిల్, సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ తదితరులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో తుది దశలో పోలింగ్ జరగనున్న కీలక స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

చివరి పంచ్ ఎవరిదో!

మహారాష్ట్రలో తుది అంకానికి పోరు

13 లోక్‌సభ స్థానాలకు 20న ఎన్నిక • బరిలో కేంద్ర మంత్రులు, సీఎం కుమారుడు

నాసిక్


• హేమంత్ గాడ్సే

ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం, ఎగుమతి సుంకాల పెంపు తదితరాలపై ఇక్కడి రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇది అభ్యర్థులందరికీ పరీక్షగా మారింది. అధికార మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) అభ్యర్థి హేమంత్ గాడ్సే బరిలో ఉన్నారు. విపక్ష ఎంవీఏ కూటమి నుంచి శివసేన (ఉద్ధవ్) అభ్యర్థి రాజాభావు వాజే పోటీలో ఉన్నారు. దేశవ్యాప్తంగా 111 ఆశ్రమాలు, ఏడు గురుకులాలతో ప్రజల్లో బాగా పేరున్న శాంతిగిరి మహారాజ్ ఇండిపెండెంట్‌గా వీరిద్దరికీ పెను సవాలు విసురుతున్నారు. ఉల్లి రైతులను ప్రసన్నం చేసుకునేందుకు గాడ్సే, వాజే శ్రమిస్తున్నారు. సీఎం షిండే ముమ్మరంగా ప్రచారం చేశారు. వంచిత్ బహుజన్ అగాడీ నుంచి కరణ్ గైకర్ కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది.


• రాజాభావు వాజే

పాల్గఢ్


• భారతి కామ్డి

ఈ ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి మహాయుతి కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి హేమంత్ విష్ణు సవర బరిలో ఉన్నారు. శివసేన (ఉద్ధవ్) నుంచి భారతి భరత్ కామ్డి పోటీ చేస్తున్నారు. బీఎస్పీ, వంచిత్ బహుజన్ అగాడీ, స్థానికంగా బలమున్న బహుజన్ వికాస్ అగాడీ కూడా పోటీలో ఉన్నాయి. దాంతో బహుముఖ పోటీ నెలకొంది. నిరుద్యోగం, వైద్య సౌకర్యాల లేమి ఇక్కడి ప్రధాన సమస్యలు. ఈ ప్రాంతానికి చెందిన ఓ మత్స్యకారుడు ఇటీవలే పాక్ జైల్లో మరణించడం, ఇక్కడ ఇద్దరు సాధువులను కొట్టి చంపడం ఎన్నికల అంశాలుగా మారాయి. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, బీజేపీ అగ్ర నేతలు సాధువుల హత్యను పదేపదే ప్రస్తావించారు. రూ.76,000 కోట్లతో ప్రతిపాదించిన వాధ్వాన్ పోర్టుపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శివసేన (షిండే)కు చెందిన సిట్టింగ్ ఎంపీ రాజేంద్ర దేద్య గవిట్ బీజేపీలో చేరడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.


• హేమంత్ విష్ణు

భివండి


• కపిల్ పాటిల్

బీజేపీ సిట్టింగ్ ఎంపీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ పాటిల్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2014 ఎన్నికల్లోనూ ఇక్కడ ఆయనే గెలిచారు. ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఎన్సీపీ (ఎస్పీ) నుంచి సురేశ్ మాత్రే (బాల్యా మామ), స్వతంత్ర అభ్యర్థి నీలేశ్ సంబారే పాటిల్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. నియోజకవర్గంలోని 21 లక్షల ఓటర్లలో 5 లక్షల మంది ముస్లింలే. 4.5 లక్షలు కుంబి, 3 లక్షలు అగ్ర వర్గీయులున్నారు. పాటిల్, మాత్రే ఇద్దరూ అగ్ర కులస్తులు. సంబారే కుంబి వర్గానికి చెందినవారు. మాత్రే గెలుపు కోసం శరద్ పవార్ తన పలుకుబడినంతా ఉపయోగిస్తున్నారు. తమకు బాగా పట్టున్న ఈ స్థానాన్ని ఎన్సీపీకి ఇవ్వడంపై కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తితో ఉన్నాయి. ఇది మాత్రే విజయావకాశాలపై ప్రభావం చూపేలా ఉంది.


• సురేశ్ మాత్రే

ముంబై నార్త్


• పీయూష్ గోయల్

ఇక్కడ కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను బీజేపీ బరిలోకి దింపింది. రాజ్యసభ ఎంపీగా ఉన్న ఆయన ఎంపికకు ముందు గట్టి కసరత్తే చేసింది. గోయల్ కోసం తొలుత దక్షిణ ముంబై స్థానాన్ని పరిశీలించినా చివరికి ముంబై నార్త్ వైపే మొగ్గుచూపించింది. ఇది ఒకప్పుడు కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న స్థానం. 1989లో బీజేపీ నుంచి రాం నాయక్ విజయం సాధించాక పరిస్థితులు మారాయి. 2008లో లోక్‌సభ స్థానాల పునర్విభజన తర్వాత ఇక్కడ మరాఠీయేతర మధ్య తరగతి ఓటర్లు పెరిగారు. దాంతో బీజేపీ మరింత బలపడింది. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ నిరుపమ్‌పై బీజేపీ నేత గోపాల్ చిన్నయ్య శెట్టి 4.47 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో నెగ్గారు. 2019 ఎన్నికల్లో ఆయన మెజారిటీని మరింతగా పెంచుకున్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, నటి ఊర్మిళా మతోండ్కర్‌ను ఓడించారు. ఈసారి కాంగ్రెస్ నుంచి భూషణ్ పాటిల్ పోటీ చేస్తున్నారు.


• భూషణ్ పాటిల్

ఐదో విడత పోలింగ్ జరిగే స్థానాలు

ధూలే, దిండోరి, నాసిక్, పాల్ఘర్, భివండి, కల్యాణ్, థానే, ముంబై నార్త్, ముంబై నార్త్-వెస్ట్, ముంబై నార్త్-ఈస్ట్, ముంబై నార్త్-సెంట్రల్, ముంబై సౌత్-సెంట్రల్, ముంబై సౌత్

థానే


• రాజన్ బాబూరావు

ఇక్కడ రెండు శివసేనల మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ఇతరులు పోటీలో ఉన్నా నామమాత్రమే. 2019 ఎన్నికల్లో శివసేన అభ్యర్థి రాజన్ బాబూరావు విచారే 4.12 లక్షల ఓట్ల మెజారిటీతో ఎన్సీపీ నేత ఆనంద్ పరాంజపేపై ఘన విజయం సాధించారు. ఈ విడత విచారే శివసేన (ఉద్ధవ్) అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఇక మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) అభ్యర్థిగా నరేశ్ గణపత్ మాస్కే బరిలో ఉన్నారు. విచారే ముందునుంచీ ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. మాస్కేకు మద్దతుగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సేన, బీజేపీ అగ్రనేతలు ప్రచారం నిర్వహించారు. కానీ ఆయన అభ్యర్థిత్వాన్ని బీజేపీ కార్యకర్తలు వ్యతిరేకిస్తుండడం ప్రతికూలంగా మారింది. విచారే, మాస్కే ఇద్దరూ థానే మేయర్లుగా పనిచేసిన వారే. కానీ నగర పరిసర ప్రాంతాలు సరైన అభివృద్ధికి నోచుకోలేదన్న అసంతృప్తి స్థానికుల్లో బాగా ఉంది.


• నరేశ్ గణపత్

కల్యాణ్

అధికార మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) అభ్యర్థిగా సీఎం కుమారుడు శ్రీకాంత్ షిండే బరిలో ఉండటంతో ఆసక్తి నెలకొంది. 2014, 2019 ఎన్నికల్లోనూ శివసేన టికెట్‌పై శ్రీకాంత్ ఎన్సీపీని ఓడించారు. విపక్ష అగాడీ కూటమి నుంచి శివసేన (ఉద్ధవ్) అభ్యర్థిగా వైశాలి దారేకర్ రాణే బరిలో నిలిచారు. దాంతో ఇంతకాలంగా శివసేనను ఆదరిస్తున్న ఓటర్లకు పరీక్ష ఎదురైంది. సంప్రదాయ ఓటర్లు ఈ రెండు పార్టీల మధ్య చీలితే ఎవరు గెలుస్తారన్న ఆసక్తి నెలకొంది. గత రెండుసార్లూ రెండో స్థానంలో నిలిచిన ఎన్సీపీ (ఎస్పీ) మద్దతు ఉద్ధవ్ వర్గం అభ్యర్థికి కలిసొచ్చే అంశం. ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధికి తన కుమారుడు ఎంతో చేశాడని, ఈసారీ గెలిపిస్తే మిగతా పనులన్నీ పూర్తి చేస్తాడని సీఎం షిండే భరోసా ఇస్తున్నారు.


• వైశాలి దారేకర్


• శ్రీకాంత్ షిండే

నల్లత్రాచు నుంచి 'అప్సరస' వరకు..

హిమాచల్ ఎన్నికల ప్రచారంలో సరికొత్త తిట్ల దండకం

సిమ్లా: ఎన్నికలన్నాక పరస్పర విమర్శలు సహజమే. కానీ హిమాచల్‌ప్రదేశ్ ప్రచారంలో అభ్యర్థులు విమర్శలు దాటి.. వ్యక్తిగత తిట్ల వరకూ వచ్చేశారు. ఈ దండకంలో కాంగ్రెస్ నుంచి బీజేపీ వరకూ అందరూ ఆ తాను ముక్కలే. ఒకరు 'కాలే నాగ్' అంటే.. మరొకరు 'బిగ్డా షెహజాదా' అంటూ ప్రచార పదజాలంలో కొత్త తిట్లను చేరుస్తున్నారు.

ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటేసిన విషయం తెలిసింది. వారిపై అనర్హత వేటు పడి ఆ ఆరుస్థానాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు.. పార్టీ తిరుగుబాటుదారులను 'కాలే నాగ్'(నల్లత్రాచు)లు, బికావు (అమ్ముడుపోయినవాళ్లు) అంటూ విమర్శించారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి దేవేందర్ కుమార్ భుట్టో నియోజకవర్గమైన కుట్లేహార్‌లో సీఎం మాట్లాడుతూ.. 'భుట్టో కో కూటో' (భుట్టోను కొట్టండి) అంటూ పిలుపునిచ్చారు. సుఖు వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయంటూ బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. ఇక 'మండీ మే భావ్ క్యా చల్ రహా హై' అంటూ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. నేను రెండాకులు ఎక్కువే చదివానంటూ రనౌత్ చెలరేగిపోయారు. రాహుల్‌గాంధీ, విక్రమాదిత్య పేర్లు చెప్పకుండా.. 'బడా పప్పు', 'ఛోటా పప్పు' అని పదేపదే వాడారు. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ.. ఈ దేశానికి బ్రిటిష్ వాళ్లు వదిలి వెళ్లిన 'రోగం' అంటూ వ్యాఖ్యానించారు. 2014 వరకు చెద పురుగుల్లా దేశాన్ని తినేశారన్నారు. విక్రమాదిత్యను.. 'బిగ్డా షెహజాదా' (చెడిపోయిన యువరాజు) అంటూ సంబోధించారు. ఇక కంగనాను 'ఆమె హుస్న్ కి పరి' (అప్సరస) అని, ప్రజలు ఆమెను చూడటానికి మాత్రమే వస్తారు.. ఓట్లేయరని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రతిభా సింగ్ వ్యాఖ్యానించారు. దీనిపై కంగనా తల్లి ఆశా రనౌత్ స్పందించారు. తన కూతురును 'అప్సరస', 'క్యా చీజ్ హై' అంటున్నవాళ్లు తమ ఇళ్లలో ఆడపిల్లలున్నారన్న విషయం మరుస్తున్నారని మండిపడ్డారు.

అసలే ఇది ఎన్నికల సీజన్. ప్రచారం దుమ్మురేగుతోంది. మైకు దొరికితే చాలు.. నేతల హామీలకు, విమర్శల ధాటికి అడ్డూఅదుపూ ఉండటం లేదు. ఆ క్రమంలో కొన్నిసార్లు తాము ఏ పార్టీలో ఉన్నాం, ఎవరి తరఫున ప్రచారం చేస్తున్నామన్న స్పృహ లేకుండా నేతలు నోరు జారుతున్నారు. సొంత పార్టీ అభ్యర్థినే చిత్తుచిత్తుగా ఓడించండనీ, ప్రత్యర్థి పార్టీకి ఓటేయాలనీ పిలుపిస్తున్నారు! జరగాల్సిన నష్టం జరిగాక తీరిగ్గా నాలుక్కరుచుకుంటున్నారు. ఇలా టంగ్ స్లిప్పవుతున్న వారిలో కొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టినవారే గాక కాకలు తీరిన నేతలు కూడా ఉండటం విశేషం. కుడిఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నారు గానీ, రాజకీయాల్లో మాత్రం నోరుజారితే నవ్వులపాలే...!!

- సాక్షి, నేషనల్ డెస్క్

నోరుజారె... పరువు పోయె..!

ప్రచారంలో నవ్వుల పాలవుతున్న నేతలు

శివపాల్.. శివ శివా!
బీజేపీని గెలిపించాలన్న సమాజ్‌వాదీ నేత

అది ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి ఒకప్పుడు గట్టి పట్టున్న ఇటావా లోక్‌సభ స్థానం. జస్వంత్ నగర్‌లో ఎన్నికల ప్రచార సభ. జనం భారీగా హాజరయ్యారు. పార్టీ చీఫ్ అఖిలేశ్ బాబాయి, సమాజ్‌వాదీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్ మాట్లాడుతున్నారు. వేదికపై ఉన్న అఖిలేశ్, ఇటావా ఎస్పీ అభ్యర్థి జితేంద్ర దోహరే తదితరులు ఆసక్తిగా వింటున్నారు. ఇంతలో శివపాల్ ఉన్నట్టుండి, 'అందుకే నేను కోరేదొక్కటే! బీజేపీని అఖండ మెజారిటీతో గెలిపించండి!!' అంటూ పిలుపునిచ్చారు. అంతటితో ఆగలేదు. 'ప్రజలంతా అఖిలేశ్ చెప్పినట్లు విని, భారతీయ జనతాపార్టీకి భారీ మెజారిటీతో విజయాన్ని అందించండి' అన్నారు. దాంతో అఖిలేశ్ బిత్తరపోగా ఇతర ఎస్పీ నేతలంతా గతుక్కుమన్నారు. నోరు జారానని గమనించిన శివపాల్ కాసేపు బీజేపీపై విరుచుకుపడ్డా జనమంతా గోలగోలగా నవ్వుకున్నారు!




అందిపుచ్చుకున్న మోదీ...

ఈ ఉదంతాన్ని తర్వాత ఇటావాలోనే జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ ప్రచారాస్త్రంగా మలచుకున్నారు. 'చూశారా! స్వయంగా ములాయం సింగ్ యాదవ్ సోదరుడు, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ బాబాయ్ కూడా బీజేపీని గెలిపించాలని కోరుతున్నారు' అంటూ చెలరేగిపోయారు. 2019లో ములాయం కూడా బీజేపీని ఆశీర్వదించారని గుర్తు చేశారు. ''2019 ఎన్నికలకు ముందు పార్లమెంట్ చివరి సెషన్లో ములాయం మాట్లాడుతూ, మీరు మళ్లీ విజయం సాధించబోతున్నారని నన్నుద్దేశించి నిండు సభలో అన్నారు. ఆ ఆశీర్వాదం ఫలించింది. ఇప్పుడు ములాయం మన మధ్య లేకున్నా ఆయన సోదరుడు బీజేపీని గెలిపించాలని కోరుతున్నారు. ఇది యాదృచ్ఛికమని నేననుకోవడం లేదు. శివపాల్ మనసులో ఉన్నదే బయటికొచ్చింది'' అంటూ చెణుకులు విసిరారు!

లోగుట్టు 'బోరా'కే ఎరుక...
స్వపక్ష ఎంపీనే ఓడించాలన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే!

అసోంలోని నగావ్ లోక్‌సభ స్థానంలో ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే శిబమణి బోరా కూడా ఇలాగే నోరు జారారు. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ ప్రద్యుత్ బోర్దోలోయ్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారామె. జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నట్టుండి, 'ప్రద్యుత్‌ను భారీ మెజారిటీతో ఓడించాలని మీ అందరినీ అభ్యర్థిస్తున్నా. ఓడిస్తారో లేదో చెప్పండి. ఈవీఎం బటన్‌ను నొక్కి నొక్కి ప్రద్యుత్ కచ్చితంగా ఓడేలా చూడండి'' అంటూ పిలుపునివ్వడంతో అంతా ముక్కున వేలేసుకున్నారు. పొరపాటున అన్నారా, కావాలనే అన్నారా అంటూ దీనిపై తీవ్ర చర్చ కూడా జరిగింది.



అధిర్.. అయ్యో రామా!
బీజేపీకి ఓటేయడం మేలన్న కాంగ్రెస్ దిగ్గజం

వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ దిగ్గజం అధిర్ రంజన్ చౌదరి ఇటీవల ఎన్నికల ర్యాలీలో మళ్లీ నోరుజారారు. 'బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు ఓటేసే కంటే బీజేపీకి వేయడం నయం' అన్నారు! జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థి అయిన పార్టీకి ఓటేయాలని పిలుపివ్వడం పట్ల సొంత నేతలే తీవ్రంగా మండిపడ్డారు. దాంతో తానలా అన్లేదంటూ అధిర్ మాట మార్చారు. కానీ అధికార తృణమూల్ దీన్ని మంచి అస్త్రంగా అందిపుచ్చుకుంది. బెంగాల్‌లో అధిర్ బీజేపీకి తొత్తుగా పనిచేస్తున్నారంటూ చెలరేగిపోయింది.

లాలు కూతుర్ని ఓడించండి!
సొంత పార్టీ ఎమ్మెల్సీ పిలుపు

బిహార్ రాజకీయ దిగ్గజం లాలు ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య సరన్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆమెను గెలిపించుకునేందుకు అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా లాలు స్వయంగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా కూతురితో పాటు పాల్గొన్న తొలి సభలోనే హంసపాదు ఎదురైంది! సొంత పార్టీ ఆర్జేడీ ఎమ్మెల్సీ సునీల్ సింగ్ మాట్లాడుతూ ''ఓటర్లు, పార్టీ కార్యకర్తలందరినీ ఒకటే కోరుతున్నా. రోహిణీ ఆచార్యను భారీ మెజారిటీతో ఓడించండి' అంటూ పిలుపునిచ్చారు. దాంతో లాలుతో పాటు వేదికపై ఉన్న ఆర్జేడీ నేతలంతా అవాక్కయ్యారు. వెంటనే తేరుకున్న సునీల్ క్షమించాలంటూ వేడుకున్నారు.





కంగనా... కన్ఫ్యూజన్!
గురి తప్పిన 'నాన్ వెజ్' విసుర్లు

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ బీజేపీలో చేరి హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తుండటం తెలిసిందే. స్టార్ క్యాంపెయినర్ అయిన ఆమె బిహార్ ఎన్నికల ర్యాలీలో ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్‌కు బదులు పొరపాటున బెంగళూరు సౌత్ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యను విమర్శించి నవ్వులపాలయ్యారు. ''దారి తప్పిన యువరాజులున్న పార్టీలకు మన దేశంలో కొదవ లేదు. చంద్రుడిపై బంగాళదుంపలు పండించాలనుకునే రాహుల్ గాంధీ కావచ్చు. నవరాత్రుల సందర్భంగా కూడా చేపలు తినే తేజస్వి సూర్య కావచ్చు. అంతా అదే బాపతు' అంటూ కంగన విరుచుకుపడ్డారు. దాంతో భారీగా ట్రోలింగ్‌కు గురయ్యారు. తేజస్వీ యాదవ్ కూడా, 'ఇంతకీ ఎవరీ అమ్మగారు?!' అంటూ ఎద్దేవా చేశారు. దేశ తొలి ప్రధాని సుభాష్ చంద్ర బోస్ అన్న కంగనా వ్యాఖ్యల పైనా విపరీతంగా ట్రోలింగ్ జరిగింది.

కిశోరీ లాల్ శర్మ.. అమేథీలో కాంగ్రెస్ తురుపు ముక్క. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఊహించని ప్రత్యర్థి. రాజీవ్‌గాంధీ నుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్‌కు నమ్మిన బంటు ఈ 63 ఏళ్ల కేఎల్ శర్మ. ఇన్నాళ్లు తెరవెనుక చక్రం తిప్పిన శర్మ ఇప్పుడు నేరుగా బరిలోకి దిగి బీజేపీతో అమీతుమీ తేల్చుకోనున్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయన బలం. గాంధీలతో మైత్రి సహా.. పలు అంశాలపై ఆయన పంచుకున్న ముచ్చట్లివి..

- సాక్షి, నేషనల్ డెస్క్



ఆమె నాకు పోటీయే కాదు!

కిశోరీ లాల్ శర్మ

ఇన్నాళ్లు తెర వెనుక ఉన్నారు. ఇప్పుడు తెరమీదకు వచ్చారు. ఈ మార్పు ఎలా ఉంది?

ఎన్నికలకు సంబంధించి పెద్దగా మార్పు లేదు. నేనెప్పుడూ ఒంటరిగా ఏమీ చేయలేదు. 25–30 ఏళ్లుగా నాతో కలిసి పనిచేస్తున్నవారున్నారు. కాలం మారింది.. కొత్తగా చేయాలి. టీమ్ అదే.. పని తీరే మారింది.

ఐదేళ్ల కిందట రాహుల్ ఓడిపోయిన చోట నుంచి పోటీని ఎలా చూస్తున్నారు?

గతంలో పొరపాట్లు జరిగాయి. దాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకు? ఎలా? అన్న అంతర్మథనం జరిగింది. రెండు విషయాలు బలంగా పనిచేశాయి. బీజేపీ ప్రభుత్వం నుంచి ఎదురైన ఒత్తిడితోపాటు మా వైపు నుంచి కూడా లోపాలు జరిగాయి. ఆ ఎన్నికల్లో దిశా నిర్దేశం చేసే నాథుడు లేరని కార్యకర్తలు వాపోయారు. బీజేపీ గెలిచింది 55,000 ఓట్ల తేడాతోనే. అది పెద్ద నంబర్ కాదు.

ఓటమికి కారణమైన వారినే అభ్యర్థిగా నిలబెట్టారని బీజేపీ ఆరోపణ కదా!

2019 ఎన్నికల్లో నేను అమేథీలో లేను. రాయ్‌బరేలీలో పోలింగ్, ఎన్నికల నిర్వహణ చూస్తున్నాను. ఇప్పుడు నేను, నా ప్రత్యేక బృందం ఇక్కడ పనిచేస్తోంది. తేడా అదే!

'గాంధీ కుటుంబ చప్రాసీ' వ్యాఖ్యలను ఎలా ఎదుర్కొంటారు?

నేనెవరినో అమేథీ, రాయ్‌బరేలీ ప్రజలందరికీ తెలుసు. 1980లో యువజన కాంగ్రెస్ కార్యకర్తగా నా రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1983లో రాజీవ్ గాంధీ జీ 20 ప్రోగ్రామ్‌ను పర్యవేక్షించడానికి కొంతమంది యువ నాయకులను ఎంపిక చేశారు. వారిలో నేను ఒకడిని. ఒకటిన్నర బ్లాకులు చూసుకోవాల్సిన బాధ్యత నాకు అప్పచెప్పారు. 'అమేథీ మే దిల్ లగ్ గయా' (అమేథీ మీద మనసు పారేసుకున్నా). ఇక్కడే ఉండిపోయాను. కొందరు నన్ను సోనియాగాంధీకి పీఏ అంటారు. ఎవరేమనుకున్నా.. నేను ప్రజాప్రతినిధిని. పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిని. స్టార్ క్యాంపెయినర్‌ని. 2013లో ఏఐసీసీ కార్యదర్శిగా, సీపీ జోషితో కలిసి బిహార్‌కు కో–ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. బిహార్‌లో కూటమి ఏర్పాటు చేసినప్పుడు 27 స్థానాల్లో విజయం సాధించాం. ఏం తెలియకుండా మాట్లాడేవారికి నేనేం చెప్పగలను?

మీ కుటుంబం?

భార్య. ఇద్దరు కూతుళ్లు. ఒకరు ఎంబీఏ చేసి మార్కెటింగ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. రెండో కూతురు వ్యాపారవేత్త.

మీ పోటీతో పార్టీలో అంతర్గత విభేదాలు పెరిగాయని భావిస్తున్నారా?

పార్టీలో అంతర్గత పోరు ఉంది. కానీ నా విషయానికి వస్తే అది లెక్కలోకి రాదు. నేను వాళ్ల అన్నయ్య లాంటివాడిని. తిట్టగలను, ప్రేమగా మాట్లాడగలను. వాళ్లూ నాతో అలాగే ఉంటారు. పోటీకి గ్రూపులు మంచివే. కానీ పార్టీని దెబ్బతీసే గ్రూపులు ఉండొద్దని చెబుతుంటా.

ఎన్నికల్లో పోటీ చేయమని మిమ్మల్ని ఎవరు అడిగారు?

అమేథీలోని ఇతర కార్యకర్తలు కోరుకున్నట్లే నేను కూడా రాహుల్‌జీ పోటీ చేయాలని కోరుకున్నా. కానీ నామినేషన్లకు ముందు ప్రియాంక 'కిషోరీ జీ మా కుటుంబం కోసం మీరు ఎన్నో ఎన్నికల్లో పోరాడారు. ఈ ఎన్నికల్లో మేం మీకోసం పోరాడాలనుకుంటున్నాం' అని చెప్పారు. నేను అంగీకరించాను.

మీ ప్రచారానికి చాలా తక్కువ సమయం ఉంది!

స్మృతి ఇరానీ ఎంత ప్రచారమైనా చేసుకోనీ. ఆమె అసలు నాకు పోటీయే కాదు. కష్టపడి పని చేయడమే నాకు తెలుసు. ఇక నిర్ణయం ప్రజలది. స్మృతి ఇరానీ చేస్తున్న ఆరోపణల విషయానికొస్తే, ఆమెను కించపరిచేలా నేనెప్పుడూ మాట్లాడలేదు. నాపై నోరు పారేసుకోవడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా.



వంటిల్లు

ఆవురావురుగా... ఆవకాయ

ఎండాకాలం... మే నెల సగం అయిపోయింది.
మామిడి కాయలు టెంక కట్టి ఎదురు చూస్తున్నాయి.
జాడీలు స్నానాలు చేసి ఎండలో సేదదీరుతుంటాయి.
ఇంట్లో మిక్సీలు గిర్ర్‌ర్ అంటూ గోల చేస్తుంటాయి.
మామిడి కాయలు కొట్టే కత్తి పుల్లబారి పదునుదేలింది.
ముక్కలు కొట్టండి... పళ్లెంలో వేయండి... కారం కలపండి.
జాడీలకెత్తండి... పళ్లెంలో వేడి వేడి అన్నం వేసి కలపండి.
ఇంటిల్లిపాదీ ఆవురావురుమని తినకపోతే అడగండి.




ఆంధ్రా ఆవకాయ

కావలసినవి: పచ్చి మామిడి ముక్కలు – కేజీ; పచ్చి శనగలు – 50 గ్రాములు ; సన్న ఆవాలు – పావు కేజీ ; మెంతులు – రెండు టేబుల్ స్పూన్లు ; గుంటూరు మిరప్పొడి – పావు కేజీ ; ఉప్పు – నూట యాభై గ్రాములు ; పసుపు – టేబుల్ స్పూన్ ; నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనె – పావు కేజీ.

తయారీ: ● ఆవకాయ పెట్టడానికి ముందు రోజు మిరపకాయలు, ఆవాలు, మెంతులను విడిగా ఎండబెట్టాలి. మరునాడు ఉదయం ఆవాలను మిక్సీలో పొడి చేయాలి. మిరప్పొడి రెడీమేడ్‌ది కూడా తీసుకోవచ్చు. కానీ ఆవాలు స్వయంగా చేసుకోవాలి ● మామిడి కాయలను కడిగి తేమ పోయే వరకు తుడిచి ఆరబెట్టాలి. బాగా ఆరిన తర్వాత కాయలకున్న తొడిమ తొలగించాలి. అప్పటికీ సొన కారుతుంటే శుభ్రమైన నూలు వస్త్రంతో తుడిచేయాలి. ఇలా సిద్ధం చేసుకున్న మామిడి కాయలను టెంకతో సహా చిన్న ముక్కలు చేసుకోవాలి ● శనగలను శుభ్రమైన వస్త్రంతో తుడిచి పక్కన పెట్టాలి● వెడల్పుగా ఉన్న పెద్ద పాత్రలో మామిడి ముక్కలు వేయాలి. అందులో శనగలు, ఆవాల పొడి, మిరప్పొడి, ఉప్పు, పసుపు వేసి అట్లకాడతో బాగా కలపాలి. మెంతులు కూడా వేసి బాగా కలపాలి. చివరగా నూనె పోసి ముక్కలకు ఒత్తిడికి కలగకుండా అడుగు నుంచి కలిపితే ఆవకాయ రెడీ. దీనిని పింగాణి జాడీలో పెట్టి అంచులకు తెల్లని శుభ్రమైన నూలు వస్త్రాన్ని కట్టాలి. ఆ పైన మూత పెట్టాలి. ఈ జాడీలోని ఆవకాయను రోజూ మూత తీయకూడదు. రోజువారీ వాడుకకు అవసరమైనంత చిన్న జాడీలోకి తీసుకుంటూ ఉంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.



బెల్లం ఆవకాయ

కావలసినవి: మామిడి ముక్కలు – అర కేజీ; బెల్లం – అర కేజీ; మిరప్పొడి– 200 గ్రాములు ; ఉప్పు – 200 గ్రాములు ; ఆవ పిండి– 100 గ్రాములు ; నూనె – 200 గ్రాములు.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి తుడిచి టెంకతో సహా ముక్కలు చేసుకోవాలి ● బెల్లాన్ని తురిమి వెడల్పు పాత్రలో వేసి అందులో మామిడికాయ ముక్కలు, ఆవ పిండి, మిరప్పొడి, ఉప్పు, కప్పు నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు రోజుల పాటు ఎండలో పెట్టాలి. బెల్లం కరిగి పాకంలా జిగురుగా వచ్చినట్లనిపిస్తే సరే, లేకపోతే మూడవ రోజు కూడా ఎండలో పెట్టాలి. పాకం వచ్చిన తర్వాత మిగిలిన నూనె కూడా వేసి బాగా కలిపి జాడీలోకి తీసుకోవాలి. ఈ బెల్లం ఆవకాయను పిల్లలు బాగా ఇష్టపడతారు. ఐరన్ రిచ్ ఫుడ్ కాబట్టి మహిళలు రోజూ తీసుకోవచ్చు.



నువ్వుల ఆవకాయ

కావలసినవి: మామిడి కాయ ముక్కలు – 3 కప్పులు ; నువ్వులు – ఒకటిన్నర కప్పులు ; మిరప్పొడి– ముప్పావు కప్పు ; ఉప్పు– పావు కప్పు ; పసుపు – అర టీ స్పూన్ ; వేరు శనగ నూనె – ఒకటిన్నర కప్పులు.

తయారీ: ● నువ్వులను తయారీ దోరగా వేయించి చల్లారిన పొడి చేయాలి ● మామిడి ముక్కలను వెడల్పు పాత్రలో వేసి అందులో నువ్వుల పొడి, మిరప్పొడి, ఉప్పు, పసుపు వేసి అట్లకాడతో బాగా కలపాలి. ఉప్పు, కారం, నువ్వుపిండి సమంగా కలిసిన తర్వాత కప్పు నూనె పోసి మళ్లీ కలపాలి. ఈ మిశ్రమాన్ని జాడీలోకి తీసుకుని, మిగిలిన నూనెను పైన తేలేటట్లు పోయాలి. ఇందులో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



వెల్లుల్లి ఆవకాయ

కావలసినవి: మామిడి కాయ ముక్కలు – పావు కేజీ లేదా (మీడియం సైజు కాయలు 3) ; వెల్లుల్లి – 200 గ్రాములు ; ఉప్పు – 100 గ్రాములు ; మిరప్పొడి– 200 గ్రాములు ; ఆవాలు – 150 గ్రాములు (ఎండబెట్టి పొడి చేయాలి) ; పసుపు – టీ స్పూన్ ; మెంతులు – టేబుల్ స్పూన్ ; నువ్వుల నూనె లేదా వేరు శనగ నూనె – కిలో.

తయారీ: ● ఒక పాత్రలో నూనె పోసి మామిడి ముక్కలను వస్త్రంతో తుడిచి నూనెలో వేయాలి ● వెల్లుల్లి పాయలను పొట్టు వలిచి ఒక ప్లేట్‌లో వేసి గాలికి ఆరనివ్వాలి ● మరొక పాత్రలో మిరప్పొడి, ఆవపిండి, ఉప్పు, పసుపు, మెంతులు వేసి సమంగా కలిసేవరకు కలపాలి. ఇప్పుడు వెల్లుల్లి రేకలను వేసి కలపాలి ● మామిడి ముక్కల లోని నూనెను ఒక జాడీలోకి వంపాలి. ఇప్పుడు మామిడి ముక్కలలో ముందుగా కలిపి సిద్ధంగా ఉంచిన ఉప్పు, వెల్లుల్లి ఇతర పొడుల మిశ్రమాన్ని వేసి పొడులన్నీ మామిడి ముక్కలకు పట్టేలా కలపాలి. మామిడి ముక్కలను పట్టి ఉన్న నూనె ఈ పొడులను పీల్చుకుని కొంత తడి పొడిగా మారుతుంది. ఈ మిశ్రమాన్ని నూనె వంపుకున్న జాడీలో వేసి అదమాలి. నూనె పైకి తేలుతుంది. వెల్లుల్లి బ్లడ్ థిన్నర్. రక్తాన్ని పలచబరిచి రక్త నాళాల్లో పూడికలు ఏర్పడకుండా నివారిస్తుంది. కాబట్టి పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ హాయిగా తినవచ్చు.




ఫ్యాషన్



వస్త్రాలంకరణలో ప్రతీ అంశం అందంగా రూపుకట్టాల్సిందే అనే ఆలోచనల్లో నుంచి పుట్టుకు వచ్చిందే కొంగు డిజైన్. చీరకట్టులో కుచ్చిళ్లకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో పల్లూ డిజైనింగ్‌కీ అంతే ప్రత్యేకత ఉంటుంది. దారాల అల్లికలైనా.. అద్దాల అమరిక అయినా పూసల పనితనమైనా, ప్రింట్ల మెరుపు అయినా కొంగు కొత్తగా సింగారించుకుని వేడుకలలో బంగారంలా మెరిసిపోతుంది.



కొంగు సింగారం



రంగు రంగుల ఫ్యాబ్రిక్

చీరలోని రంగులతో పోటీ పడుతూ ఉండేలా ఫ్యాబ్రిక్‌తో చేసిన టాజిల్స్ కొంగుకు ప్రధాన ఆకర్షణగా మారుతుంది.

దారపు పోగులతో

ఊలు, సిల్క్, జరీ దారాలతో అల్లిన టాజిల్స్ కాటన్ చీరలకూ, పట్టు చీరల కొంగులకు ప్రత్యేక అందాన్ని తీసుకువస్తున్నాయి.

పూసల కొంగు

చీర రంగు కాంబినేషన్‌లో పూసలతో కొంగును డిజైన్ చేస్తే ఆ ప్రత్యేకత గురించి చెప్పడానికి మాటలు చాలవు. అలా డిజైనర్లు తమదైన సృజనకు మెరుగుపెడుతున్నారు. వాటిని ధరించిన వారు వేడుకలలో హైలైట్‌గా నిలుస్తున్నారు.





గవ్వలు, అద్దాలు

గిరిజన అలంకరణను అధునికపు హంగుగా మార్చడానికి గవ్వలు, అద్దాలు, ఊలు దారాల డిజైన్లను కొంగుకు అందంగా సింగారిస్తున్నారు. ఇవి ఎక్కువగా కాటన్ శారీస్ అలంకరణలో చూడవచ్చు. క్యాజువల్ వేర్‌గా నప్పే చీరలు ఈ డిజైన్ వల్ల ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి.


కుచ్చుల కొంగు

చందేరీ, నెటెడ్ మెటీరియల్‌తో చీరకు జత చేసిన కొంగు కుచ్చుల అమరికతో వెస్ట్రన్ పార్టీ వేర్‌గా అలరిస్తుంది. అమ్మాయిలను అమితంగా ఈ తరహా డిజైన్స్ ఆకట్టుకుంటున్నాయి.

రెడీమేడ్..

సాదా సీదాగా కనిపించే చీర కొంగు డిజైన్‌ను మార్చాలనుకుంటే మార్కెట్లో రెడీమేడ్ పల్లూ డిజైన్స్ లభిస్తున్నాయి. హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, పూసలు, దారాల అల్లికలతో ఉన్న పల్లూ డిజైన్స్‌ని తెచ్చి చిన్న కుట్టుతో కొంగును కొత్తగా మెరిపించవచ్చు.



వెట్టి నుంచి విముక్తి వరకు

మైసూరు చుట్టుపక్కల చెరుకు తోటల్లో వెట్టి పాలేర్లను పెట్టుకోవాలని చూస్తారు కొంతమంది.
అప్పులిచ్చి వాళ్లను పాలేర్లుగా మారుస్తారు.
తాయమ్మ కూడా ఒక వెట్టి పాలేరు.
కానీ, ఆమె వెట్టి నుంచి బయట పడింది. సొంత ఉపాధి పొందింది.
అంతే కాదు అప్పులపాలై వెట్టికి వెళ్లే
దిగువ వర్గాల స్త్రీల విముక్తికి పోరాడుతోంది.
మైసూరుకు చెందిన తాయమ్మ ఒక యోధురాలు. ధీర.

స్ఫూర్తి


తాయమ్మ

‘అదంతా ఎలా తట్టుకున్నానో. ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది’ అంటుంది తాయమ్మ. 33 ఏళ్ల ఈ ముగ్గురు పిల్లల తల్లి చేసిన నేరం ఏదైనా ఉంటే వెనుకబడిన వర్గాల్లో పుట్టడం. పేదరికంలో ఉండటం. ‘మా పేటల్లో సరైన ఇళ్లు ఉండవు. పరిశుభ్రత ఉండదు. మా కాలంలో మమ్మల్ని చదివించకుండా పొలాల్లో పని చేసే కూలీలను చేశారు. నేనూ నా భర్త మూర్తి ఇద్దరం పాలేరు పనులు చేస్తూనే పెళ్లి చేసుకున్నాం. ముగ్గురు పిల్లల్ని కన్నాం. వారి భవిష్యత్తు కోసం ఆరాట పడటమే మేము చేసిన నేరం’ అంటుంది తాయమ్మ.

మైసూరు జిల్లాలోని లోపలి ప్రాంతమైన హన్సూర్ అనే ఊరిలో చెరకు పండిస్తారు. రోజువారీ కూలీల కంటే వెట్టి కూలీలుగా కొందరిని పెట్టుకోవడానికి యజమానులు ప్రయత్నిస్తారు. దిగువ వర్గాల వారి ఆర్థికస్థితిని అవకాశంగా తీసుకుని వారి చేత వెట్టి చేయించుకుంటారు.

‘నా భర్త మూర్తి మాకున్న కొద్ది స్థలంలో ఒక చిన్న ఇల్లేదైనా వేసుకుందామని అనుకున్నాడు. మా ముగ్గురు పిల్లల్ని శుభ్రమైన వాతావరణంలో పెంచాలని అనుకున్నాము. అందుకు 60 వేలు అప్పు తీసుకున్నాం. ఆ కొద్ది అప్పు వడ్డీతో కలిసి మా జీవితాలను తల్లకిందులు చేసింది. అప్పు తీర్చలేకపోవడం వల్ల నేను, నా భర్త వెట్టికి వెళ్లాల్సి వచ్చింది. 2015 నుంచి 2017 వరకు మూడేళ్ల పాటు నేను, నా భర్త చెరుకు తోటల్లో వెట్టి చాకిరీ చేశాం. ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు మాకు పని ఉండనే ఉండేది. నేను నా చిన్న కొడుకును వీపున కట్టుకుని, ఇద్దరు పిల్లల్ని చెరో చేత్తో పట్టుకుని, కూడు నెత్తిన పెట్టుకుని పనికి వెళ్లేదాన్ని. పిల్లలకు ఆరోగ్యం బాగలేకపోయినా ఒకరు పొలంలో ఉండి ఒకరు ఆస్పత్రికి తీసుకెళ్లాలి. అంత ఘోరమైన వెట్టి అది. నా పిల్లలు బాగా చదువుకుంటేనే ఇలాంటి వెట్టి నుంచి బయటపడగలరనుకున్నాను. మూడేళ్లు కష్టపడి పని చేసినా మాకు విముక్తి రాకపోయేసరికి ఎవరో అధికారులకు చెప్పి మాకు విముక్తి కలిగించారు.’ అని చెప్పింది తాయమ్మ.

స్వేచ్ఛ పొందిన తాయమ్మ, ఆమె భర్త వాళ్లకు ఉన్న ఒక కొబ్బరి చెట్టు కాయలతో చిన్న షాప్ పెట్టుకున్నారు. కర్నాటకలో వెట్టి పాలేర్ల విముక్తి కోసం పని చేసే ‘ఉదయోన్ముఖ ట్రస్ట్’ తాయమ్మకు లోన్ ఇప్పించింది– కుట్టు మిషన్ల కోసం. తాయమ్మకు కుట్టు పనిలో ఉన్న ప్రావీణ్యం ఇప్పుడు ఆమెనే కాదు, ఆమెలా వెట్టి నుంచి విముక్తి పొందిన మరికొందరు మహిళలకు కూడా ఉపాధి కలిగిస్తోంది.

‘ఇంటిని ముందుకు నడపడంలో స్త్రీ కీలకం. ఆమె ఓడిపోకూడదు. కుటుంబం కోసం పోరాడాలి. అడ్డంకులను అధిగమించాలి. అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇవాళ నా పిల్లలు బాగా చదువుకుంటున్నారు. ఈ హక్కు అందరు పిల్లలకు దొరకాలి. వలస వచ్చే కూలీలు, దిగువ కులాల పేదలు వెట్టిలో చిక్కుకుంటున్నారు. వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వారి పిల్లలకు సరైన చదువు అందేలా ప్రభుత్వాలు పని చేయాలి’ అంటోంది తాయమ్మ.

యువర్స్

● టెక్.. టాక్



యాపిల్ ఐ ప్యాడ్ ఎయిర్

యాపిల్ ఐ ప్యాడ్ ఎయిర్ రెండు సైజులతో వచ్చింది.
11 అంగుళాల మోడల్: 2,360×1,640 పిక్సెల్ రిజల్యూషన్
ఇంటర్నల్: 128 జీబి 8జీబి ర్యామ్/256 జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 8జీబి ర్యామ్
బరువు: 462 గ్రా. కలర్స్: స్పేస్ గ్రే, స్టార్‌లైట్, పర్పుల్, బ్లూ
13 అంగుళాల మోడల్: 2,732×2,048 పిక్సెల్ రిజల్యూషన్
ప్రాసెసర్: యాపిల్ 2 ఫ్రంట్ కెమెరా: 12–మెగా పిక్సెల్స్



రియల్‌మీ 12 ప్రో

సైజ్: 6.7 అంగుళాలు
సెల్ఫీ కెమెరా: 16 ఎంపీ
రిజల్యూషన్: 2,412×1,080 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
కలర్: బ్లూ, గోల్డెన్ కలర్




గూగుల్ ఆడియో ఇమోజీ

ఆండ్రాయిడ్ యూజర్‌లకు కోసం ఆడియో ఇమోజీని పరీక్షిస్తోంది గూగుల్. ఈ ఫీచర్ ద్వారా ఫన్ సౌండ్ ఎఫెక్ట్స్‌లను ఫోన్ కాల్స్‌లో ఇంజెక్ట్ చేయవచ్చు. లాఫ్, క్లాపింగ్, అప్లాజ్, సెలబ్రేషన్‌లాంటి సౌండ్స్‌కు సంబంధించిన యానిమేషన్ ఇమోజీలను యూజర్‌లు స్క్రీన్‌పై ప్లే చేయవచ్చు.

ఇన్‌స్టాగ్రామ్ 'రివీల్' స్టిక్కర్ ఉపయోగించడానికి...

ఇన్‌స్టాగ్రామ్ 'రివీల్' అనే కొత్త ఫీచర్‌ని రిలీజ్ చేసింది. ఫాలోవర్స్, ఫ్రెండ్స్‌కు హిడెన్ స్టోరీని పోస్ట్ చేయడానికి ఉపకరించే ఫీచర్ ఇది...
● 'స్టోరీ' ఆప్షన్ యాక్సెస్ కోసం లెఫ్ట్ స్వైప్ చేయాలి ● 'స్టోరీ'ని క్రియేట్ చేయాలి ● 'రివీల్' స్టిక్కర్: సెర్చ్ అండ్ సెలక్ట్ ● 'రివీల్' స్టిక్కర్‌ను సెలెక్ట్ చేసుకున్న తరువాత మీ స్టోరీకి సంబంధించి హింట్‌ను టైప్ చేయాలి ● స్టోరీ పోస్ట్ చేసిన తరువాత మీ ఫ్రెండ్స్ మాత్రమే స్టోరీ కంటెంట్‌ను చూడగలుగుతారు.





హెడ్స్ విల్ రోల్

పొరపాటు జరిగినప్పుడు లేదా ఇతరత్రా సందర్భాలలో ఉద్యోగి చేత బలవంతంగా రాజీనామా చేయించే, డిస్మిస్ చేసే సందర్భంలో వాడే మాట...హెడ్స్ విల్ రోల్.
ఉదా: హెడ్స్ ఆర్ గోయింగ్ టు రోల్ వెన్ ది బాస్ ఫైండ్స్ ఔట్ ఎబౌట్ ది మిస్సింగ్ స్టాక్

హకునా మటాటా

'నో ట్రబుల్. నో వర్రీస్, నో ప్రాబ్లం....అంతా నిశ్చింతం' అని చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట...హకునా మటాటా. ఉదా: డోన్ట్ వర్రీ సో మచ్ ఎబౌట్ ది ఫ్యూచర్. హకునా మటాటా.

మూలం: 'లయన్ కింగ్' సినిమాతో హకునా మటాటా పాపులర్ అయినప్పటికీ దీని మూలం ఆఫ్రికన్ తత్వశాస్త్రంలో ఉంది. తూర్పు ఆఫ్రికాలోని స్వాహిలీ మాట్లాడే ప్రజలకు సంబంధించిన ఉబుంటు తత్వశాస్త్రం నుంచి పుట్టింది. మొదట ఈ ఎక్స్‌ప్రెషన్‌ను కెన్యా బ్యాండ్ 'జంబో బవానా' అనే పాటతో ప్రాచుర్యంలోకి తెచ్చింది.

● మ్యూజిక్ వరల్డ్

ముంబై మ్యాజిక్


● 1. నతనియ 2. సుఖి 3. షల్మాలి

'దేశీ ట్రిల్' మ్యూజిక్ బ్యాండ్‌లోని ముగ్గురు గాయకులు... నతనియ లాల్వాని, సుఖి, షల్మాలి ఖోల్గడేలు 'వావ్' అనుకునే పాటను తీసుకువచ్చారు. ఈ కొత్త సాంగ్ 'ముంబై మ్యాజిక్' నిజంగానే మ్యాజిక్ చేసింది. హెరిటేజ్, హసల్, హోప్ అనే మాటలతో రూపుదిద్దుకున్న పాట ఇది. 'ముంబైవాసిగా ఈ పాట నన్ను ఎన్నో జ్ఞాపకాల్లోకి తీసుకువెళ్లింది' అంటుంది నతనియ. 'దేశీ ఎట్ హార్ట్' అని తన గురించి పరిచయం చేసుకునే సుఖి న్యూయార్క్, షికాగో, లాస్ ఏంజిల్స్‌లాంటి ఎన్నో ప్రాంతాలలో నివసించింది. అయినప్పటికీ స్వదేశీ మూలాలకు ఎప్పుడూ దూరం కాలేదు. బ్రాడ్‌వే, జాజ్ లాంటి డిఫరెంట్ మ్యూజిక్ జానర్స్‌కు దేశీ టచ్ ఇచ్చింది.'ఎన్నో విలువైన జ్ఞాపకాలకు పాట రూపం ఇచ్చే అవకాశం దక్కింది' అంటుంది 'ముంబై మ్యాజిక్' గురించి. 'ముంబై మహానగరంతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరు రిలేట్ అయ్యే పాట ఇది. ముంబై నగర ముఖచిత్రాన్ని వివిధ వర్ణాలలో అందంగా చూపిన పాట. నగరంలోని వేగాన్ని, నిశ్శబ్దాన్ని, వెలుగు, నీడలను పట్టించే పాట ఇది' అంటుంది షల్మాలి.

యుద్ధంలో ఒకరోజు...

రియల్–టైమ్ టాక్టిక్స్, రియల్–టైమ్ స్ట్రాటజీ గేమ్ మెన్ ఆఫ్ వార్–2. 2011లో వచ్చిన మెన్ ఆఫ్ వార్: అసల్ట్ స్క్వాడ్ సీక్వెల్‌గా వస్తున్న ఈ గేమ్ వరల్డ్ వార్–2 నేపథ్యంలో సాగుతుంది. 2016లో వచ్చిన 'మెన్ ఆఫ్ వార్'కు ఇది మోడ్రన్ రీమాస్టర్. లార్జ్ స్కేల్ టాంక్ కంబాట్ చేసే ప్లేయర్స్ కోసం స్కీమిష్ మోడ్ ఉంది.
ఇంజిన్: జెమ్ 2 ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్
జానర్స్: రియల్–టైమ్ టాక్టిక్స్, రియల్–టైమ్ స్ట్రాటజీ
మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్

● గేమింగ్



ఇన్నోవేషన్

పర్యావరణధీరులు


● రాఘవ్ అరోర
● అక్షిత్ బన్సాల్

'30 అండర్ 30 ఆసియా' తాజా జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. ఈ జాబితాలో ఇన్నోవేషన్, ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండస్ట్రీస్ విభాగంలో మన దేశం నుంచి ఈవీ చార్జింగ్ కంపెనీ 'స్టాటిక్' ఫౌండర్స్ అక్షిత్ బన్సాల్, రాఘవ్ అరోర, 'ది డిస్పోజల్ కంపెనీ' ఫౌండర్ భాగ్యశ్రీ జైన్‌లు చోటు సాధించారు....


● భాగ్యశ్రీ జైన్

బాల్యస్నేహితులైన అక్షిత్ బన్సాల్, రాఘవ్ అరోరాలు పట్టణ వాయు కాలుష్యం గురించి ఎన్నోసార్లు మాట్లాడుకునేవారు. కాలుష్య స్థాయిలను తగ్గించడంలో ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) ప్రధాన పాత్ర పోషించడంపై కూడా మాట్లాడుకునేవారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ)కి సంబంధించిన మౌలిక చార్జింగ్ సదుపాయాలపై దృష్టి పెట్టారు. తమ పొదుపు మొత్తాలను ఉపయోగించి 2019లో ఇంట్లో తొలి ఈవీ చార్జర్‌ను తయారుచేయడంతో 'స్టాటిక్' ప్రయాణం ప్రారంభమైంది.

వినియోగదారులు తమ ఎలక్ట్రిక్ వాహనాలను చార్జ్ చేయడానికి సమీపంలోని చార్జింగ్ స్టేషన్‌ను గుర్తించడానికి 'స్టాటిక్' యాప్ ఉపయోగపడుతుంది. అగ్రశ్రేణి ఈవీ చార్జర్లు, అడ్వాన్స్‌డ్ మొబైల్ అప్లికేషన్‌లను కూడా 'స్టాటిక్' డెవలప్ చేసింది. ఈ స్టార్టప్ కార్పొరేట్ ఆఫీసులు, రెసిడెన్సెస్, హోటల్స్, సినిమా హాలు...మొదలైన వాటికి సంబంధించిన యజమానులతో టై అప్ అయింది. ఈ ప్రాపర్టీ ఓనర్స్‌ను 'చార్జర్ హోస్ట్స్'గా వ్యవహరిస్తారు.

హరియాణాలోని హిసార్‌లో పుట్టి పెరిగిన అక్షిత్ బన్సాల్ మణిపాల్ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఏదైనా సాధించాలనే పట్టుదలతో 2018లో 'డెలాయిట్‌లో' చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశాడు. స్నేహితుడు రాఘవ్ అరోర అతడికి వెయ్యి ఏనుగుల బలం అయ్యాడు. 'విప్రో'లో డేటా సైంటిస్ట్‌గా పనిచేసిన రాఘవ్ బాల్య స్నేహితుడికి తోడుగా నిలిచాడు. ఇద్దరి కృషి 'స్టాటిక్'కు అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.

'స్టాటిక్' యూఎస్పీలలో ఒకటి...సింగిల్ రెవెన్యూ మోడల్‌పై మాత్రమే కంపెనీ దృష్టి పెట్టకపోవడం. సొంతంగా చార్జర్స్‌ను ఇన్‌స్టాల్ చేయడంతో పాటు. హెచ్‌పీసీఎల్, షెల్‌లాంటి పెద్ద కంపెనీల కోసం చార్జర్లను బిల్డ్ చేయడం, ఇన్‌స్టాల్, మెయింటెయిన్ చేయడం లాంటివి చేస్తోంది స్టాటిక్.

వివిధ బ్రాండ్‌లు 'ప్లాస్టిక్ న్యూట్రల్'గా మారడానికి తన స్టార్టప్ 'ది డిస్పోజల్ కంపెనీ'తో సహాయపడుతోంది దిల్లీకి చెందిన భాగ్యశ్రీ జైన్. ఈ స్టార్టప్ ద్వారా ఏడాదికి 750 టన్నుల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తున్నారు. నోయిడా యూనివర్శిటీలో బిబిఏ చేసిన భాగ్యశ్రీ కొన్ని సంవత్సరాలు వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇండస్ట్రీలో పనిచేసింది. వివాహానంతరం రాజస్థాన్‌కు మకాం మార్చింది. వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫీల్డ్‌లో ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో రాష్ట్రంలో ఒక్క రీసైక్లింగ్ యూనిట్ లేదనే విషయం గ్రహించింది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలపై దృష్టి పెట్టి 'ది డిస్పోజల్ కంపెనీ' అనే రీసైకిలింగ్ కంపెనీ మొదలుపెట్టింది.

ఏదైనా బ్రాండ్ తమ కంపెనీలో క్లయింట్‌గా సంతకం చేసిన తరువాత ఆ బ్రాండ్‌కు సంబంధించిన ప్లాస్టిక్ ఫుట్ ప్రింట్‌ను అంచనా వేయడానికి వన్–టైమ్ వేస్ట్ ఆడిట్ నిర్వహిస్తారు. 'ది డిస్పోజల్ కంపెనీ'కి దేశవ్యాప్తంగా రీసైక్లర్ పాట్నర్స్, రాగ్‌పికర్స్, ఆగ్రిగేటర్స్ ఉన్నారు. 75 లక్షల రూపాయల పెట్టుబడితో ఈ రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఎక్సెంచర్, సస్టైనబిలిటీ, యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన ఈ స్టార్టప్‌కు 60 లక్షల రూపాయల సీడ్ ఫండ్ లభించింది.

పర్యావరణం, మనుషుల ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం చూపుతున్న ప్రభావం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకునే పద్ధతుల గురించి రచనలు, ఉపన్యాసాల రూపంలో ప్రజలకు అవగాహన కలిగిస్తోంది భాగ్యశ్రీ జైన్.

సినిమా

సత్యభామ నాకు స్పెషల్ - కాజల్ అగర్వాల్


● కాజల్ అగర్వాల్

''సత్యభామ పాత్రలో నటించడం సవాల్‌గా అనిపించింది. ఇలాంటి పాత్ర నా కెరీర్‌లో ఇదే తొలిసారి. ఇది నా కెరీర్‌లో స్పెషల్ ప్రాజెక్ట్‌గా భావిస్తున్నాను'' అన్నారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. ఆమె లీడ్ రోల్‌లో నటించిన సినిమా 'సత్యభామ'. నవీన్ చంద్ర కీలక పాత్ర చేశారు. సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క ఈ మూవీకి సమర్పకులుగా వ్యవహరించడంతో పాటు స్క్రీన్ ప్లే అందించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. 'సత్యభామ' మ్యూజికల్ ఈవెనింగ్ పేరుతో నిర్వహించిన ఈవెంట్‌లో ఈ మూవీలోని 'వెతుకు వెతుకు..' అంటూ సాగే పాట రిలీజ్ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పాడారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''నేను ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత చేసిన సినిమా 'సత్యభామ'. మన అమ్మాయిలు క్షేమంగా ఉండాలనే పాయింట్ ఈ కథలో నన్ను ఆకట్టుకుంది'' అన్నారు. ఈ వేడుకలో శశికిరణ్ తిక్క, శ్రీ చరణ్ పాకాల తదితరులు పాల్గొన్నారు.


● ఎన్టీఆర్

ప్రపంచ ఫిల్మ్ మేకర్స్‌ను ఏకం చేసే వేదిక ఇది

- కాన్స్ చిత్రోత్సవాల్లో భారత రాయబారి జావేద్ అష్రఫ్


● భారత్ పెవిలియన్ ప్రారంభోత్సవంలో ఓ దృశ్యం

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'భారత్ పర్వ్' వేడుకలను తొలిసారిగా నిర్వర్తిస్తోంది భారత ప్రభుత్వం. ఈ వేడుకల్లో భాగంగానే ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'భారత్ పెవిలియన్'ను 'ఫ్రాన్స్‌లోని భారత రాయబారి' జావేద్ అష్రఫ్, ఎమ్ఐబీ (మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్) సెక్రటరీ సంజయ్ జాజు ప్రారంభించారు. తొలుత ఈ పెవిలియన్‌కు 'ఇండియన్ పెవిలియన్' పేరు అనుకున్నారట. ఆ తర్వాత ఈ పేరును 'భారత్ పెవిలియన్'గా మార్చారు. భారత్ పెవిలియన్ ప్రారంభం సందర్భంగా... ''ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' సినిమాతో మళ్లీ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలో నిలిచినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు సంజయ్. ''కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అంటే కేవలం ఫ్యాషన్, రెడ్ కార్పెట్ మాత్రమే కాదు.. వరల్డ్ సినిమా ఫిల్మ్ మేకర్స్‌ను ఏకం చేస్తుంది. భవిష్యత్ ఫిల్మ్ మేకింగ్‌కు ఓ వేదిక అవుతుంది'' అని పేర్కొన్నారు జావేద్ అష్రఫ్. ఈ కార్యక్రమంలో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ డిప్యూటీ ఆర్టిస్టిక్ డైరెక్టర్ క్రిస్టియన్ జ్యూన్, ఇండియన్–కెనడియన్ ఫిల్మ్‌మేకర్ రిచీ మెహతా పాల్గొన్నారు.


● కుమార్తె ఆరాధ్యతో ఐశ్వర్యా రాయ్

చేతికి ఏమైంది?... కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు రెండు దశాబ్దాలుగా తప్పకుండా హాజరవుతున్నారు ఐశ్వర్యా రాయ్. ఈ ఏడాది చిత్రోత్సవాల్లోనూ ఆమె మెరవనున్నారు. ఐశ్వర్యారాయ్, ఆమె కుమార్తె ఆరాధ్య ఫ్రాన్స్ చేరుకున్నారు. తొలిసారిగా ఐశ్వర్యా రాయ్ 2002 కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై నడిచిన విషయం గుర్తుండే ఉంటుంది. అలాగే తల్లి ఐశ్వర్యతో కలిసి 2012లో ఆరాధ్య తొలిసారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిసింది. తాజాగా తన కుమార్తెతో కలిసి ఐశ్వర్య కాన్స్ చిత్రోత్సవాలకు వెళ్లిన ఫొటోలు బయటికి వచ్చాయి. ఆ ఫొటోలను గమనిస్తే.. ఆమె చేతికి కట్టు కట్టుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దాంతో ఆమెకు ఏమైంది? గాయంతో ఐశ్వర్యా రాయ్ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై ఎలాంటి కాస్ట్యూమ్‌లో కనిపించనున్నారు? అనే ఆసక్తి నెలకొంది.

కాండ్రకోటలో ఏం జరిగింది?

'జీవితంలో కొన్నిసార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు' (తనికెళ్ల భరణి) అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'నింద' సినిమా టీజర్. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన ఈ సినిమాను రాజేశ్ జగన్నాథం స్వీయదర్శకత్వంలో నిర్మించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను హీరో నవీన్ చంద్ర విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. లవ్, మర్డర్ మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలు ఈ సినిమాలో ఉన్నట్లుగా తెలుస్తోంది. కాండ్రకోట మిస్టరీ అంటూ వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించినట్లుగా చిత్ర యూనిట్ పేర్కొంది. ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్య కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంతు ఓంకార్ మ్యూజిక్ డైరెక్టర్.


● రాజేశ్, వరుణ్ సందేశ్, నవీన్ చంద్ర

దేవర ముంగిట నువ్వెంత!

ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు శుభవార్త. ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డేని పురస్కరించుకుని ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవర' నుంచి 19న 'ఫియర్' అనే తొలి సాంగ్ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'జనతా గ్యారేజ్ '(2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు.

నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్న 'దేవర' నుంచి 'ఫియర్..' అంటూ సాగే పాట ఈ నెల 19న విడుదల కానుంది. ఈ పాటలో 'దేవర ముంగిట నువ్వెంత..' అనే పదాలు ఉన్నట్లు సమాచారం. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' చిత్రం మొదటి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ కానుంది. సైఫ్ అలీ ఖాన్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్ నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు.

ఎమర్జెన్సీ వాయిదా


● కంగనా రనౌత్

భారతదేశంలో అమలు చేయబడిన ఎమర్జెన్సీ కాలం (1975 జూన్ 25–1977 మార్చి 21) నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఎమర్జెన్సీ'. భారత దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం ఇది. అనుపమ్ ఖేర్, శ్రేయాస్ తల్పాడే, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, సతీష్ కౌశిక్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాను జూన్‌లో విడుదల చేయాలనుకున్నారు. కానీ విడుదల వాయిదా పడింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కంగనా రనౌత్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారామె. దాంతో కంగనా రనౌత్ రాజకీయాల పరంగా బిజీగా ఉన్న నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' సినిమాను వాయిదా వేశామని, త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర యూనిట్ వెల్లడించింది.

బస్తీ ప్రేమకథ

'బందూక్, శేఖరంగారి అబ్బాయి' చిత్రాల ఫేమ్ అనురూప్ రెడ్డి హీరోగా నటించిన మూడో చిత్రం 'ప్రేమించొద్దు'. దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రల్లో నటించారు. శిరిన్ శ్రీరామ్ స్వీయ దర్శకత్వంలో 5 భాషల్లో నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుకలో శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ– ''బస్తీ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. తెలుగులో జూన్ 7న విడుదల చేస్తాం. ఆ తర్వాత తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''తల్లిదండ్రులు, పిల్లలు చూసేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు సూపర్ వైజింగ్ ప్రొడ్యూసర్ నిఖిలేష్ తొగరి. ''ఈ సినిమా ఎంతో వాస్తవంగా ఉంటుంది'' అన్నారు అనురూప్ రెడ్డి. నటీమణులు సంతోషి, సోనాలీ గర్జె, మానస మాట్లాడారు.


● అనురూప్, సోనాలి

సింగిల్ స్క్రీన్స్ నిండిపోతాయి - ఆశిష్

''లవ్ మీ' వంటి మంచి కథలో నటించే అవకాశం ఇచ్చిన అరుణ్, నాగలకు థ్యాంక్స్. టీజర్, ట్రైలర్ బాగుంటే సినిమాకి వస్తారు.. కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. మా చిత్రంతో మళ్లీ థియేటర్లకు కళ వస్తుంది.. సింగిల్స్ స్క్రీన్స్ అన్నీ నిండిపోతాయి'' అని హీరో ఆశిష్ అన్నారు. అరుణ్ భీమవరపు దర్శకత్వంలో ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'లవ్ మీ'. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఇంతవరకు ఎందరో దర్శకుల్ని పరిచయం చేశాను. మొదటిసారి నాగను నిర్మాతగా పరిచయం చేస్తున్నాను. న్యూ ఏజ్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ మూవీ పెద్ద హిట్టవుతుంది'' అన్నారు. ''సీతమ్మ, సతీదేవీ.. ఇలా అందరూ చనిపోయి దేవతలు అయ్యారు. దివ్యవతి చనిపోయి దెయ్యం ఎందుకు అయింది? అంటూ అర్జున్ (ఆశిష్) చేసే ప్రయాణమే ఈ చిత్రం'' అన్నారు అరుణ్ భీమవరపు. వైష్ణవీ చైతన్య, సిమ్రాన్ చౌదరి, రవి కృష్ణ, హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి పాల్గొన్నారు.


● సిమ్రాన్, ఆశిష్, వైష్ణవీ చైతన్య

ధర్మం ముఖ్యం


● రాజ్ తరుణ్, హాసినీ సుధీర్

రాజ్‌తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హాసినీ సుధీర్ హీరోయిన్. డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. 'ఒక యుగంలో నాన్న మాట విన్న రాముడు దేవుడు అయితే... మరో యుగంలో నాన్న మాట వినని ప్రహ్లాదుడు మహనీయుడు అయ్యాడు.. ఇక్కడ మాట కాదు నాన్న... ధర్మం ముఖ్యం' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. 'పురుషోత్తముడు' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''మా సినిమాను జూన్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాజ్ తరుణ్ మా సినిమాకు బాగా సపోర్ట్ చేశారు. ప్రమాదం జరిగినా కూడా సెట్స్‌కు వచ్చారు రామ్ భీమన. 102 డిగ్రీల జ్వరంతో కూడా హీరోయిన్ షూట్‌లో పాల్గొన్నారు. టీమ్ అంతా సహకరించారు. అతి త్వరలోనే ట్రైలర్‌ను, ఆ తర్వాత ఈ సినిమా రిలీజ్ డేట్ చెబుతాం'' అన్నారు నిర్మాతలు. ''రాజ్ తరుణ్‌ని కొత్తగా ప్రజెంట్ చేసిన మూవీ ఇది. సినిమాకు పెద్ద నటీనటులను ఇచ్చినందుకు నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు రామ్ భీమన.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
677	203
73,664	22,404

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,743	▲	10
డోజోన్స్	39,939	▲	31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,438	▼	7
డాక్స్	18,879	▼	131
షాంఘై	3,122	▲	2
నికాయ్	38,920	▲	535

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	72,170 ▲	740
బంగారం (22 క్యారట్)	68730 ▲	720
వెండి (కేజీ)	92,500 ▲	1,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.05	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.80	92.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.68	54.88
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.62	56.56
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.95	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.44	12.51

వెండి వెలుగులు @ 88,700

ఆల్‌టైం గరిష్టానికి చేరిక



న్యూఢిల్లీ: భారత్‌లో వెండి రికార్డు ధరను అందుకుంది. న్యూఢిల్లీలో ధర కేజీకి గురువారం ఒకేరోజు రూ.1,800 ఎగసి, రూ.88,700కు ఎగసింది. ముంబైలో ధర రూ. 92,500కు చేరింది. ఇక పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.650 ఎగసి రూ.74,050కి చేరింది. అమెరికాలో తక్కువ ద్రవ్యోల్బణం గణాంకాలు నమోదుకావడం, దీనితో సెప్టెంబర్‌లోనే ఫెడ్ ఫండ్ రేటు తగ్గించవచ్చన్న అంచనాలు మెటల్స్ ధరల పటిష్టతకు ఊతం ఇచ్చాయి. కాగా, ఈ వార్త రాస్తున్న 10 గంటల సమయంలో దేశీయ ఫ్యూచర్స్ ఎంసీఎక్స్‌లో వెండి జూలై కాంట్రాక్ట్ ధర కేజీకి ఒక శాతం లాభంతో రూ. 87,390 వద్ద ట్రేడవుతోంది.

సెమీకండక్టర్స్ తయారీలోకి జోహో

700 మిలియన్ డాలర్ల పెట్టుబడి యోచన

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ జోహో తాజాగా సెమీకండక్టర్ల తయారీలోకి ఎంట్రీ ఇవ్వనుంది. దీనిపై 700 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే యోచనలో సంస్థ ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి కంపెనీ ప్రోత్సాహకాలు కోరుతోందని పేర్కొన్నాయి. ప్రస్తుతం జోహో ప్రతిపాదనను ఐటీ శాఖ కమిటీ పరిశీలిస్తోందని, వ్యాపార ప్రణాళికలపై మరింత స్పష్టతనివ్వాలని కంపెనీని కోరిందని వివరించాయి. జోహో ఇప్పటికే టెక్నాలజీ భాగస్వామిని కూడా ఎంచుకున్నట్లు తెలిపాయి. 1996లో ఏర్పాటైన జోహో .. గత ఆర్థిక సంవత్సరం 1 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం నమోదు చేసింది. తమిళనాడులో చిప్ డిజైన్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో శ్రీధర్ వెంబు మార్చిలో వెల్లడించిన నేపథ్యంలో తాజా వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశీయంగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్, సీజీ పవర్ తదితర సంస్థలకు కేంద్రం ఫిబ్రవరిలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్‌లో సెమీకండక్టర్ల మార్కెట్ 2026 నాటికి 63 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

బ్రూక్‌ఫీల్డ్ రీట్ ఆదాయం రూ. 461 కోట్లు



న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ (బిరెట్) గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమసికంలో రూ. 461 కోట్ల నికర నిర్వహణ ఆదాయం ప్రకటించింది. గత క్యూ4తో పోలిస్తే ఇది 89 శాతం అధికం. తాజాగా రూ. 208.6 కోట్లు యూనిట్ హోల్డర్లకు పంపిణీ చేయనున్నట్లు తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ. 961 కోట్ల నుంచి రూ. 1,506 కోట్లకు పెరిగింది. మరోవైపు, భారతి గ్రూప్ నుంచి నాలుగు కమర్షియల్ ప్రాపర్టీల్లో 50 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు బిరెట్ తెలిపింది. సంస్థ విలువను రూ. 6,000 కోట్లుగా లెక్కగట్టి ఈ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీనితో బిరెట్‌లో భారతి ఎంటర్‌ప్రైజెస్ 8.53 శాతం వాటాతో రెండో అతిపెద్ద యూనిట్‌హోల్డరుగా మారనుంది.

ఎంఅండ్‌ఎం లాభం ప్లస్

- క్యూ4లో రూ. 2,754 కోట్లు
- షేరుకి రూ. 21.10 డివిడెండ్
- ఈవీపై భారీ పెట్టుబడులకు సై



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్‌ఎం) గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 2,754 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 2,637 కోట్లు ఆర్జించింది. ఆటోమోటివ్, వ్యవసాయ విభాగాలు ఇందుకు సహకరించాయి. మొత్తం ఆదాయం సైతం 9 శాతం బలపడి రూ. 35,452 కోట్లకు చేరింది. వాటాదారులకు షేరుకి రూ. 21.10 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి ఎంఅండ్ ఎం నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 11,269 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 9,025 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం ఎగసి రూ. 1,39,078 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది రూ. 1,21,362 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా ఎలక్ట్రానిక్ వెహికల్స్(ఈవీ) భారీ పెట్టుబడులకు సంస్థ ప్రణాళిక రూపొందిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు బీఎస్‌ఈలో 3 % ఎగసి రూ. 2,373 వద్ద ముగిసింది.

వినీత్ నయ్యర్ కన్నుమూత



ముంబై: ఐటీ పరిశ్రమ దిగ్గజంగా పేరొందిన వినీత్ నయ్యర్ గురువారం కన్నుమూశారు. ఆయనకు 85 ఏళ్లు. ఐఏఎస్ అధికారి అయిన నయ్యర్ గెయిల్ తొలి చైర్మన్‌గా వ్యవహరించారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు సారథ్యం వహించారు. టెక్ మహీంద్రా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నయ్యర్ మరణవార్తను మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో వెల్లడించారు. నయ్యర్ సారథ్యంలో తమ గ్రూప్ సత్యం కంప్యూటర్స్‌ను 'సాహసోపేతంగా' దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. నయ్యర్ తనకు మిత్రుడు, సోదరుడు, మార్గదర్శకుడిలాంటి వారని టెక్ మహీంద్రాకు సుదీర్ఘకాలం సీఈవోగా పని చేసిన సీపీ గుర్నానీ పేర్కొన్నారు. ఆయన మృతిపై జీ20 షెర్పా అమితాబ్ కాంత్ సంతాపం వ్యక్తం చేశారు.

క్రాంప్టన్ గ్రీవ్స్ ఫ్లాట్ .. లాభం రూ. 133 కోట్లు



న్యూఢిల్లీ: క్రాంప్టన్ గ్రీవ్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 133 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 132 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,791 కోట్ల నుంచి రూ. 1,961 కోట్లకు బలపడింది. వాటాదారులకు షేరుకి రూ. 3 డివిడెండ్ ప్రకటించింది. ఆదాయంలో ఎలక్ట్రిక్ కన్జూమర్ డ్యురబుల్స్ వాటా రూ. 1,516 కోట్లుకాగా, లైటింగ్ ప్రొడక్టుల నుంచి రూ. 281 కోట్లు లభించింది. కాగా.. గతేడాది కొనుగోలు చేసిన బటర్‌ఫ్లై ఆదాయం రూ. 187 కోట్ల నుంచి రూ. 164 కోట్లకు క్షీణించింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 476 కోట్ల నుంచి రూ. 442 కోట్లకు నీరసించింది. మొత్తం ఆదాయం రూ. 6,870 కోట్ల నుంచి రూ. 7,313 కోట్లకు ఎగసింది.

బీఎస్‌ఈలో క్రాంప్టన్ గ్రీవ్స్ షేరు స్వల్ప లాభంతో రూ. 339 వద్ద ముగిసింది.

గెయిల్ లాభం @ రూ. 2,177 కోట్లు



ముంబై: గెయిల్ (ఇండియా) చివరి త్రైమాసిక స్టాండెలోన్ నికర లాభం 261 శాతం దూసుకెళ్లి రూ. 2,177 కోట్లకు చేరింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం ఫ్లాట్‌గా రూ. 32,335 కోట్లను తాకింది. పూర్తి ఏడాది (2023–24)కి గెయిల్ నికర లాభం రూ. 5,302 కోట్ల నుంచి రూ. 8,836 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1.44 లక్షల కోట్ల నుంచి రూ. 1.3 లక్షల కోట్లకు క్షీణించింది.

గెయిల్ షేరు బీఎస్‌ఈలో 2.7 శాతం నష్టంతో రూ. 196 వద్ద ముగిసింది.

పోకర్ణ డివిడెండ్ 60 పైసలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పోకర్ణ లిమిటెడ్ 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 60 పైసల డివిడెండ్ చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 50 శాతం ఎగసి రూ.15 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్‌లో ఎటువంటి మార్పు లేకుండానే రూ.164 కోట్లు సాధించింది. 2023–24లో రూ.699 కోట్ల టర్నోవర్‌పై రూ.87 కోట్ల నికర లాభం దక్కించుకుంది. ఫలితాల నేపథ్యంలో పోకర్ణ షేరు ధర బీఎస్‌ఈలో గురువారం 0.62 శాతం ఎగసి రూ.502.35 వద్ద స్థిరపడింది.

బుల్ బ్యాక్ ర్యాలీ

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు ● 40 వేల పాయింట్ల పైకి డోజోన్స్



ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల మద్దతుకు తోడు బ్యాంకింగ్, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు గురువారం దాదాపు ఒక శాతం ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 677 పాయింట్లు పెరిగి 73,664 వద్ద నిలిచింది. నిఫ్టీ 203 పాయింట్లు లాభపడి 22,404 వద్ద స్థిరపడింది. అమెరికాలో ద్రవ్యోల్బణం ఊహించిన దానికంటే తక్కువగానే నమోదవడంతో ఈ ఏడాదిలో ఫెడ్ రిజర్వ్ కనీసం రెండు సార్లు వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలు తెరపైకి వచ్చాయి. ఈ పరిణామం ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్లపై కూడా సానుకూల ప్రభావం చూపింది. ఒక దశలో సెన్సెక్స్ 762 పాయింట్లు బలపడి 73,749 వద్ద, నిఫ్టీ 231 పాయింట్లు పెరిగి 22,432 ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.07%, 0.85% లాభపడ్డాయి.

- ఇన్వెస్టర్ల సంపద గురువారం ఒక్కరోజే రూ.3.1 లక్షల కోట్లు పెరిగి బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 407.35 లక్షల కోట్లకు చేరుకుంది. మొత్తం 30కి గానూ 25 షేర్లు లాభపడ్డాయి.
- అమెరికాలో పారిశ్రామిక రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే డోజోన్స్ సూచీ తొలిసారి 40వేల పాయింట్ల పైకి చేరింది.

4 ట్రిలియన్ డాలర్లకు భారత్ ఎకానమీ: సన్యాల్



న్యూఢిల్లీ: భారత్ 2024–25 ఆర్థిక సంవత్సరంలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధాన మంత్రికి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ–పీఎం) సభ్యుడు సంజీవ్ సన్యాల్ పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని విశ్లేషించారు. మరో రెండేళ్లలో జర్మనీని అధిగమించి మూడవ స్థానాన్ని ఆక్రమిస్తుందన్నారు.

42 కోట్లకు విమాన ప్రయాణికుల ట్రాఫిక్

2024–25పై ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య వార్షికంగా సుమారు 8–11 శాతం వృద్ధితో 40.7 కోట్లు–41.8 కోట్ల రికార్డు స్థాయిని తాకే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. అలాగే నిర్దిష్ట ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ల ఆదాయాలు 15–17 శాతం మేర పెరగొచ్చని ఒక నివేదికలో వివరించింది. గత ఆర్థిక సంవత్సరం విమాన ప్రయాణికుల రద్దీ కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే 10 శాతం పెరిగి 37.64 కోట్లుగా నమోదైంది.

వొడాఫోన్ ఐడియా మళ్లీ డీలా



న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా మరోసారి డీలా పడింది. చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం మరింత పెరిగి రూ. 7,675 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 6,419 కోట్ల నష్టం వాటిల్లింది. మొత్తం ఆదాయం ఫ్లాట్‌గా రూ. 10,607 కోట్లకు చేరింది. వెరసి పూర్తి ఏడాదిలోనూ నష్టం పెరిగి రూ. 31,238 కోట్లను దాటింది. 2022–23లో రూ. 29,301 కోట్ల నష్టం ప్రకటించింది.

బీఎస్‌ఈలో వొడాఫోన్ ఐడియా షేరు దాదాపు యథాతథంగా రూ. 13.15 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10



ఫైనల్లో నిఖత్ జరీన్

ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ నిఖత్ జరీన్ (52 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లింది. కజకిస్తాన్‌లోని అస్తానా నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ చాంపియన్ నిఖత్ 5–0తో తొమిరిస్ మిర్జాకుల్ (కజకిస్తాన్)పై ఘన విజయం సాధించింది. భారత్‌కే చెందిన మీనాక్షి (48 కేజీలు), అనామిక (50 కేజీలు), మనీషా (60 కేజీలు) కూడా ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో మీనాక్షి 5–0తో గుల్నాజ్ బురిబయేవా (కజకిస్తాన్)పై, మనీషా 5–0తో టాంగటార్ అసెమ్ (కజకిస్తాన్)పై గెలిచారు. మరోవైపు సోనూ (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు) సెమీఫైనల్లో నిష్క్రమించి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల విభాగంలో భారత బాక్సర్లు సొయిబమ్ సింగ్ (48 కేజీలు), అభిషేక్ యాదవ్ (67 కేజీలు), విశాల్ (86 కేజీలు), గౌరవ్ చౌహాన్ (ప్లస్ 92 కేజీలు) నేడు సెమీఫైనల్స్‌లో పోటీపడనున్నారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు సునీల్ ఛెత్రి గుడ్‌బై

జూన్ 6న కువైట్‌తో చివరిసారి టీమిండియా తరపున బరిలోకి
ప్రొఫెషనల్ లీగ్‌లలో కొనసాగనున్న భారత స్టార్



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. వచ్చే నెల 6న ప్రపంచకప్ ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా కువైట్‌తో జరిగే మ్యాచే తన కెరీర్‌లో చివరిదని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా భావోద్వేగపు వీడియోలో సునీల్ ఛెత్రి ప్రకటించాడు. అయితే ప్రైవేట్, క్లబ్, ఫ్రాంచైజీ లీగ్‌లలో కొనసాగుతానని 39 ఏళ్ల ఛెత్రి స్పష్టం చేశాడు. 2005లో అరంగేట్రం చేసిన ఈ స్టార్ ఫుట్‌బాలర్ దాదాపు రెండు దశాబ్దాల పాటు (19 ఏళ్లు) భారత జట్టుకు సేవలందించాడు. ఢిల్లీకి చెందిన ఆర్మీ అధికారి కేబీ ఛెత్రి, సుశీల దంపతులకు 1984, ఆగస్టు 3న సికింద్రాబాద్ (తెలంగాణ)లో జన్మించిన ఛెత్రి భారత ఫుట్‌బాల్‌లో అసాధారణ ఫార్వర్డ్ ఆటగాడిగా ఎదిగాడు. తదనంతరం నాయకత్వ పటిమతో విజయవంతమైన సారథి అయ్యాడు. భారత ఫుట్‌బాల్ చరిత్రలో చురుకైన దిగ్గజంగా వెలుగొందుతున్నాడు.

ఇవీ ఘనతలు

- 150 అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన సునీల్ 94 గోల్స్ కొట్టాడు. భారత్ తరపున టాప్ స్కోరర్ కాగా... ఓవరాల్‌గా ఫుట్‌బాల్ చరిత్రలో జాతీయ జట్టు తరపున ఎక్కువ గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో టాప్–3లో ఉన్నాడు. క్రిస్టియానో రోనాల్డో (128 గోల్స్; పోర్చుగల్), మెస్సీ (106 గోల్స్; అర్జెంటీనా) తర్వాతి స్థానం మన ఛెత్రిదే!
- మూడు సార్లు భారత జట్టు నెహ్రూ కప్ అంతర్జాతీయ టోర్నీ (2007, 2009, 2012) టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు.
- దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) చాంపియన్‌షిప్‌ల్లో భారత్ మూడు (2011, 2015, 2021) టైటిల్ విజయాలకు కృషి చేశాడు.
- 2008లో ఏఎఫ్‌సీ చాలెంజ్ కప్‌ను గెలిపించిన ఛెత్రి, ఏడుసార్లు 'ఏఐఎఫ్‌ఎఫ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచాడు. భారత్‌లోని ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్‌లైన ఈస్ట్ బెంగాల్, డెంపో, ముంబై సిటీ ఎఫ్‌సీ, బెంగళూరు ఎఫ్‌సీలకు ప్రాతినిధ్యం వహించాడు. ఆయా జట్లకు లీగ్ ట్రోఫీలు అందించాడు.

'అతనో ఫుట్‌బాల్ శిఖరం'

భారత బ్యాటింగ్ కింగ్ కోహ్లి, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా తదితరులంతా ఛెత్రి ఘనతల్ని కొనియాడారు. సోషల్ మీడియా వేదికగా వారంతా అతనొక రియల్ లెజెండ్‌గా కితాబిచ్చారు. బీసీసీఐ, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ సైతం ఛెత్రి సేవలకు సెల్యూట్ చేశాయి.





సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్, కోచ్ వెటోరి

ప్లే ఆఫ్స్‌కు సన్‌రైజర్స్

- 15 పాయింట్లతో మూడో స్థానానికి హైదరాబాద్
- గుజరాత్‌తో మ్యాచ్ రద్దు
- భారీ వర్షంతో సాధ్యం కాని ఆట
- ఆదివారం పంజాబ్‌తో ఆఖరి పోరు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరాన్ని ముంచెత్తిన వాన దెబ్బ ఐపీఎల్ మ్యాచ్‌పై కూడా పడింది. గురువారం కురిసిన భారీ వర్షానికి ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ రద్దయింది. వాన తెరిపినివ్వకపోవడంతో కనీసం టాస్ కూడా వేసే అవకాశం రాలేదు. మధ్యాహ్నం తర్వాత కురిసిన వానకు నగరం మొత్తం జలమయమైంది. రాజీవ్‌గాంధీ స్టేడియంలో కూడా అవుట్‌ఫీల్డ్‌ను కవర్స్‌తో కప్పేశారు. అయితే ఏ దశలోనూ వాన పూర్తిగా ఆగలేదు. టాస్ కాస్త ఆలస్యం కాగా... నిర్ణీత రాత్రి 7:30 గంటల సమయంలో కాస్త తగ్గినట్లు అనిపించింది. కానీ వెంటనే చిరు చినుకులతో మొదలై మళ్లీ విరామం లేకుండా కురిసింది. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ నిర్వహించాలన్నా రాత్రి 10:15 గంటలకు పూర్తిగా వాన ఆగాలి. కానీ అలా జరగలేదు. దాంతో అంపైర్లు గ్రౌండ్‌ను పరిశీలించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. గుజరాత్ జట్టు వరుసగా రెండో మ్యాచ్ కూడా రద్దు కావడం గమనార్హం. ఈ ఫలితంతో సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌ల తర్వాత 15 పాయింట్ల వద్ద మూడో స్థానంలో నిలిచింది. దాంతో టీమ్‌కు ప్లే ఆఫ్స్ స్థానం ఖాయమైంది. ఆదివారం సన్‌రైజర్స్ సొంతగడ్డపైనే పంజాబ్ కింగ్స్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ గెలిచి... అదే రోజు రాత్రి కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తమ చివరి మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ ఓడితే సన్‌రైజర్స్‌కు రెండో స్థానం ఖాయమవుతుంది. 2020లో చివరిసారి ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 2021, 2022, 2023 సీజన్లలో వరుసగా 8వ, 8వ, 10వ స్థానాల్లో నిలిచింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
చెన్నై	13	7	6	0	14	0.528
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లక్నో	13	6	7	0	12	-0.787
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై X లక్నో
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఒలింపిక్స్‌కు శ్రీజ

'పారిస్' విశ్వ క్రీడల్లో పాల్గొనే భారత టీటీ జట్ల ప్రకటన



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లను అఖిల భారత టేబుల్ టెన్నిస్ సంఘం (టీటీఎఫ్‌ఐ) గురువారం ప్రకటించింది. మే 16న అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్ ప్రకారం భారత్ నుంచి టాప్–3లో ఉన్న క్రీడాకారులను జట్లలోకి ఎంపిక చేశారు. తొలిసారి టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడనుంది. పురుషుల, మహిళల టీమ్ విభాగంలో ముగ్గురి చొప్పున ఎంపిక చేయగా... ఈ ముగ్గురిలో టాప్–2లో ఉన్న ఇద్దరు సింగిల్స్ విభాగాల్లోనూ పోటీపడతారు. ఒక్కొక్కరిని రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. తుది జట్టులో ఎవరైనా గాయపడి అందుబాటులో లేకపోతే రిజర్వ్ ప్లేయర్‌ను ఆడిస్తారు. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్‌గా ఉన్న ఆచంట శరత్ కమల్ ఐదోసారి ఒలింపిక్స్‌లో పాల్గొనుండటం విశేషం. పారిస్ ఒలింపిక్స్ జూలై 24 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

భారత పురుషుల జట్టు: శరత్ కమల్, హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్, సత్యన్ జ్ఞానశేఖరన్ (రిజర్వ్). **భారత మహిళల జట్టు:** మనిక బత్రా, శ్రీజ, అర్చన కామత్, అహిక ముఖర్జీ (రిజర్వ్).

మనిక పరాజయం



కపాడోసియా (టర్కీ): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 24వ ర్యాంకర్ మనిక 11–5, 4–11, 5–11, 11–13తో హిటోమి సాటో (జపాన్) చేతిలో ఓడిపోయింది. భారత్‌కే చెందిన కృత్విక రాయ్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో కృత్విక 12–10, 11–4, 11–7తో వెరోనికా (ఉక్రెయిన్)పై నెగ్గింది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సానిల్ శెట్టి–హర్మీత్ దేశాయ్ (భారత్) ద్వయం 8–11, 11–6, 6–11, 6–11తో ఎస్టెబన్ డోర్–ఫ్లోరియన్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో పోమంతి బైస్యా–కృత్విక రాయ్ (భారత్) జంట 11–7, 11–1, 14–12తో ఫ్రాన్‌జిస్కా (జర్మనీ)–యశస్విని (భారత్) జోడీపై గెలిచి ఫైనల్ చేరింది.

క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం మరో విజయం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్–చిరాగ్ జోడీ 21–16, 21–11తో జి సావో నాన్–జెంగ్ వె హాన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మైస్నం మిరాబా లువాంగ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ మణిపూర్ ఆటగాడు 21–14, 22–20తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీ కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన అశ్విని–తనీషా ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–19, 21–17తో హంగ్ ఎన్ జు–లిన్ యు పె (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అష్మిత (భారత్) 15–21, 21–12, 12–21తో హాన్ యువె (చైనా) చేతిలో ఓడిపోయింది.

అర్జున్‌కు రెండో గెలుపు



న్యూఢిల్లీ: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్‌కు రెండో విజయం లభించింది. గురువారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో అర్జున్ 44 ఎత్తుల్లో నికోలోజి కచరావా (జార్జియా)పై గెలుపొందాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశాడు. సేతురామన్ (భారత్)తో జరిగిన గేమ్‌ను రిత్విక్ 61 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు.

క్లుప్తంగా...

వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లపై టీజీ

కేంద్ర ప్రభుత్వ గెజిట్ జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లపై రాష్ట్ర కోడ్‌గా టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఇకపై రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లపై టీఎస్ స్థానంలో టీజీ కోడ్ ఉండేలా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రకారం వాహనాల రిజిస్ట్రేషన్ సీరియల్ నంబర్ 29-ఏ, టీఎస్ కింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం వాహనాలపై రిజిస్ట్రేషన్ గుర్తు టీజీగా సవరిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

లాసెట్-2024 ప్రవేశ పరీక్షల టైంటేబుల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: లాసెట్-2024, పీజీఎల్‌సెట్(ఎల్ఎల్ఎం) ప్రవేశ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేశారు. జూన్ 3న మూడు విభాగాలుగా పరీక్షలు జరగనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి గురువారం తెలిపారు. లాసెట్ మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రవేశ పరీక్ష రెండు విభాగాలుగా జరుగుతుంది. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు, రెండో సెషన్ 12.30 గంటల నుంచి 2 గంటల వరకు ఉంటుంది. మూడో సెషన్‌లో 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం (లా పీజీసెట్-2024) ప్రవేశ పరీక్ష సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ వివరించారు. ఇంతవరకు లాసెట్-2024కు దరఖాస్తు చేయని అభ్యర్థులు రూ. 2,000 అపరాధ రుసుముతో ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 25 వరకు ఎడిట్ చేసుకోవాలని సూచించారు. మే 30 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఆలస్యంగా బయల్దేరిన వందేభారత్

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్లవలసిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరవలసి ఉండగా, ఏకంగా ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విశాఖపట్టణం నుంచి సికింద్రాబాద్‌కు రావలసిన వందేభారత్ (20833) ఆలస్యంగా నడవడమే ఇందుకు కారణమని రైల్వే అధికారులు 'ఎక్స్' వేదికగా తెలిపారు. గురువారం ఉదయం 5.45 గంటలకు విశాఖ నుంచి బయల్దేరవలసిన ఈ ట్రైన్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు విశాఖ నుంచి బయల్దేరింది. దీంతో ఇది సికింద్రాబాద్‌కు ఆలస్యంగా చేరుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక కారణాలవల్లే ఈ జాప్యం జరిగినట్లు వివరించారు.

'ఆర్టీసీ విలీనం' అంతేనా?

గత ప్రభుత్వ హయాంలోనే 90 శాతం ప్రక్రియ పూర్తి

అమలుపై స్పందించని కాంగ్రెస్ సర్కారు

ప్రక్రియ మొదలయ్యాక ఇప్పటికే 1,800 మంది ఉద్యోగుల పదవీ విరమణ

సాక్షి, హైదరాబాద్: 'ఆర్టీసీ ఉద్యోగుల విలీన'ప్రక్రియ ఊసే లేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదున్నర నెలలు దాటినా, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై కిమ్మనటం లేదు. ఇప్పటికిప్పుడు సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తే, వారి జీతాలు పెంచాలి. దీంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుంది. 2015 నాటి వేతన సవరణ బకాయిలను చెల్లించేందుకే ప్రభుత్వం కిందామీదా పడుతోంది. ఈ తరుణంలో ఆర్టీసీ ఉద్యోగుల జీతాల భారాన్ని తలపైకెత్తుకోవటం ఎందుకన్న ఉద్దేశంతో దాన్ని పక్కనపెట్టిందన్న అనుమానాలున్నాయి. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఎన్ని పర్యాయాలు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నోరు మెదపటం లేదు.

2019లోనే విలీనంపై చర్చ

- ఆర్టీసీలో 2019లో సుదీర్ఘ సమ్మె జరిగిన సమయంలో ఉద్యోగుల విలీనంపై కొంత చర్చ జరిగింది. అప్పట్లో కాంగ్రెస్ నేతలు కూడా నాటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ తర్వాత అది చల్లారిపోయింది.
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనూహ్యంగా 2023 ఆగస్టులో విలీనం అంశాన్ని ఉన్నట్టుండి తెర పైకి తెచ్చింది.
- అదే నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దానిపై సానుకూలత వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు కూడా ప్రవేశపెట్టారు.
- సెప్టెంబర్ మొదటివారంలో బిల్లుపై గవర్నర్ ఆమోదముద్ర వేయటంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారినట్టు అయ్యింది.
- విధివిధానాలకు ఓ కమిటీ ఏర్పాటు చేసి వదిలేసింది.
- అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో ఆ ప్రక్రియ అక్కడితో ఆగిపోయింది.

ఎన్నికల హామీలో ఉంది.. నిలబెట్టుకోవాలి

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున వెంటనే, ఆ హామీని నెరవేర్చాలి. విలీనం కోసం ఉద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్నామన్న ఆవేదన నుంచి ఉపశమనం పొందే ఆ ప్రక్రియను వెంటనే చేపట్టి వారికి న్యాయం చేయాలి.

–అశ్వత్థామరెడ్డి, ఆర్టీసీ కార్మిక సంఘం నేత

కొత్త కమిటీ వేసి నివేదిక తెప్పించాలి

విలీన ప్రక్రియ 90 శాతం పూర్తయింది. విధివిధానాలకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ వద్దనుకుంటే ఈ ప్రభుత్వం కొత్త కమిటీ వేసి వీలైనంత తొందరలో నివేదిక తెప్పించుకొని దాన్ని అమలు చేయాలి. ఆర్టీసీ ఉద్యోగుల జీతాలు కూడా పెరిగేందుకు ప్రభుత్వం సహకరించినట్టవుతుంది.

– మర్రి నరేందర్

ఉద్యోగుల్లో తీవ్ర నైరాశ్యం

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక వేతన సవరణ ఉన్నందున వీరికి పీఆర్సీ వర్తించదు. విలీనమయితేనే పీఆర్సీ పరిధిలోకి వస్తారు. జీతాలు కూడా కాస్త అటూ ఇటుగా ప్రభుత్వ ఉద్యోగుల దరికి చేరుతాయి,. అయితే విలీన ప్రక్రియ కాలయాపన జరిగే కొద్దీ, పదవీ విరమణ పొందే ఆర్టీసీ ఉద్యోగులు ఆ లబ్ధికి దూరమవుతున్నారు. ఇప్పటికే 1,800 మంది పదవీ విరమణ పొందారు. ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొందితే ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలుంటాయి. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో రోజురోజుకూ ఆందోళన పెరుగుతోంది.

ఆ థియేటర్లలో బొమ్మ పడదు

- నేటి నుంచి మూతపడనున్న సింగిల్ స్క్రీన్ థియేటర్లు
- రాష్ట్రంలో దాదాపు 350పైనే..



సాక్షి, హైదరాబాద్: థియేటర్ల మూసివేత విషయం ఎగ్జిబిటర్ల అసోసియేషన్ సమష్టి నిర్ణయం కాదని... నష్టాలను మూటకట్టుకోవడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నామని సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానులు చెబుతున్నారు. కొత్త సినిమాలు వచ్చేవరకు అంటే...శుక్రవారం నుంచి కనీసం పది రోజులపాటు ఏ బొమ్మా పడదు. జనవరి తర్వాత జూన్ వరకు పెద్ద హీరోల సినిమాలు ఒక్కటి కూడా విడుదల కావడం లేదని, చిన్న సినిమాలు వచ్చినా.. అవి ప్రేక్షక ఆదరణ లేని కారణంగా రోజు అయ్యే వ్యయంలో కనీసం పదిశాతం ఆదాయం కూడా రావడం లేదని ఎగ్జిబిటర్ చారి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు.

మల్టీప్లెక్స్‌లకు పర్సెంటేజీ రూపంలో లాభాలు

సినిమా డిస్ట్రిబ్యూటర్లు కూడా మల్టీప్లెక్స్‌లకు ఒక విధంగా, సింగిల్ థియేటర్లను మరోలా చూస్తున్నారన్న వాదన కూడా ఎగ్జిబిటర్ల నుంచి వినిపిస్తోంది. మల్టీప్లెక్స్‌లో ఒక సినిమా వారంరోజులు నడిస్తే.. వచ్చే ఆదాయంపై పర్సెంటేజీ రూపంలో లాభాలు ఇస్తుంటే.. సింగిల్ థియేటర్లకు అయితే కేవలం అద్దె ప్రాతిపదికన డబ్బు చెల్లిస్తున్నారని, అద్దె చెల్లించడానికి వచ్చే ఆదాయం కంటే తక్కువ కలెక్షన్లు వచ్చినప్పుడు పర్సెంటేజీ లెక్కన తీసుకోమంటున్నారని థియేటర్ల యజమానులు చెబుతున్నారు. పెద్ద హీరోల సినిమాలు రావడానికి చాలా సమయం పడుతుండడంతో.. థియేటర్లకు ప్రేక్షకులు రావడం తగ్గుతోందని, దానికితోడు ఓటీటీల్లోనూ సినిమాలు వస్తుండడంతో.. థియేటర్లకు ఆదరణ తగ్గుతోందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సుదర్శన్ థియేటర్ యజమాని గోవింద్‌రాజు తెలిపారు.

అది ఎగ్జిబిటర్ల వ్యక్తిగత నిర్ణయం..

రెండువారాలపాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిపివేయాలన్న నిర్ణయంతో తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్స్ ఆఫ్ కామర్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అధ్యక్షుడు సునీల్‌నారంగ్, కార్యదర్శి కె.అనుపమ్‌రెడ్డి స్పష్టం చేశారు.

చిత్రసీమ అపెక్స్ బాడీకి నోటీసు ఇవ్వలేదు..

తెలంగాణ, ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిపివేయాలన్న నిర్ణయానికి చిత్ర పరిశ్రమ అపెక్స్‌బాడీలైన తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలికి గాని ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని చలనచిత్ర వాణిజ్య మండలి కార్యదర్శి టి. ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రేక్షకులు లేని కారణంగా ప్రదర్శనలు రద్దు చేయడమైందని గతంలోనూ బోర్డులు పెట్టేవారని ఆయన గుర్తు చేశారు.

జలశక్తి అభియాన్ అవార్డుకు అంగడి కిష్టాపూర్ పాఠశాల నామినేట్



అంగడికిష్టాపూర్ పాఠశాలను సందర్శించిన అధికారులు

మర్కూక్(గజ్వేల్): జలశక్తి అభియాన్ 2023-జాతీయ అవార్డుకు సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం అంగడి కిష్టాపూర్ పాఠశాల నామినేట్ అయ్యింది. రాష్ట్రం తరఫున ఒకే ఒక్క పాఠశాల నామినేట్ కావడం ఇదే తొలిసారి. వర్షపు నీటిని సంరక్షించేందుకు ప్రజల భాగస్వామ్యంతో గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించి, వర్షపు నీటిని పైపుల ద్వారా గుంతలోకి పంపించి, భూగర్భ జలాలను పెంపొందించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. గురువారం సెంట్రల్ వాటర్ కమిషనర్ (సీడబ్ల్యూసీ) అధికారి వెంకటేశ్వర్లు, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు శాస్త్రవేత్త సుధీర్ కుమార్ పాఠశాలను సందర్శించి నీటి సంరక్షణ భూగర్భ జలాల పెంపుదలకు అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఏపీడీ సతీశ్‌కుమార్, ఎంఈఓ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు

బీపీతో హార్ట్‌ఎటాక్



బీపీ అదుపులో ఉంటే గుండెపోటు మరణాలను సగం తగ్గించవచ్చు

ఏటా భారత్‌లో 16 లక్షల మంది బీపీతో చనిపోతున్నారు

ప్రపంచవ్యాప్తంగా మరణాలకు మొదటి ప్రధాన కారణం అధిక బీపీనే

ఐసీఎంఆర్, డబ్ల్యూహెచ్‌వో, కేంద్ర ఆరోగ్యశాఖ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీపీతో గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయి. భారత్‌లో ఏటా అధిక రక్తప్రసరణతో వచ్చే గుండెపోటు, పక్షవాతంతో 16 లక్షల మంది చనిపోతున్నారు. ప్రపంచంలో సంభవించే మరణాలకు మొదటి ప్రధాన కారణం బీపీ ఎక్కువగా ఉండటమే. రెండో కారణం శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, మూడోది డయేరియా, నాలుగోది ఎయిడ్స్, ఐదోది టీబీ, ఆరోది మలేరియా అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఉమ్మడి నివేదిక తేల్చిచెప్పింది. ఆయా సంస్థలు బీపీని కట్టడి చేసే విధానంపై నివేదిక రూపొందించాయి. 2017లో ప్రారంభమైన ఇండియన్ హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనీషియేటివ్ (ఐహెచ్‌సీఐ)ను ప్రపంచ ఆరోగ్య సంస్థ కొనియాడింది. 2025 నాటికి దేశంలో బీపీ రోగుల సంఖ్యను 25 శాతం తగ్గించాలని నిర్ణయించింది. ఐహెచ్‌సీఐ కార్యక్రమాన్ని ఈ మూడు సంస్థలు సంయుక్తంగా చేపట్టాయి. 25 రాష్ట్రాల్లోని 141 జిల్లాల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. 21,579 ఆరోగ్య కేంద్రాల్లో 30 కోట్ల మందిని ఈ కార్యక్రమం పరిధిలోకి వచ్చారు. 19 రాష్ట్రాల్లో బీపీ నియంత్రణ ప్రొటోకాల్ తయారుచేశారు. ఈ కార్యక్రమం మొదటి దశ తెలంగాణ, పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ప్రారంభమైంది.

18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ...

భారత్‌లో 18 ఏళ్లు పైబడిన ప్రతీ నలుగురిలో ఒకరికి బీపీ ఉంది. అలా 20 కోట్ల మంది బీపీతో బాధపడుతున్నారు. అందులో సగం మందికి బీపీ ఉన్నట్లే తెలియదు. కేవలం 10 శాతం మందే బీపీని అదుపులో ఉంచుకుంటున్నారు. 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరికీ బీపీ చెక్ చేయాలని ఆ నివేదిక పేర్కొంది. 2025 నాటికి 4.5 కోట్ల మంది బీపీని అదుపులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- ఐహెచ్‌సీఐ కార్యక్రమం అమలయ్యే చోట నర్సులు, డాక్టర్లు ప్రత్యేకంగా ఉంటారు. అయితే, తెలంగాణ, మహారాష్ట్రల్లో మాత్రమే ప్రత్యేకంగా ఉన్నారు.
- తెలంగాణలో ఈ విధానం అమలులో ఉన్నందున ఏఎన్ఎంలు ఇళ్లకు వెళ్లి బీపీ చెక్ చేస్తున్నారు. ఫోన్ ద్వారా కూడా ఫాలోఅప్ చేస్తున్నారు.
- ఈ కార్యక్రమం కోసం సగటున ఒక వ్యక్తికి ఏడాదికి రూ. 200 మాత్రమే మందుల కోసం ఖర్చవుతుంది.
- బాధితులు ప్రొటోకాల్‌లో ఉన్న మందులను ఒక నెల అడ్వాన్స్‌లో ఉంచుకోవాలి.
- తెలంగాణ, పంజాబ్, మధ్యప్రదేశ్‌లలో 6 నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. కేరళలో నెల రోజులు, మహారాష్ట్రలో 2 నెలల స్టాక్ ఉంది.

బీపీ రోగులు వ్యాయామం చేయాలి



బీపీ రోగులు పొగాకు, మద్యం మానుకోవాలి. ఉప్పు ఒక స్పూన్‌కు తగ్గించుకోవాలి. ప్రతీ వారం రెండున్నర గంటల వ్యాయామం చేయాలి. రోజుకు నాలుగైదు సార్లు పండ్లు, కూరగాయలు తినాలి. తెలంగాణలో 18 ఏళ్లు పైబడిన వారందరికీ బీపీ చెక్ చేయాలన్న నియమం పెట్టుకున్నారు. కొన్ని రాష్ట్రాల్లో 30 ఏళ్లు పైబడిన వారికే బీపీ చూస్తారు. బీపీ ఉంటే ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దు. మందులు తప్పనిసరిగా వాడాలి.

-డాక్టర్ కిరణ్ మాదల, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం

మృత్యువుతో పోరాడి ఓడిన భవిక్‌రెడ్డి

స్పైనల్ మస్క్యులర్ అట్రోపీతో బాధపడిన చిన్నారి



భవిక్‌రెడ్డి(ఫైల్)

సాక్షి, యాదాద్రి: లక్షలో ఒకరికి వచ్చే ప్రాణాంతకమైన స్పైనల్ మస్క్యులర్ అట్రోపీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి భవిక్‌రెడ్డి(6) మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన కొలను దిలీప్‌రెడ్డి, యామిని దంపతుల కుమారుడు భవిక్‌రెడ్డి గురువారం మృతి చెందాడు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో న్యూరాలజిస్ట్ డాక్టర్ రమేశ్ కోణంకి పర్యవేక్షణలో భవిక్‌రెడ్డికి ఇన్నిరోజులు వైద్యం అందించారు. ఈ వ్యాధి నయం కావడానికి అమెరికాలో దొరికే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఇవ్వాలని వైద్యులు సూచించారు. రెయిన్‌బో ఆస్పత్రి సౌజన్యంతో ఇప్పటివరకు విదేశాల నుంచి దాతల ద్వారా రూ. 10 కోట్ల విరాళాలు అందాయి. మిగతా రూ. 6 కోట్లు మన దేశంలోనే సమకూర్చుకోవాలని చెప్పడంతో ప్రభుత్వం, దాతలు సహకరించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకున్నారు. చిన్నారి దీనస్థితిపై 'ఇంజెక్షన్ ఖరీదు 16 కోట్లు... సాయం చేయండి' అనే శీర్షిక 'సాక్షి' మెయిన్ పేజీలో గురువారం ప్రత్యేక కథనం కూడా ప్రచురితమైన సంగతి తెలిసిందే.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.